RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి ®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 20 సంచిక:30 హైదరాబాద్, శనివారం, 12 జూలై 2025 పేజీలు: 12 వెల: 1.00

## ప్రభుత్వ పాఠశాలల్లో అక్షర జ్యోతులు వెలుగుతున్నాయి: సీఎం రేవంత్

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో భారీ సంఖ్యలో విద్యార్థులు చేరుతున్నారు. వీటికి సంబంధించి మీడియాలో వచ్చిన కథనాలను సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా షేర్ చేస్తూ ప్రభుత్వ టీచర్లు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు.

"పదేళ్ల చీకట్లను పారదోలి.. ప్రభుత్వ పాఠశాలల్లో అక్షర జ్యోతులు వెలుగుతున్నాయి. పేద బిడ్డల చదువుల గుడులు అక్షర మంత్రోశ్ఛరణలతో పవిత్రతను సంతరించుకున్నాయి. సర్కారు బడికి గత పాలకులు వేసిన తాళాలు బద్ధలవుతున్నాయి. పాఠశాలల్లో కనిపిస్తోన్న ఈ గుణాత్మక మార్పు తెలంగాణ భవిష్యత్తు గమనానికి సంకేతం. ప్రజా ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనం. ఈ అక్షర యజ్ఞంలో చేతులు కలిపిన ప్రతి ఒక్కరికీ అభినందనలు''అని సీఎం పేర్కొన్నారు.



## కర్ణాటక తరహాలో మా ప్రభుత్వంలో పవర్ షేరింగ్ లేదు: భట్టి విక్రమార్క

దిల్లీ: కర్ణాటక తరహాలో తమ ప్రభుత్వంలో పవర్ షేరింగ్ అంటూ ఏమీ లేదని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అందరం కలిసి టీం వర్క్ చేస్తున్నామని చెప్పారు. దిల్లీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు.

"భారత రాష్ట్ర సమితి నేతల మాటలు మితిమీరి పోయాయి. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదు.. జనాల్లోకి వెళ్లడం లేదు. రూ. రెండు లక్షలు దాటిన వారికి రుణమాఫీ చేయొద్దన్నది మా ప్రభుత్వ విధాన నిర్ణయం. రేషన్‌కార్డు ఆధారంగానే రుణమాఫీ చేశాం. సన్నం బియ్యం సక్సెస్ అయ్యింది. గతంలా పక్కదారి పట్టడం లేదు. ఉచిత బస్సుకు మహిళల నుంచి మంచి స్పందన ఉంది. మరో 3వేల బస్సులు కొనుగోలు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాం.

ఫోర్త్ సిటీ పనులు జరుగుతున్నాయి. మూసీ సుందరీకరణ ఈ ప్రభుత్వ హయాంలోనే పూర్తవుతుంది. గాంధీ ఘాట్ వరకు సుందరీకరణ జరిగి తీరుతుంది. దీనికి సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. రీజినల్ రింగ్ రోడ్డు కూడా వస్తుంది. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చే అవకాశం లేదు. సిగాచీ ప్రమాదంపై విచారణకు ఆదేశించాం. ఇటీవల జరిగిన రాష్ట్ర



కాంగ్రెస్ పీఏసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, కేసీ వేణుగోపాల్ ప్రభుత్వ తీరుపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు" అని భట్టి విక్రమార్క తెలిపారు.

## బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్.. రైల్ రోకో వాయిదా: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని తెలంగాణ బీసీ బిడ్డలు, జాగృతి విజయంగా భావిస్తున్నామని ఎమ్మెల్సీ కవిత ( అన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా ఒత్తిడి తేవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. అంతకుముందు బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి జాగృతి శ్రేణులతో ర్యాలీగా లోయర్ ట్యాంక్‌బండ్‌కు వెళ్లారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆమె నివాళులర్పించారు.

"స్థానిక ఎన్నికలకు ముందే 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో ఈనెల 17న చేపట్టిన రైల్ రోకో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నాం. అయితే మాకు కొన్ని అనుమానాలు కూడా ఉన్నాయి. ఆర్డినెన్స్ ఇచ్చి వెంటనే రిజర్వేషన్లు అమలు చేయగలిగితే అధికారంలోకి వచ్చిన 18 నెలలు ఎందుకు ఆగారు? రాజకీయ లబ్ధి కోసమే అలా చేశారని మేం భావిస్తున్నాం. కాంగ్రెస్ ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే రిజర్వేషన్ల చుట్టూ రాజకీయాలు చేస్తున్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఇబ్బంది పడుతున్నారు. రాజ్యాంగ సవరణ జరిగితే బీసీలకు రాజకీయంగా హక్కులు లభిస్తాయి. విద్య, ఉద్యోగాల గురించి కూడా ప్రభుత్వం చెప్పాలి. కేంద్రంలో అధికారంలో ఉన్నందున భాజపా అనుకుంటే ఒకే ఒక్క నిమిషంలో రాజ్యాంగ సవరణ చేసి ఇవ్వగలదు.. కానీ ఇవ్వడం లేదు. దోషమంతా కాంగ్రెస్‌పై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారేమో. ప్రజలు గమనిస్తున్నారు. బీసీ బిల్లును షెడ్యూల్-9లో పెట్టాలి. దీనికోసం బీసీ బిడ్డ, కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలి. ఆర్డినెన్స్ తీసుకొస్తామని చెప్పినందున ఈ వారం రోజులు ప్రభుత్వ కార్యాచరణను గమనిస్తాం. దీనిపై ముందుకెళ్లకపోతే రైల్ రోకో చేపడతాం" అని కవిత అన్నారు.

## భారీ భవనాల నిర్మాణంలో పర్యావరణానికి పెద్దపీట వేయాలి: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, పట్టణీకరణ, కాలుష్యం, కర్బన ఉద్గారాల పెరుగుదల వంటి ఎన్నో సమస్యలకు పర్యావరణహిత నిర్మాణాలు పరిష్కారం చూపుతాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఆ దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని, ఈ ప్రయాణంలో భాగస్వాములు కావాలని సివిల్ ఇంజినీర్లను కోరారు. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్, హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో "నెక్స్ట్-జెన్ హై-రైజ్ బిల్డింగ్స్" అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సును మంత్రి శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ రంగం 11.97 శాతం వృద్ధి రేటును నమోదు చేసి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80,000 కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చిందని చెప్పారు. ఈ గణాంకాలు తెలంగాణ నిర్మాణ రంగ ప్రగతికి నిదర్శనమన్నారు. హైదరాబాద్‌లో 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న భవనాల సంఖ్య 200పైగానే ఉన్నాయని, మరో 250 భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ తరహా భారీ భవనాల నిర్మాణంలో పర్యావరణానికి పెద్దపీట వేయాలని సూచించారు. కాంపోజిట్



స్టీల్ హై-రైజ్ డిజైన్‌పై జాతీయస్థాయిలో ఒకే రకమైన మార్గదర్శకాలు తెచ్చేలా కేంద్రం, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌తో కలిసి పని చేస్తామన్నారు. సంప్రదాయబద్ధంగా కాకుండా ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వినూత్నంగా ఆలోచించాలని, కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని యువ సివిల్ ఇంజనీర్లకు హామీ ఇచ్చారు.

## సీఎం ఇచ్చింది అది కవర్ పాయింట్ ప్రజెంటేషన్...

## పీసీ ఘోష్ కమిషన్ కు అదనపు సమాచారం అందించాం

### మాజీ మంత్రి హరీష్ రావు

హైదరాబాద్

పీసీ ఘోష్ కమిషన్ కు అదనపు సమాచారం అందించిన అనంతరం మీడియాతో మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు.

కమిషన్ ని కలిసి అదనపు సమాచారం అందించాం. కమిషన్ నిన్న సమయం ఇచ్చారు. నిన్న కేసీఆర్ కి వైద్య పరీక్షలు ఉన్న నేపథ్యంలో రాలేకపోతున్నాను అని కమిషన్ ను రిక్వెస్ట్ చేయగా అంగీకరించారు. ఇచ్చిన సమయం ప్రకారం, ఈరోజు కమిషన్ ను కలిసి మా వద్ద ఉన్న అదనపు సమాచారం అందించాం. మీడియాలో వస్తున్న తప్పుడు వార్తలను దృష్టిలో పెట్టుకొని మా వద్ద ఉన్నంత మేరకు కమిషన్ కు స్పష్టమైన సమాచారం ఇచ్చాం. మేం ఇప్పుడు ప్రభుత్వంలో లేము. డాక్యుమెంట్స్ అన్ని ప్రభుత్వం వద్ద ఉంటాయని అన్నారు.

సమాచారం కోసం చీఫ్ సెక్రెటరీ, జీఏడీ సెక్రెటరీ, ఇరిగేషన్ సెక్రెట్రరీ గారికి లేఖ రాసాను. ఆ రోజుల్లో తీసుకున్న క్యాబినెట్ నిర్ణయాలు, క్యాబినెట్ నోట్ వంటి సమాచారం కావాలని లేఖల రూపంలో అడిగాను. కాని వారి నుంచి స్పందన రావడం లేదు. మా వద్ద అందుబాటులో ఉన్న సమాచారం క్రోడీకరించి నోట్ రూపంలో ఇవ్వడం జరిగింది. మా సమాచారం అధారంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి ఆరు సార్లు క్యాబినెట్ నిర్ణయాలు జరిగాయి. ఆరు సార్లు క్యాబినెట్ ఆమోదం పొందిన డాక్యుమెంట్లు కమిషన్ కు అందించాం. అంతే కాదు మూడు సార్లు శాసన సభ ఆమోదం కూడా పొందిందని అన్నారు.

ఎప్పుడెప్పుడు జరిగాయి, జరిగిన చర్చ, ఇతర అంశాలను కమిషన్ కు అందించాం. లెజిస్టేచర్ అప్రూవల్ క్యాబినెట్ కంటే కూడా ఉత్తమం అయినటువంటిది. ఆరు సార్లు క్యాబినెట్ అప్రూవల్ వివరాలను, మూడు సార్లు అసెంబ్లీ ఆమోదం, చర్చ వివరాలను కమిషన్ కు డాక్యుమెంట్లతో సహా అందించాం. కమిషన్ ఆన్ గోయింగ్ కనుక ఆ వివరాలు బయట పెట్టలేను. సందర్భం వచ్చినప్పుడు పూర్తిగా ఆ వివరాలు బయట పెడతాం. ఇంతకు మించిన వివరాలు ఉన్నాయి, కానీ ప్రభుత్వం మాకు అడిగినా ఇవ్వడం లేదు. కమిషన్ కు అందించిన సమాచారం మాకు ఇవ్వాలని అడిగితే ప్రభుత్వం ఇవ్వడం లేదు. పారదర్శకంగా ఉండాలనుకుంటే మాకు ఆ వివరాలు ఎందుకు ఇవ్వడం లేదు. కమిషన్ ను తప్పుదోవ పట్టించేలా వివరాలను ఈ ప్రభుత్వం అందిస్తుందనే అనుమానం మాకు ఉందని అన్నారు..

అది కవర్ పాయింట్ ప్రజెంటేషన్...

మొన్న ముఖ్యమంత్రి ఇచ్చింది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కాదు, 50 ఏండ్ల కాంగ్రెస్ ద్రోహ చరిత్రకు కవర్ పాయింట్ ప్రజెంటేషన్. వందలాది మంది ద్రోహులను పొట్టన పెట్టుకున్నది కాంగ్రెస్. తెలంగాణను ఆంధ్రతో కలిపింది కాంగ్రెస్. నీళ్ల వదిలిపెట్టి తెలంగాణకు ద్రోహం చేసింది కాంగ్రెస్ పార్టీ. అజ్ఞానం, అహంకారంతో రేవంత్ రెడ్డి ఇష్టం ఉన్నట్లు మాట్లాడారు. 299:512 శాశ్వత ఒప్పందం చేసుకున్నారని పదే పదే అబద్ధం చెప్పడం సిగ్గుచేటు. తాత్కాలిక నీటి వినియోగం, నీటి పంపకానికి తేడా తల్వకుండా రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడు. నీటి వినియోగం కేఆర్‌ఎంబీ చేస్తుంది, నీటి పంపకం ట్రిబ్యునల్ చేస్తుంది. నీటి వినియోగం ఆ ఏడాదికి మాత్రమే పరిమితం, నీటి పంపకం శాశ్వతమైంది. శాశ్వతంతా పంపిణీకి సంతకాలు పెట్టామని చెప్పడం పచ్చి అబద్ధం. ఉమ్మడి ఏపీలో నాటి కాంగ్రెస్ పాలకులు ఇదే జానారెడ్డి, ఉత్తం, కోమటి రెడ్డి వంటి చేతగాని నాయకుల వల్ల, పెదవులు మూసుకోవడం వల్ల 299 మనకు కేటాయించడం జరిగిందని అన్నారు.

అహంకారం, వెటకారం వదిలి తెలంగాణకు ఉపకారం చేసే మంచి బుద్ధితో నడుచుకో రేవంత్ రెడ్డి. అజ్ఞానం అని రేవంత్ ను బాధతో అంటున్న. గోదావరిలో 1000, కృష్ణలో 500 ఇచ్చి ఎన్ని నీళ్లన్నా తీసుకుపో అని చంద్రబాబుకు రేవంత్ ఆఫర్ ఇచ్చిండు. ఇది అజ్ఞానం కాదా. గోదావరిలో మన వాటా 1000 కాదు, 2918 కావాలని కేసీఆర్ అడిగారు. ఇదే విషయం బయట పెడితే నాలుక కరుచుకున్నరు. అజ్ఞానాన్ని సవరించుకునే ప్రయత్నం చేసిండు. రేవంత్ రెడ్డి మాత్రమే ఉత్తం కూడా అజ్ఞానిలా మాట్లాడుతున్నారు. నీటిపారుదల శాఖ మంత్రిగా ఉండి మన నీటి హక్కుల గురించి తెలవక పోవడం బాధాకరమని అన్నారు.

## నా చివరి శ్వాస వరకు హిందుత్వం కోసమే పనిచేస్తా: రాజాసింగ్



హైదరాబాద్: హిందుత్వం కోసమే తన చివరి శ్వాస వరకు పనిచేస్తానని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ( అన్నారు. ఇటీవల భాజపాకు ఆయన చేసిన రాజీనామాను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శుక్రవారం ఆమోదించారు. ఈ నేపథ్యంలో రాజాసింగ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

"హిందుత్వ భావజాలంతో దేశానికి, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో సరిగ్గా 11 ఏళ్ల క్రితం భాజపాలో చేరాను. పార్టీ నన్ను నమ్మి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు గోషామహల్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నా రాజీనామాను ఇవాళ భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆమోదించారు. తెలంగాణలో భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ రాత్రీపగలు పనిచేస్తున్న లక్షలాది భాజపా కార్యకర్తల బాధను నేను అధిష్ఠానానికి తెలియజేయలేకపోవచ్చు. ఏ పదవి, అధికారం, వ్యక్తిగత లబ్ధి కోసమో రాజీనామా చేయలేదు. నేను హిందుత్వం కోసమే పుట్టాను.. చివరి శ్వాస వరకు దానికోసమే పనిచేస్తాను" అని రాజాసింగ్ పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఏం సంబంధం..?

న్యాఢిల్లీ, జులై 11: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు.. బీసీ బిల్లుకు ఏం సంబంధమని ప్రభుత్వ వీప్ ఆది శ్రీనివాస్ సందేహం వ్యక్తం చేశారు. ఈ బిల్లు ఆమోదం పొందడంపై ఆమె హడావుడి చేస్తుందంటూ మండిపడ్డారు. బీసీ బిల్లును సైతం కవిత హైజాక్ చేస్తుందని ఆరోపించారు. అయినా ఈ బిల్లు ఆమోదం పొందడంలో నీ పాత్ర ఏమిటంటూ కల్వకుంట్ల కవితను ఈ సందర్భంగా ఆయన సూటిగా ప్రశ్నించారు. బీసీలపై మొసలి కన్నీరు కార్చడం మానేయాలంటూ ఆమెకు ఆది శ్రీనివాస్ హితవు పలికారు.

భారత శక్తి
VOICE OF INDIAN

# వరుస విమాన ప్రమాదాలు... శిక్షణ లోపమా

భారత సైన్యంలో ఎయిర్‌ఫోర్స్ ఎంతో కీలకమైనది. మారుతున్న యుద్ధ రీతులతో ఇప్పుడు ఎయిర్‌ఫోర్స్ ప్రాధాన్యత పెరిగింది. గతంలో చేసిన సర్జికల్ స్ట్రైక్, ఇటీవల పహల్గాం ఉగ్రదాడకి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో నేవీ,ఎయిర్‌ఫోర్స్ కీలకంగా వ్యవహరించాయి. అయితే యుద్ధాల్లో మరణించిన వారిని వీరుడు అంటారు. కానీ, మన పైలట్లు.. యుద్ధం చేయకండానే దుర్మరణం చెందుతున్నారు. ఇటీవలి శిక్షణ విమాన ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గడిచిన కొన్ని నెలల్లో జాగ్వార్, మిరాజ్ వంటి యుద్ధ విమానాలు కూలిపోవడంతో సుశిక్షిత పైలట్లు ప్రాణాలు కోల్పోతున్నారు. 2017?2022 మధ్య 20 యుద్ధ విమానాలు, ఏడు హెలికాప్టర్లు, ఆరు శిక్షణ విమానాలు, ఒక కార్గో విమానం కూలినట్లు ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించింది. ఈ నేపథ్యంలో, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఒక పోస్టు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పాత విమానాలు, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్) నిర్వహణ, శిక్షణ సమస్యలపై కీలక చర్చను లేవనెత్తుతోంది.మిగ్?21 విమానాలు భారత వైమానిక దళంలో దశాబ్దాలుగా కీలక పాత్ర పోషిస్తున్నాయి. 1963లో ఇంపోర్ట్‌తో ప్రారంభమై, నాసిక్‌లోని హెచ్‌ఏఎల్ వద్ద అసెంబుల్ చేయబడిన ఈ విమానాల ఉత్పత్తి 1985లో నిలిచిపోయింది. అయినప్పటికీ, ఈ 40 ఏళ్ల పాత విమానాలను అవియానిక్స్ అప్‌డేట్‌లు, నిర్వహణతో ఇప్పటికీ ఉపయోగిస్తున్నారు. ఈ విమానాలు శిక్షణ సమయంలో జరిగిన టెస్ట్ ఫ్లైట్‌లలో అనేకసార్లు కూలిపోయాయి, దీని వల్ల 170 మంది సుశిక్షిత పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. ఒక్కో పైలట్‌ను శిక్షణ ఇచ్చి, యుద్ధ విమానాన్ని నడపగలిగే స్థాయికి తీసుకురావడానికి దాదాపు 50 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా. అయినప్పటికీ, ఈ విమానాలను 2025 డిసెంబర్ వరకు సర్వీసు నుంచి తొలగించేందుకు నిర్ణయం తీసుకోవడం, నిర్వహణలో ఆలస్యాన్ని సూచిస్తుంది.మిగ్?21ల స్థానంలో జాగ్వార్ విమానాలు వస్తున్నాయి, కానీ ఇవి కూడా 1979లో ఇండక్ట్ అయిన పాత విమానాలే. హెచ్‌ఏఎల్ నిర్మించిన ఈ విమానాలు కూడా తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇటీవల జరిగిన ఒక ప్రమాదంలో ఇద్దరు యువ పైలట్లు మరణించారు, ఇది జాగ్వార్ విమానాల నిర్వహణ, ఆధునీకరణ సమస్యలపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఐదు నెలల్లో మూడు జాగ్వార్ విమానాలు కూలిపోవడం, వీటి వయస్సు, నిర్వహణలో లోపాలను సూచిస్తోంది.హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) భారత్‌లో వైమానిక రంగంలో కీలక సంస్థగా ఉన్నప్పటికీ, దాని నిర్వహణ, ఉత్పత్తి నాణ్యతపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సామాజిక మాధ్యమ పోస్టులో హెచ్‌ఏఎల్‌ను 'హిందుస్థాన్ ఆముదం లిమిటెడ్' అని వ్యంగ్యంగా పేర్కొంటున్నారు. సంస్థపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ప్రతిబింబిస్తుంది. హెచ్‌ఏఎల్ వద్ద తయారైన విమానాలు తరచూ నిర్వహణ సమస్యలతో బాధపడుతున్నాయి, ఇది ప్రమాదాలకు ఒక కారణంగా చెప్పబడుతోంది. విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేయడంతో.. ప్రయాణికుల కోసం ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని ఇండిగో విమానయాన సంస్థ తెలిపిందికొన్ని రోజుల క్రితమే ఇలాంటి సంఘటనే చోటు చేసుకుంది. ఇండిగో సంస్థకు చెందిన విమానాన్ని పక్షి ఢీకొట్టింది. దీంతో విమానం కొంతమేర దెబ్బతింది. ఈ సంఘటన జరిగిన సమయంలో విమానంలో 175 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరంతా ఇండిగో విమానంలో పట్నా నుంచి కోల్‌కతా వెళ్తున్నారు. ఇక గతంలోనూ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయని అధికారులు తెలిపారు. పక్షులు ఢీకొట్టడం వల్ల విమానంలో సాంకేతిక లోపాలు తలెత్తిన సందర్భాలు చాలా ఉన్నాయని అధికారులు వెల్లడించారు.అదనంగా, 5వ తరం యుద్ధ విమానాలను తయారు చేస్తామని చెప్పడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.విమాన ప్రమాదాలు ఎక్కువగా శిక్షణ సమయంలో జరగడం ఆందోళనకరం. యుద్ధాల కంటే శిక్షణలోనే ఎక్కువ మంది పైలట్లు ప్రాణాలు కోల్పోవడం, శిక్షణ ప్రక్రియలో లోపాలను సూచిస్తుంది. పాత విమానాలను ఉపయోగించడం, సరైన నిర్వహణ లేకపోవడం, ఆధునిక శిక్షణ సౌకర్యాల కొరత వంటివి ఈ సమస్యలకు కారణాలుగా కనిపిస్తున్నాయి. ఒక్కో పైలట్ శిక్షణకు భారీ ఖర్చు చేస్తున్నప్పటికీ, ఈ ప్రమాదాలు ఆర్థిక, మానవ నష్టాలను కలిగిస్తున్నాయి.

# పాదయాత్రలే తారక మంత్రమా

విజయవాడ, జూలై 11, (

వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షు జగన్మోహన్ రెడ్డి మరోసారి పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నారు. ఇటీవల కార్యకర్తల సమావేశంలో కూడా ఆయన ప్రకటించారు. ఇప్పుడు వైసీపీ ముఖ్య నేత పేర్ని నాని కూడా ఇదే ప్రకటన చేశారు. కృష్ణా జిల్లాలో జరిగిన పార్టీ సమావేశంలో రెండేళ్ల తర్వాత వైయస్ జగన్ పాదయాత్ర స్టార్ట్ అవుతుందిని.. రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి జగన్ గారు వస్తారు.. మీతో మాట్లాడతారని పేర్ని నాని తెలిపారు ప్లీనరీ తర్వాత జిల్లా మీటింగ్స్.. ఆ తర్వాత పాదయాత్ర ఉంటుందన్నారు. రాష్ట్రంలోని ప్రజలతో నేరుగా సంబంధం బలోపేతం చేయడం, యువతను సమీకరించడానికి జగన్ పాదయాత్ర చేయాలనుకుంటున్నారు. జగన్ ఈ పాదయాత్రను 2029 ఎన్నికలకు ముందు పార్టీని పునరుద్ధరించేందుకు ఒక వ్యూహంగా ఖరారు చేసుకున్నారు. ఈ పాదయాత్ర జిల్లా స్థాయి సమావేశాలు , ప్లీనరీ సమావేశం తర్వాత ప్రారంభమవుతుందని ఇప్పటికే ప్రకటించారు. గతంలో జగన్ ప్రజా సంకల్ప యాత్ర పేరుతో 2017 నుంచి 2019 వరకు 3,648 కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. 341 రోజులలో 134 నియోజకవర్గాల గుండా పాదయాత్ర సాగింది. ఈ సారి పాదయాత్ర కూడా రాష్ట్రవ్యాప్తంగా గ్రామ స్థాయిలో ప్రజలతో మాట్లాడుతూ సాగుతుందని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పాదయాత్ర రాష్ట్రంలోని అన్ని జిల్లాలను కవర్ చేస్తుందని, ప్రత్యేకించి రైతులు, మహిళలు, యువత, మరియు వెనుకబడిన వర్గాల సమస్యలపై దృష్టి సారిస్తుందని జగన్ చెబుతున్నారు. 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో జూఖీఅఖ 151 నుండి 11 సీట్లకు పడిపోయింది. జగన్ తన పార్టీని పునరుద్ధరించేందుకు ఈ పాదయాత్ర మాత్రమే మార్గంగా భావిస్తున్నారు. పాదయాత్రకు ముందు, జగన్ జిల్లా స్థాయి పర్యటనలు చేపడతారు. ఏపీ రాజకీయాల్లో పాదయాత్రలకు ఓ ప్రత్యేకమైన స్థానం ఉంది. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేయడం ద్వారా 2014లో అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత ప్రతి ఎన్నికకు ముందు ప్రతిపక్ష నేతలు పాదయాత్ర చేయడం కామన్‌గా వస్తోంది. 2009లో చంద్రబాబు పాదయాత్ర చేయ లేదు కానీ.. బస్సు యాత్ర చేశారు. అయితే ఆ ఎన్నికల్లో టీడీపీ గెలవలేకపోయింది. 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు పాదయాత్ర చేశారు. ఆ సమయంలో జగన్మోహన్ రెడ్డి జైల్లో ఉన్నారు. జగన్ మోహన్ రెడ్డికి బదులుగా ఆయన సోదరి షర్మిల రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పాదయాత్ర చేశారు. కానీ టీడీపీ విజయం సాధించింది. ఆ తర్వాత 2019 ఎన్నికల కోసం జగన్ పాదయాత్ర చేశారు. ఆయన ఘన విజయం సాధించారు. మళ్లీ 2024 ఎన్నికల కోసం టీడీపీ కోసం నారా లోకేష్ పాదయాత్ర చేశారు. టీడీపీ ఘన విజయం సాధించింది. అదే ట్రెండ్ ను కొనసాగిస్తూ.. రెండేళ్ల పాటు పాదయాత్ర చేయాలని జగన్ నిర్ణయించుకున్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా టిడ్కో భవనాలు..


కాకినాడ, జూలై 11,

కాండ్రకోట గుర్తుంది కదా... గ్రామంలో అదృశ్య శక్తి తిరుగుతుందంటూ తీవ్ర అలజడి రేగడంతో నెల రోజుల పాటు ఆ గ్రామస్తులు కంటిమీద కునుకులేకుండా ఉన్నారు. అదిగో దెయ్యం అంటే ఇదిగో దెయ్యం అంటూ ఆగ్రామంలో తీవ్ర భయాందోళనల మధ్య ఎవ్వరిని కదిపినా భయపడుతూ దెయ్యం గురించి చెప్పిన వారే కనిపించారు. బోడసకుర్రు టిడ్కో భవనాల సముదాయం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా నిలుస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఫ్లాట్లు పొందిన వారిలో చాలా మందికి సొంత ఇళ్లు ఉన్నందున ఇక్కడకు వచ్చి నివాసం ఉండడం లేదని, అయితే వారు అద్దెలకు ఇవ్వడంతో కొంత మంది ఈ భవనాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, అలాగే ఇక్కడ పలు దొంగతనాలు కూడా జరుగుతున్నాయని, రాత్రి వేళల్లో అపరిచిత వ్యక్తులు కూడా ఇక్కడకు వస్తున్నారని అంటున్నారు.. అయితే దెయ్యం తిరుగుతుందన్న పుకార్లు కొందరు సృష్టించినవా లేక నిజంగా అదృశ్య శక్తి తిరుగుతుందా అన్నది తేలాల్సి ఉంది. అక్కడ లక్షల రూపాయలు ఖర్చుచేసి యజ్ఞాలు చేశారు. జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు వచ్చి ఇవి అపోహ మాత్రమే అంటూ మూఢనమ్మకాలను నమ్మవద్దు అంటూ అవగాహన కల్పించారు.. అక్కడ సద్దుమనిగింది.. ఇప్పుడు అటువంటి పరిస్థితే ఓ గ్రామంలో నెలకొంటోంది. రాత్రి అయితే చాలు బయటకు వచ్చేందుకు చాలా భయపడిపోతున్నారు. బాబోయ్ దెయ్యం తిరుగుతుందంటూ బెంబేలెత్తిపోతున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వైనతేయకు ఆనుకుని ఉన్న గ్రామమే బోడసకుర్రు.. ఇది 216 జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామం కాగా ఈ గ్రామంలో అమలాపురం పట్టణంలో ఇళ్లు లేని వారి కోసం 2016లో టిడ్కో భవనాలు నిర్మించింది అప్పటి ప్రభుత్వం.. ఈ భవనాలు నిర్మాణాలు పూర్తి అయిన లబ్ధిదారులకు ఇవ్వని క్రమంలో కోవిడ్ సమయంలో ఐసోలేషన్ వార్డులుగా ఈ భవనాలను ఆరోగ్యశాఖ ద్వారా వినియోగించారు. అప్పట్లో కోనసీమవ్యాప్తంగా కోవిడ్ బారిన పడి ఐసోలేషన్‌లో ఉండాల్సిన వారిని ఇక్కడికే తరలించి వారికి భోజన, వైద్య సదుపాయాలు కల్పించింది అప్పటి ప్రభుత్వం.. ఆ తరువాత వీటిని లబ్ధిదారులకు అందించింది. అప్పటి నుంచి ఈ టిడ్కో భవనాల్లో ఫ్లాట్‌లు దక్కించుకున్న వారు చాలా మంది అక్కడే నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం ఇదో చిన్న గ్రామంగా ఉన్న పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ దాదాపు 1000కుపైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. అయితే గత కొన్ని రోజులుగా ఈ టిడ్కో భవనాల సముదాయంలో దెయ్యం తిరుగుతందన్న పుకార్లు షికార్లు చేస్తున్నాయి. రాత్రి అయితే చాలు ఒంటరిగా బయటకు వచ్చేందుకు తీవ్ర భయపడిపోతున్నారట. టిడ్కో భవనాల్లో దెయ్యం తిరుగుతుందన్న ప్రచారాన్ని అందులో నివసిస్తున్న వారే కొందరు కొట్టి పడేస్తున్నారు. తాము ఇక్కడే ఉంటున్నామని, అర్ధరాత్రిళ్లు ఇంటికి ఒంటరిగా వస్తున్న సందార్భలు చాలానే ఉంటాయని, అయితే అవేమీ ఇక్కడ కనిపించలేదన్నారు ఇక్కడే నివాసం ఉంటున్న బీఎస్పీ నాయకుడు వడ్డి వీరాస్వామి.. తాను ఇటీవలే అమావాస్య రోజున ఒంటరిగా ఈ ప్రాంతం అంతా కూడా తిరిగానని, అయితే తనకు దెయ్యం కనపడ్డది లేదన్నారు. దెయ్యం ఉంటే కొంతమందికి కనిపిస్తుందన్న వాదన నిజం అయ్యేలా తనకు కనిపించాలి కదా అంటూ ప్రశ్నిస్తున్నారు.. అయితే ఇక్కడే నివసిస్తున్న కొందరు అయితే రాత్రి వేళల్లో దెయ్యం అరుపులు వినిపిస్తున్నాయని, దెయ్యం తిరుగుతున్న ఆనవాళ్లు తమకు కనిపించాయని ధీమాగా చెబుతున్నారు..

# తూర్పు ఫ్యాన్ లో పదనిసలు

రాజమండ్రి, జూలై 11

మ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వైసీపీకి చాలా పట్టుంది అంటుంటారు. నాయకత్వపరంగా కూడా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బలమైన నాయకులు ఉండడం, సీనియర్లు ఉండడం కూడా కలిసొచ్చే అంశం. అయితే ఈ బలమైన నాయకుల్లో ఇప్పుడు సఖ్యత కొరవడి పార్టీ కార్యక్రమాల్లోనే ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే పరిస్థితికి వచ్చారట. రాజమండ్రి నుంచి అమలాపురం వరకు ఇదే వరుస అంటున్నారు పరిశీలకులు. పైకి ఒకే వేదికపై కలిసికట్టుగా కూర్చున్నప్పటికీ ఒకరిని చూస్తే మరొకరికి విపరీతమైన చిరాకు కలుగుతోందని అంటున్నారు. ఆ కొద్ది సమయం ఓపిక పడుతున్నారట. ఇలా పార్టీలో ముఖ్య నాయకత్వం నుంచి ద్వితీయ శ్రేణి నాయకత్వం వరకు ఇదే తంతు అంటూ పార్టీలోనే అసహనం వ్యక్తం చేస్తున్నారు కొందరు. ఇలా అయితే ఎలా? పార్టీలోనే సఖ్యత లేదు. ఇక వచ్చే ఎన్నికల్లో ఎలా నెగ్గుకురాగలుగుతాం.? అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారట..ఒకప్పటి కాంగ్రెస్ పార్టీలో రాజమండ్రి అనగానే వెంటనే గుర్తుకు వచ్చేది జక్కంపూడి రామ్మోహనరావు ఫ్యామిలీనే. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆయనకు అంతటి ప్రాధాన్యతనిచ్చారు. ఆయన మరణానంతరం ఆయన సతీమణి జక్కంపూడి విజయలక్ష్మి, కుమారుడు రాజా ప్రత్యక్ష రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. ఆ తరువాత వైసీపీలో వచ్చిన జక్కంపూడి కుటుంబం జగన్‌కు అత్యంత సన్నిహితులుగా మారారు. ఈ క్రమంలోనే 2019 ఎన్నికల్లో వైసీపీలోకి ఒక్కసారిగా ఎంట్రీ ఇచ్చిన మార్గాని భరత్ పార్టీలోకి వచ్చిందే తడవుగా రాజమండ్రి ఎంపీ సీటు దక్కించుకున్నారు. వైసీపీ గాలిలో ఎంపీగా గెలవడం జరిగిపోయింది. రాజకీయ సమీకరణాలతో జక్కంపూడి రాజాను రాజమండ్రి పక్కనే ఉన్నటువంటి రాజానగరం నియోజకవర్గానికి పంపించారు. రాజమండ్రి అర్బన్, రాజమండ్రి రూరల్ స్థానాలు టీడీపీ కైవసం చేసుకోవడంతో ఎంపీగా గెలిచిన మార్గాని భరత్‌కు కలిసొచ్చింది.రాజమండ్రిలో అధికార పార్టీ తరపున ఒక్క ఎంపీ భరత్ ఉండడంతో తిరుగులేని పరిస్థితి తలెత్తింది. దీంతో ఒకప్పుడు రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో తన అనుచరులకు అన్యాయం జరుగుతుందంటూ జక్కంపూడి రాజా, అతని సోదరుడు గణేష్ ఆరోపించడం, భరత్, జక్కంపూడి ఫ్యామిలీ మధ్య పూడ్చలేని అగాధం ఏర్పడింది. ఈ క్రమంలోనే ఒకరిపై ఒకరు ప్రెస్‌మీట్‌లు పెట్టుకుని మరీ ఆరోపణలు చేసుకున్నారు. ఎన్నికలకు ముందు రాజమండ్రి అర్బన్ నియోజకవర్గం భరత్‌కు అప్పగించడంతో ఈ వివాదం మరింత ముదిరింది. ఎన్నికల తరువాత కూడా ఒకే పార్టీలో ఉన్నా మార్గాని భరత్, జక్కంపూడి రాజా సోదరుల మధ్య మాటల యుద్ధం జరుగుతూనే ఉంది. మార్గాని భరత్‌పై జక్కంపూడి రాజా, అతని సోదరుడు గణేష్ పలు ఆరోపణలు చేయడం, అదే సమయంలో



భరత్ కూడా జక్కంపూడి సోదరులపై ప్రత్యారోపణలు చేయడం జరుగుతోంది. రాజమండ్రి తరహాలోనే అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలోనూ వైసీపీలో అంతర్యుద్ధం తారాస్థాయికి చేరుతోంది. ఇటీవల జిల్లా స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం సందర్భంగా వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ కోసం ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలో మాజీ ఎంపీ చింతా అనురాధ ఫోటో వేయడంపై వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిపై ఒక్కసారిగా ఫైర్ అయ్యారు మాజీ మంత్రి పినిపే విశ్వరూప్. ఆమెకు ఏ ప్రోటోకాల్ ఉందని ఫోటో వేశారని ప్రశ్నించారు. దీనికి ఆయన కూడా గట్టిగానే సమాధానం ఇచ్చారు. ఆమె మాజీ ఎంపీ గనుక వేశానని చెప్పారు. అయితే అక్కడున్న కొంతమంది సర్ధిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. కానీ అంతుర్యుద్ధం ఆగలేదు. ప్రస్తుతం మరింత ముదిరిందంటున్నారు.అమలాపురం పార్లమెంటు కన్వీనర్ బాధ్యతలు విశ్వరూప్‌కు అప్పగించింది అధిష్టానం. అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యతలను ఆయన కుమారుడు శ్రీకాంత్‌కు అప్పగించింది. అయితే ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన గనుక జరిగితే అమలాపురం అసెంబ్లీ సీటు జనరల్ అయ్యే అవకాశాలు లేకపోలేదు. దీంతో వీరంతా అల్లవరం నియోజకవర్గానికి వెళ్లే పరిస్థితి ఉంటుంది. మాజీ ఎంపీ స్వస్థలం అల్లవరం కావడంతో విశ్వరూప్ కుటుంబానికి అనురాధ పోటీ అవుతుందన్న ఉద్దేశ్యంతోనే విశ్వరూప్ ఇలా వ్యవహరిస్తున్నారా..? అనురాధ కూడా అల్లవరం నియోజకవర్గంపై కన్నేసిన క్రమంలోనే వీరిద్దరి మధ్య అగాధం నెలకొందా..? అన్న అనుమానం కోనసీమ ప్రాంతంలో ఉంది. మొత్తం మీద అటు రాజమండ్రి, ఇటు అమలాపురంలో మాత్రం వైసీపీ ముఖ్యనేతల్లో మాటల మంటలు అంటుకుని తారాస్థాయికి చేరుకుంటున్నాయి.

# జిల్లాల ఫ్రీ బస్సులతో నష్టం రాదా..

ఒంగోలు, జూలై 11,

ఆంధ్రప్రదేశ్ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు పదిహేనో తేదీ నుంచి అమలు కానుంది. గత ఎన్నికలకు ముందు ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలకు కల్పిస్తామని కూటమి పార్టీ నేతలు ప్రజలకు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత ఉచిత బస్సుకు ముహూర్తం ఖరారయింది. అయితే ఉచిత బస్సు ప్రయాణం కేవలం జిల్లాలకు మాత్రమే పరిమితం చేయడంపై మహిళలు పెదవి విరుస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని బస్సు సర్వీసుల్లో అమలు చేస్తుంటే, ఏపీ ప్రభుత్వం మాత్రం కేవలం జిల్లాలకే పరిమితం చేయడం ఏంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.. గతంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ కాదు. గత ప్రభుత్వం ఇరవై ఆరు జిల్లాలుగా చేసింది. పది ఉమ్మడి జిల్లాలను ఇరవై ఆరు జిల్లాలుగా మార్చింది. ప్రస్తుతం అవే జిల్లాలు కొనసాగుతున్నాయి. మహిళలు ఉచితంగా బస్సులో ప్రయాణం చేయాలంటే ఉమ్మడి జిల్లాలోని తమ వాళు ఉన్న ప్రాంతాలకు కూడా వెళ్లేందుకు వీలులేని పరిస్థితి నెలకొంది. జిల్లాలు కుదించడంతో విస్తీర్ణం కూడా తగ్గడంతో బస్సు ప్రయాణం చేసే వారి సంఖ్య కూడా తక్కువగా ఉంటుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల ఆర్టీసీకి కాని, ప్రభుత్వానికి కానీ పెద్దగా నష్టం ఉండదు. ఉదాహరణకు ప్రకాశం జిల్లాలోని అద్దంకి బాపట్ల జిల్లాలో ఉంది. కానీ అద్దంకి ప్రజలు ఎక్కువగా ఒంగోలు వస్తుంటారు. కానీ ఒంగోలుకు అద్దంకికి చెందిన మహిళలు రావాలంటే ఉచిత ప్రయాణం కుదరదు. అంటే ప్రభుత్వానికి కూడా పెద్దగా భారం అని పించదు. బస్సుల్లో కూడా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మాదిరిగా రద్దీ ఉండదు. బస్సుల సంఖ్య పెద్దగా పెంచాల్సిన పని కూడా ఉండదు. ఎందుకంటే పని ఉంటేనే మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తారు. ఒకవేళ జిల్లా దాటి ప్రయాణించాలంటే ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఇక ఆటో కార్మికుల నుంచికూడా ప్రభుత్వానికి అసంతృప్తి పెద్దగా ఎదురు కాదు. ఎక్కువగా జిల్లాల్లో గ్రామాల మధ్య ఎక్కువగా షేరింగ్ ఆటోలు తిరుగుతుంటాయి. కానీ జిల్లాలో అయితే పరవాలేదు. కానీ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఆర్టీసీ బస్సు అయినా ఒకటే..ఆటో అయినా ఒకటేనన్న ధోరణి ఆటోమేటిక్ గా కనపడుతుంది. మొత్తం మీద ఉచిత బస్సు పెద్దగా భారం లేకుండా ప్రయాణం సాగిస్తుందని అనుకోవాలి.

# తిరుమలలో వైభవంగా గురు పౌర్ణమి గరుడ సేవ

తిరుమల

వ్యాస పౌర్ణమి లేదా గురు పౌర్ణమిని పురస్కరించుకుని తిరుమలలో గురువారం రాత్రి గరుడ వాహన సేవ వైభవంగా జరిగింది. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు.

# శ్రీవారి అభిషేక సేవలో యనమల రామకృష్ణుడు

తిరుమల

టీడీపీ నేత యనమల రామకృష్ణుడు శుక్రవారం కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం అభిషేక సేవలో స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించగా.. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేసి పట్టు వస్త్రం తో సత్కరించారు.

# ఇసుక డంపులు సీజ్

జన్నారం

జన్నారం మండలంలోని బాదంపల్లి గ్రామంలో నిలువ ఉంచిన ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అక్రమ ఇసుక నిలువలు ఉన్నాయనే సమాచారంతో తాసిల్దార్ రాజ మనోహర్ రెడ్డి ఆదేశాలతో ఆర్ఐ భానుచందర్, గ్రామ కార్యదర్శి, పోలీస్ సిబ్బందితో కలిసి గ్రామంలో పరిశీలించారు. 9 చోట్ల అక్రమ నిలువలు గుర్తించి వాటిని సీజ్ చేసినట్లు తాసిల్దార్ తెలిపారు. మొత్తం 168 ట్రాక్టర్ల ఇసుక ఉంటుందని పేర్కొన్నారు.

========================

## ఆరోపణల ఆధారాలు చూపాలి లేకపోతే దాడులు తప్పవు

కాకినాడ

జక్కంపూడి కుటుంబంపై జనసేన పార్టీకి చెందిన నేతలు వివిధ మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని అవి ఆధారంతో చూపాలని లేని పక్షంలో తాము కూడా ఎదురుదాడి చేస్తామని వైసీపీ యువజన విభాగం ప్రాంతీయ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ హెచ్చరించారు..గురువారం సాయంత్రం కాకినాడలో గణేష్ బంధువుల స్వగృహంలో మీడియా నిర్వహించారు. తమ కుటుంబం గురించి జనసేన పార్టీ నేతలు బెట్టింగ్ మాఫియా, భూకబ్జాలు పేకాట క్లబ్బులు నిర్వహిస్తామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని వీటిలో ఆధారాలు చూపాలని తెలిపారు..ఓడిపోయిన గెలిచిన నిరంతరం ప్రజల్లోనే ఉంటామని తమ కుటుంబమే ఆ నియోజకవర్గాల్లో పాలన చేస్తామంటూ ధీమా వ్యక్తం చేశారు. కూటమిగా వారు గెలిచారు తప్ప వారు బలం ఏమాత్రం లేదని కూటమి ఎప్పుడు బద్దలు అవుతుందో తెలియని అయోమయ స్థితిలో ఆ పార్టీలకు చెందిన నాయకులు ఉన్నారని విమర్శించారు...

## ఇంటిదారి విషయంలో ఘర్షణ : కత్తిపోట్లతో వ్యక్తి మృతి

జగిత్యాల

ధర్మపురి మండలం దోనూర్ లో కత్తి పోట్లు కలకలం రేపాయి. గొల్లెన రవిపై గొల్లెన నాగరాజు కత్తితో దాడి చేసాడు. ఘటనలో రవికి తీవ్ర గాయం కాగా జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రవి మృతి చెందాడు. ఇంటికి దారి విషయంలో రవి, నాగరాజు మధ్య రాత్రి గొడవ జరిగింది. గొడవలో భాగంగా నాగరాజు కత్తితో దాడి చేసాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. .

## ఆర్మూర్ గిరిధర్ కిలిమంజారో శిఖరాన్ని జయించిన సాహసి తన పేరుకు తగ్గట్లు పర్వతాన్ని అధిరోహించిన గిరిధరుడు

నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్. పెర్కిట్ విశాఖ కాలనీ ప్రాంతానికి చెందిన గిరిధర్ ప్రపంచంలోని ఎత్తైన పర్వత శిఖరాలలో ఒకటైనఆఫ్రికా ఖండం లో నాలుగవ అతిపెద్ద పర్వతం 5,895 మీటర్లు ఎత్తు ఉన్న కిలిమంజారోను విజయవంతంగా అధిరోహించి తన సాహసాన్ని చాటారు. కేవలం పట్టుదల, ధైర్యం ఉంటే ఎలాంటి అసాధ్యాన్ని అయినా సుసాధ్యం చేయవచ్చని నిరూపించారు. తల్లిదండ్రులు మిత్రులు యోగ మాస్టర్ప్రేరణ, ప్రయాణం:గిరిధర్ చిన్నప్పటి నుంచే పర్వతారోహణ అంటే ఎంతో ఆసక్తి. ఎత్తైన శిఖరాలను అధిరోహించాలనే కలను నిజం చేసుకోవాలని నిరంతరం కృషి చేశారు. ఈ క్రమంలో, కిలిమంజారో పర్వతం గురించి తెలుసుకుని, దానిని అధిరోహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం ఆయన ఎంతో శారీరక, మానసిక శిక్షణ పొందారు. పర్వతారోహణ నిపుణుల బృందంతో కలిసి సాయి ప్రసాద్ తో సాహసయాత్రను ప్రారంభించారు. ప్రతి అడుగులోనూ కొత్త సవాళ్లు ఎదురయ్యాయి.

# పుల్వామా దాడికి... ఈ కామర్స్ ఊతం

ముంబై, జూలై 11,

ఆన్‌లైన్ షాపింగ్ మన జీవితంలో ఒక భాగమయ్యింది. ప్రతి రోజు ఆన్‌లైన్‌లో ఏదో ఒకటి బుక్ చేసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇప్పుడు కూరగాయలు, పాలు, పండ్లు వంటి వాటిని కూడా హోం డెలివరీ చేస్తుండటంతో.. వాటిని కూడా ఆన్‌లైన్‌లోనే బుక్ చేస్తున్నారు. అయితే సామాన్యులతో పాటుగా నేరస్తులు, ఉగ్రవాదులు సైతం ఆన్‌లైన్ డెలివరీ యాప్స్‌ని విరివిగా వాడుకుంటున్నట్లు తెలుస్తుంది. తాజాగా సంచలన విషయం వెలుగులోకి వచ్చింది.ఉగ్రవాదులు పేలుడు పదార్థాల కోసం ఈ-కామర్స్ వేదికలను వాడుతున్నారని ఎఫ్ఏటీఎఫ్ తెలిపింది. 2019 పుల్వామా దాడిలో పేలుడు పదార్థాలు కొనడానికి, 2022 గోరఖ్‌నాథ్ ఆలయ దాడిలో నిధుల కోసం డిజిటల్ మార్గాలను ఉపయోగించారని ఎఫ్ఏటీఎఫ్ పేర్కొంది. ఉగ్రవాదులు టెక్నాలజీని వాడుకుని డబ్బు సంపాదిస్తున్నారని, దాడి చేయడానికి కావలసిన వస్తువులు కొంటున్నారని ఎఫ్ఏటీఎఫ్ హెచ్చరించింది.ఉగ్రవాదులు డబ్బును ఒక చోటు నుంచి ఇంకో చోటుకు పంపడానికి, దాడికి కావలసిన వస్తువులు కొనడానికి ఈ-కామర్స్ వెబ్‌సైట్‌లను వాడుతున్నారన్న విషయాన్ని మనీలాండరింగ్, టెర్రర్ ఫైనాన్సింగ్‌ను పర్యవేక్షించే సంస్థ అయిన ఎఫ్ఏటీఎఫ్ తెలిపింది. ఉగ్రవాద సంస్థలు డిజిటల్ టూల్స్ ద్వారా డబ్బు సంపాదిస్తున్నాయని, వాటిని వాడుకుని దాడి చేయడానికి కావాల్సిన వస్తువులను సమకూర్చుకుంటున్నాయని ఎఫ్ఏటీఎఫ్ వెల్లడించింది.2019లో పుల్వామాలో జరిగిన దాడి కోసం ఉగ్రవాదులు అమెజాన్ నుండి పేలుడు పదార్థాలు తెప్పించుకున్నారని ఎఫ్ఏటీఎఫ్ తెలిపింది. ఈ దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది చనిపోయారు. జైష్-ఎ-మొహమ్మద్ అనే ఉగ్రవాద సంస్థ ఈ దాడి చేసింది. అధికారులు వెల్లడించిన దాని ప్రకారం.. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు ఈ దాడిలో ముఖ్య పాత్ర పోషించాయి.2022లో గోరఖ్‌నాథ్ ఆలయంపై దాడి జరిగింది. ఈ దాడికి పాల్పడిన వ్యక్తి పేపాల్ ద్వారా రూ. 6.7 లక్షలు విదేశాలకు పంపాడు. అంతేకాకుండా, అతను తన వివరాలు ఎవరికీ తెలియకుండా ఉండటానికి వీపీఎన్ సేవలను ఉపయోగించాడు. ఎఫ్ఏటీఎఫ్ ఈ విషయాలను తన రిపోర్టులో తెలిపింది. 2019 పుల్వామా దాడిలో ఈ-కామర్స్ సాయంతో పేలుడు పదార్థాలను సేకరించారని, 2022లో గోరఖ్‌నాథ్ ఆలయంపై జరిగిన దాడి ఘటనలో ఐఎస్ఎస్ నిధులు సమకూర్చడానికి 'పేపాల్', వీపీఎన్‌లను ఉపయోగించారని ఎఫ్ఏటీఎఫ్ తన రిపోర్టులో వెల్లడించింది. ఇలాంటి చర్యలని అరికట్టడం కోసం ఈ కామర్స్ సంస్థలపై దృష్టి సారించాలని కేంద్రానికి ఎఫ్ఏటీఎఫ్ సూచించింది. మరి దీనిపై కేంద్రం ఎలా స్పందిస్తుందో చూడాలి అంటున్నారు.

# మహారాష్ట్రలో భారీగా కేన్సర్ కేసులు 3 లక్షల మందిలో 15 వేల మంది

ముంబై, జూలై 11,

మహారాష్ట్రలోని హింగోలి జిల్లాలో వేలాది మంది మహిళల్లో కేన్సర్ అనుమానిత లక్షణాలు కలకలం రేపుతున్నాయి. 'సంజీవని అభియాన్' ద్వారా నిర్వహించిన స్క్రీనింగ్‌లో ఈ విషయం వెల్లడైంది. దాదాపు మూడు లక్షల మందికి సర్వే చేయగా, 14 వేల మందికి పైగా కేన్సర్ లక్షణాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. అయితే, హింగోలిలో ప్రత్యేక కేన్సర్ ఆసుపత్రి ఏర్పాటు ఆలోచన లేదని, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. దేశంలోనే అత్యధిక కేన్సర్ కేసులు నమోదవుతున్న రాష్ట్రాల్లో మహారాష్ట్ర రెండో స్థానంలో ఉంది.మహారాష్ట్రలోని హింగోలి జిల్లాలో వేలాది మంది మహిళల్లో కేన్సర్ అనుమానిత లక్షణాలు బయటపడటం కలకలం రేపుతోంది. రాష్ట్ర ప్రభుత్వం 'సంజీవని అభియాన్' పథకం ద్వారా నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షల్లో ఈ విషయం వెల్లడైందని ఆరోగ్య శాఖ మంత్రి ప్రకాశ్ అబిత్కర్ అసెంబ్లీలో ప్రకటించారు. మార్చి 8 నుంచి 2,92,996 మందికి సర్వే చేయగా, 14,542 మందిలో కేన్సర్ వంటి లక్షణాలు కనిపించాయి. స్క్రీనింగ్ పరీక్షల అనంతరం ముగ్గురికి గర్భాశయ కేన్సర్, ఒకరికి రొమ్ము కేన్సర్, ఎనిమిది మందికి నోటి కేన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. కేన్సర్ నివారణకు ప్రత్యేక ఆసుపత్రి లేకపోయినా, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా బలభద్రపురం గ్రామంలోనూ ఒకే ఏడాదిలో 200 మందికిపైగా కేన్సర్ బారినపడ్డారు.హింగోలి జిల్లాలో కేన్సర్ కేసులను గుర్తించడానికి అధికారులు సంజీవని పథకం ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో వేలాది మంది మహిళల్లో కేన్సర్ అనుమానిత లక్షణాలు బయటపడ్డాయి. 7000 మందిలో సర్వైకల్, 3,500 మందిలో బ్రెస్ట్, 2000 మందిలో నోటి కేన్సర్ లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. మంత్రి తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి 8 నుంచి మొత్తం 2,92,996 మంది మహిళలకు సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో మహిళలకు కేన్సర్ లక్షణాలకు సంబంధించిన ప్రశ్నలు అడిగారు. వారి సమాధానాల ఆధారంగా 14,542 మంది మహిళల్లో కేన్సర్ తరహా లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు.అయితే, హింగోలిలో మహిళల కోసం ప్రత్యేక కేన్సర్ ఆసుపత్రిని ఏర్పాటు చేసే ఆలోచన లేదని మంత్రి స్పష్టం చేశారు. కానీ, వ్యాధి నిర్ధారణ కోసం గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, స్క్రీనింగ్‌లు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా, జిల్లా ఆసుపత్రులు, మెడికల్ కాలేజీ ఆసుపత్రుల్లో కేన్సర్‌కు చికిత్స అందిస్తామని మంత్రి చెప్పారు. టాటా మెమోరియల్ ఆస్పత్రి నుంచి శిక్షణ పొందిన 'కేన్సర్ వారియర్స్' ప్రతి నెలా నిపుణులతో కలిసి రెండుసార్లు 11 ఆస్పత్రులను సందర్శిస్తారని అసెంబ్లీకి తెలిపారు. ఎనిమిది జిల్లా ఆసుపత్రుల్లో డే కేర్ కీమోథెరపీ కేంద్రాలను ప్రారంభించామని, అన్ని జిల్లాల్లో వీటిని ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కాగా, ప్రపంచవ్యాప్తంగా కేన్సర్ మహమ్మారి వేగంగా వ్యాప్తిచెందుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది., దేశంలోనే అత్యధికంగా కేన్సర్ కేసులు నమోదవుతున్న ఐదు రాష్ట్రాల్లో మహారాష్ట్ర రెండో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో ఉత్తరప్రదేశ్ (2,10,958) నిలిచింది. దీని తర్వాత మహారాష్ట్ర (1,21,717), పశ్చిమ్ బెంగాల్ (1,13,581), బీహార్ (1,09,274) తమిళనాడు (93,536) రాష్ట్రాలు ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి..

## పచ్చని చెట్టు.. ప్రగతికి మెట్టు..

**ఆకుపచ్చని పెద్దపల్లి కోసం మనమందరం కలిసి అడుగెద్దాం..**

**మన ఇంట్లో పిల్లలను పెంచుతున్నట్టే మన ఇంటి ఆవరణలో కనీసం రెండు మొక్కలు నాటాలి..**

**అందమైన, ఆరోగ్యకరమైన ప్రకృతిని మన భావి తరాలకు అందిద్దాం..**

**వన మహోత్సవం ఒక ఉద్యమంలా జరగాలి..**

**పెద్దపల్లి ఎమ్మెల్యే. చింతకుంట విజయరమణ రావు**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోజున పెద్దపల్లి పట్టణంలోని ఐ.టీ.ఐ కళాశాలలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గారితో మరియు డి.ఎఫ్.ఓ గారితో, మున్సిపల్ కమిషనర్ తో కలిసి మొక్కలు నాటిన గౌరవ పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు గారు..ఈ సందర్భంగా గౌరవ ఎమ్మెల్యే విజయరమణ రావు గారు మాట్లాడుతూ..ఏది ఉన్నా లేకున్నా సమస్త మానవాళి జీవనానికి ప్రాణ వాయువు అవసరం ఉంటుందని అలాంటి ప్రాణ వాయువును ఇచ్చే చెట్లను అధికంగా నాటి వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. పర్యావరణం సమతుల్యంగా ఉండటానికి 33 శాతం అటవీ ప్రాంతం ఉండాలని దానికి అనుగుణంగా పెద్దపల్లి లోని ప్రజలందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.18 కోట్ల మొక్కలను నాటాలన్న బృహత్తర కార్యక్రమాన్ని ఈ సంవత్సరంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తెలపడం జరిగిందని దానికి అనుగుణంగా పెద్దపల్లిలో ప్రతి విద్యార్థి, యువత తమ ఇళ్లలో, పొలాల్లో ఎక్కడ తమకు స్థలం ఉంటే అక్కడ చెట్లు నాటాలని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యతను అధికారులు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ ఇళ్ల వాకిలిలో మొత్తం బండలు, కాంక్రీట్ వేసుకోకుండా కొంత స్థలం మొక్కలు నాటేందుకు ఉంచుకోవాలని అలాగే ఇళ్లలో పెళ్లి అయిన, పుట్టిన రోజు జరుపుకున్న మరే ఇతర శుభ కార్యక్రమాలు జరుపుకున్న ఆరోజుకు గుర్తుగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని సూచించారు.పెద్దపల్లి నియోజకవర్గంలో ఈ సంవత్సరం అధ్యధికంగా మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకోవాలని ఆ లక్ష్యం మేరకు రోడ్ల పక్కన మరియు, ఖాళీ ప్రదేశాల లో మొక్కలు నాటేందుకు ఆయా ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు, విద్యార్థులు అందరూ వారి వారి ఇళ్లలో పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటాలని తెలియజేయడం జరిగింది. అలాగే పెద్దపల్లి ఐ.టి.ఐ మైదానంలో ఉదయం మరియు సాయంత్రం వాకింగ్ చేసే వారికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గారు, మున్సిపల్ కమిషనర్, స్థానిక తహసీల్దార్, అటవీ శాఖ అధికారులు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, మున్సిపల్ సిబ్బంది, ఐ.టి.ఐ కళాశాల సిబ్బంది, విద్యార్థులు, మాజీ కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# అతి మంచితనమే మా చేతకానితనంగా మారింది దెందులూరు ఎమ్మెల్యే కొఠారి అబ్బయ్య చౌదరి

ఏలూరు రాజకీయంగా అబ్బయ్య చౌదరి అనే వ్యక్తిని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. అబ్బయ్య చౌదరిని ఇబ్బంది పెడితే దెందులూరులో రాజకీయ పెత్తనం చేయవచ్చని చూస్తున్నారని దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరీ అన్నారు. దెందులూరు లో అబ్బయ్య చౌదరిని తప్పించే ప్రయత్నం జరుగుతుంది. అబ్బయ్య చౌదరి ఇంటికి వెళ్ళండి ముట్టడించండి వంటవార్పు చేయండి అని చింతమనేని పిలుపు ఇచ్చాడు. అబ్బయ్య చౌదరిని బెదిరించి హతమార్చాలని చూస్తున్నారు. రాజకీయాల్లో వచ్చింది మంచి చేయడానికి. కుటుంబాన్ని వదిలిపెట్టి మంచి ఉద్యోగాన్ని వదిలిపెట్టి రాజకీయాల్లోకి వచ్చాననని అన్నారు.

ఐదు సంవత్సరాలు శాసనసభ్యుడిగా చేసే అవకాశం కల్పించారు . సంక్షేమం అభివృద్ధిలో ముందుకు వెళ్లాలని ప్రజల దీవెనతో కార్యకర్తల దీవెనతో అనేక కార్యక్రమాలు చేశాను. రాజకీయాల్లోకి డబ్బు సంపాదించాలని రాలేదు.. ఏ ఒక్కరి దగ్గర ఒక్క రూపాయి కూడా తీసుకొనే ఆలోచన మాకు లేదు. మమ్మల్ని నమ్ముకున్న కుటుంబాలకు అండగా ప్రజలకు సేవ చేయాలని రాజకీయాలలోకి వచ్చాం. అతి మంచితనమే మా చేతకానితనంగా మారిందిని అన్నారు.

టిడిపి వారికి సైతం మంచే చేసాము. కార్యకర్తలకు న్యాయం చేయలేకపోయాం వారిని ఆర్థికంగా. నిలబట్ట లేకపోయాం. ఈరోజు రాజకీయాలు చూస్తుంటే బాధ వేస్తుంది. కోట్ల రూపాయల వ్యాపారాలు వదిలి రాజకీయాల్లోకి వచ్చాము. నేను రాజకీయాల్లోకి వచ్చేటప్పుడు మా కుమారుడు వయసు సంవత్సరం. కుటుంబంతో సమయం కేటాయించకుండా పాదయాత్రని గడపగడపని నిత్యం ప్రజల్లోనే ఉన్నామం. నియోజకవర్గంలో 20 సంవత్సరాల తర్వాత అయినా అబ్బయ్య చౌదరి చేసిన మంచి ఏ మూలకు వెళ్లిన కనబడుతుంది. అబ్బయ్య చౌదరిని తప్పించాలని... వేదనకు గురిచేయాలని చూస్తున్నారు. మా ఇంటి పై రాళ్లు వేసి వంట వార్పులు పెట్టి... ఇబ్బందులు పెట్టారు. దెందులూరులో చెరువుల ఆక్రమిస్తున్నారు పొలాలు ఆక్రమిస్తున్నారు. రౌడీ షీటర్లను చెంచా గాళ్లను పంపించి తోటల్లోకి పంపి భయపెట్టాలని చూసారు. కొఠారి కుటుంబాన్ని అబ్బయ్య చౌదరిని రాజకీయాల్లో తప్పించాలని దుర్మార్గమైన ఆలోచన చేస్తున్నారు. 144 సెక్షన్ ఉన్నా కూడా... పోలీసులు ఆపుతున్నా మా కార్యకర్తలు.. మా ఇంటికి వచ్చి అండగా నిలిచారు. కొల్లేరు గ్రామల్లో దెందులూరు నియోజకవర్గం లోపే ఒక్క వ్యక్తి దగ్గరైన అబ్బయ్య చౌదరి ఒక రూపాయి తీసుకాలేదు. ఏ ఒక్క కొల్లేరు గ్రామానికి గాని దెందులూరు నియోజకవర్గం ఎవరికి బాకీ లేను. ఏ కొల్లేరు వాసుకి హాని చేయలేదు వారికి మంచే చేశాను . పత్తి కోళ్ల లంకలో ఎంతోమంది మీద రౌడీషీట్లు ఉన్నాయి. గ్రామాలు వదిలి పారిపోయారు.. వారిని తీసుకువచ్చి సామరసంగా ప్రశాంత వాతావరణ సృష్టించామని అన్నారు.

కొల్లేరు వాసులకు నేను బాకీ ఉన్నానని నిరూపిస్తే రాజకీయాలనుండి తప్పకుంటా....? కొల్లేరు ప్రాంతంలో వికృత రాజకీయ క్రీడ జరుగుతుంది..చింతమనేని ప్రభాకర్ కి అబ్బయ్య చౌదరికి జరుగుతున్న గొడవ ఇది. మా ఇంటికి ప్రభాకర్ అనేక సందర్భాల్లో వచ్చినవి , ఉన్నాయి. పిన్ని బాబాయ్ అంటూ మా అమ్మ నాన్న ను పిలిచేవాడు. మా నాన్నఒక హార్ట్ పేషెంట్ గాఇంట్లో ఉంటే... ఇళ్లపై రాళ్లు వేయించారు. కొల్లేరు వాసులను బెదిరించి మాపై ఉసి గెలుపుతున్నారు. కోటదిబ్బ వద్ద నిరసన తెలుపుతున్న ప్రతి ఒక్క అక్కని అడుగుతున్న మీకు గాని మీ గ్రామానికి గాని అబ్బయ్య చౌదరి బాకీ ఉన్నాడా....? దెందులూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున నిజనిర్చారణ కమిటీ వేస్తున్నాము . మీరు కూడా ఒక కమిటీ వేయండి. అబ్బయ్య చౌదరి ఒక రూపాయి బాకీ ఉన్నాడో లేదోఈ నిజ నీర్ధారణ కమిటీ ముందు తెల్చండి. లేదు ధర్నాలే చేస్తాము అబ్బయ్య చౌదరిని హత మారుస్తామంటే.. చేస్తే చేసుకోండని అన్నారు.

మా నాయకులను ఇబ్బంది పెడుతున్నారు చెరువుల ఆక్రమించారు మా పొలాలను ఆపారు. మా టైం వచ్చినప్పుడు చెబుతున్నాం ఎవరిని వదిలిపెట్టం. ఇప్పుడు మైకులు పట్టుకుని నాపై విమర్శలు చేస్తున్నవారు మా పార్టీ కార్యాలయాలకు వచ్చి మా పార్టీ కండవాలేసుకుని మాకు న్యాయం చేయండి అన్నవారే. అబ్బయ్య చౌదరి కొల్లేరు గ్రామాల్లో ఏ ఒక్క వ్యక్తికి ఏ ఒక్క గ్రామానికి బాకీ లేదు. అబ్బయ్య చౌదరి ఏ తప్పు చేయలేదు... నిజనిద్దారణ కమిటీలో.. నిరూపించండి ఏ ఒక్క వ్యక్తి వద్దనైనా రూపాయి తీసుకున్నానని నిరూపిస్తే రాజకీయాల నుండి తప్పుకుంటా నని అన్నారు.

జిల్లా కలెక్టర్ ఎస్పీ కూడా ఈ కమిటీలో భాగస్వాములు నిజాలు నిగ్గు తేల్చాలని కోరుకుంటున్నామని అన్నారు.

# కూటమి ఏడాది పాలనలో గ్రామాల్లో అభివృద్ధికి పెద్ద పీట :గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఆర్టీసీ చైర్మన్ కొనకల్ల

**గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడులో రూ.33 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించిన నాయకులు**

**వడ్లమన్నాడు పాల కేంద్రం నూతన కమిటీని అభినందించిన...ఎమ్మెల్యే రాము, కొనకల్ల,**

**రావిగ్రామాల సమగ్ర అభ్యున్నతికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి:**

కూటమినేతలు

గుడ్లవల్లేరు జూలై 11:గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకల్ల నారాయణరావులు పేర్కొన్నారు. గ్రామాల సమగ్ర అభ్యున్నతి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు.గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడు గ్రామంలో రూ. 33 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకల్ల నారాయణరావు, శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ముందుగా కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే రాము, కొనకల్ల, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ రావి వెంకటేశ్వర్రావు మరియు, కూటమినేతలకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పాల కేంద్రం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, నూతన అధ్యక్షుడు పుల్లేటి రాజా ప్రసాద్ మరియు కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.... గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. గత ఐదేళ్లుగా గ్రామాలు అభివృద్ధికి మంజూరైన నిధులను కూడా అరాచక ప్రభుత్వం పక్కదారి పట్టించిదని, స్థానిక సంస్థలకు విలువలేకుండ చేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందించడంతోపాటుగా, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు.ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ... అభివృద్ధికి దూరమైన కృష్ణా జిల్లాలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. కృష్ణాజిల్లాలోని నాయకత్వం అంత ఏకతాటిపైకి వచ్చి, జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో అనేక సమస్యలను పరిష్కరించినట్లు కొనకల్ల నారాయణరావు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సాయిన పుష్పావతి , మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి, మండల టిడిపి నాయకులు పోలవరపు వెంకటరావు,సురగని ప్రసాద్,కొడాలి రామరాజు,కాగిత నరేంద్ర,నరఘని శ్రీనివాసరావు, బొల్లా అందాలు ,పామర్తి కన్య భాస్కరరావు,ఆకుల శివయ్య,దేవిశెట్టి రామకృష్ణ,నా ప్రసాద్ ,పాలేటి ఆంజనేయులు,నమ్మెట సాంబయ్య,దారా సత్యనారాయణ,ఈడే మోహన్,మన్యం నరసింహారావు, కంచర్ల ప్రకాష్, మద్దాల జోజిబాబు,నిమ్మగడ్డ సత్యసాయి,కంచర్ల సుధాకర్,సురగాని సూరిబాబు ,అబ్దుల్ సత్తార్,బెజవాడ రాంబాబు,చిట్టిబొమ్మ నరసింహారావు,సారథి.... వడ్లమన్నాడు నాయకులు పామర్తి సత్తిబాబు, పామర్తి సూరిబాబు, మోదుగమూడి కోటేశ్వరరావు, పండే శ్రీను, మెండ నాంచారయ్య, పెన్నేరు రమేష్, గరికపాటి రాంబాబు, గరికిపాటి వెంకటేశ్వరరావు, గరికపాటి నాగేశ్వరరావు, లక్ష్మయ్య, పుల్లేటి కిషోర్, కొనతం పెద్దిరాజులు, చింతయ్య, రాజబాబు, మండల సుబ్బారావు, తోట రమేష్,.....పాల కమిటీ మెంబర్స్ ప్రెసిడెంట్ పుల్లేటి రాజా ప్రసాద్ , మేనేజర్ తోట సత్యనారాయణ, సూపర్వైజర్ పెయ్యటి బసవరాజ్ కుమార్, వేతన కార్యదర్శులు వేముల వీర కొండలరావు, టేస్టర్ ఖీఎఔ పవన్ సాయి, స్థానిక ప్రజలు, పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## సెల్ఫీ తీసుకుంటూ యువకుడి ఆత్మహత్యాయత్నం

అనంతపురంఅనంతపురం జిల్లా: గుత్తి శివారులో రైలు పట్టాలపై సెల్ఫీ వీడియో తీస్తూ ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సెల్ఫీ వీడియో తీసి ఎస్పీ కార్యాలయానికి పంపాడు. అప్రమత్తమైన పోలీసులు గుత్తి అనంతపురం రైలు మార్గంలో యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. సెల్ ఫోన్ నెంబర్ ఆధారంగా యువకుడు గుత్తి మండలం, రజాపురం గ్రామానికి చెందిన నారాయణస్వామిగా పోలీసులు గుర్తించారు. పోలీసులు యువకుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# టీచర్లకు రేవంత్ ఫేస్ చెక్...

కరీంనగర్, జూలై 11,

ప్రభుత్వ ఉద్యోగం అంటేనే ఆడుతూ పాడుతూ చేస్తారు.. సక్రమంగా విధులు నిర్వహించను అన్న అపవాదు ఉంది. ఇక ప్రభుత్వ ఉపాధ్యాయులు అయితే బోధనకన్నా.. తమ వ్యక్తిగత పనులకే ఎక్కువ ప్రాధాన్యమిస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగానే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతంప దృష్టిపెట్టిన తెలంగాణ సీఎం సంస్కరణలు మొదలు పెట్టారు. టీచర్లతోనే ప్రక్షాళన షురూ చేశారు.తెలంగాణ విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల హాజరును ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా ట్రాక్ చేయాలనే ప్రతిపాదనను క్యాబినెట్ ముందు ఉంచింది. పెద్దపల్లి జిల్లాలో ఈ విధానం విజయవంతంగా అమలవుతోంది. ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా దీన్ని విస్తరించే అవకాశం ఉంది. దీంతో టీచర్లు 'స్కూల్‌కు సమయానికి రాకపోతే ఫేస్ స్కాన్ చెబుతుంది!'పెద్దపల్లి జిల్లాలో ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ విధానం సత్ఫలితాలనిచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. టీచర్లు సమయపాలన పాటించడం, బోధనలో క్రమశిక్షణ పెరగడం వంటి ప్రయోజనాలు కనిపించాయి. 'ఇప్పుడు టీచర్లు స్కూల్‌కి లేట్ కాకుండా, ఫేస్ స్కానర్ ఏర్పాటు చేశారు. టీచర్లు కూడా సమయానికి వచ్చేలా చేయాలని రేవంత్ సర్కార్ ఫేషియల్ రికగ్నిషన్ ఆలోచన చేస్తోంది. ఈ విధానంతో ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెరుగుతుందని విద్యాశాఖ ఆశిస్తోంది. టీచర్లు క్రమం తప్పకుండా హాజరవుతూ, నాణ్యమైన బోధన అందిస్తే, ప్రభుత్వ బడులు ప్రైవేట్ స్కూళ్లకు పోటీగా నిలుస్తాయి.ఫేషియల్ రికగ్నిషన్ విధానం అమలు చేయడానికి ఖర్చు, సాంకేతిక సమస్యలు, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సౌకర్యం, టీచర్ల నుంచి వ్యతిరేకత వంటి సవాళ్లు ఉన్నాయి. 'స్కూల్‌లో టీచర్ ఫేస్ స్కాన్ చేస్తే, విద్యార్థుల ఫ్యూచర్ ఆటోమేటిక్‌గా సెట్ అవుతుందా?' అని తల్లిదండ్రులు భావిస్తున్నారు. టీచర్ల గోప్యత, డేటా సెక్యూరిటీపై కూడా ఆందోళనలు ఉన్నాయి. ఈ సవాళ్లను అధిగమించకపోతే ఈ టెక్ ప్రయోగం ఫ్లాప్ సినిమాగా మారే ప్రమాదం ఉంది.

# పెద్దపల్లి జిల్లాలో బిఆర్ఎస్ నాయకుడి అరెస్ట్ తో ఆందోళన

పెద్దపల్లి

పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బిఆర్ఎస్ నాయకులు పూదరి సత్యనారాయణ అరెస్టు ఆందోళనకు గురిచేసింది. రామగిరి మండలం నాగేపల్లి లో ప్రేమ వివాహం చేసుకున్న జంటకు టిఆర్ఎస్ నాయకులు పూదరి సత్యనారాయణ బాసటగా నిలిచారు. ప్రేమ వివాహం చేసుకున్న యువతి అదృశ్యమైనట్లు పేరెంట్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారించేందుకు పోలీసులు నాగేపల్లికి వెళ్లగా సత్యనారాయణ తో పాటు పలువురు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు తమ విధులకు ఆటంకపరిచారని సత్యనారాయణ ను పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీంతో టిఆర్ఎస్ కార్యకర్తలు రామగిరి పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులు స్టేషన్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. స్వల్ప ఉద్రిక్తతకు దారి తీయడంతో పోలీసులు సత్యనారాయణ ను గోదావరిఖనికి తరలించి ఈ రోజు కోర్టులో హాజరుపరిచారు. కోర్టు నుంచి బెయిల్ ఇవ్వడంతో విడుదలైన సత్యనారాయణను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించి పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అక్రమ కేసులతో అరెస్టు చేసిన మంథని సిఐ, రామగిరి ఎస్సైలను సస్పెండ్ చేసి వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మంథని నియోజకవర్గంలోని పోలీస్ స్టేషన్లకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలని బోర్డులు పెట్టుకోవాలని కోరారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి శ్రీధర్ బాబు, అయన తమ్ముడు శ్రీనుబాబును కోర్టులో దోషులుగా నిలబెడుతామని పుట్ట మధు హెచ్చరించారు.

# ఎరువు కోసం రైతుల తిప్పలు సహకార సంఘాల వద్ద పొద్దంతా పడిగాపులు

మహబూబాబాద్

అధికార యంత్రాంగం ముందస్తు చూపు కరువైన తరుణంలో రైతాంగం అవస్థలు పడుతున్నది. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పోగుల్లపెల్లి లోని రైతులు చెప్పులు క్యూ లైన్ లో పెట్టిన దుస్థితి. యూరియా కొరత అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ రైతులు రోడ్డెక్కుతున్నారు. పంట అద ను దాటుతున్నదని, సరిపడా యూరియా సరఫరా చేయాలనే డిమాండ్తో ఆందోళనలకు దిగుతున్నారు.

స్థానిక అధికారుల నిర్లక్ష్యం తో పాత రోజులు పునరావృతమవుతున్నాయి. ఎరువుల కోసం చెప్పులు వరుస లో పెట్టడం తో చర్చనీయంశం గా మారింది.

ఇటీవల సాగుచేసిన మక్కజొన్న వంటి పంటలకు మందు వేసే సమయం ఆసన్నమైంది. యూరియా కోసం రైతులు సొసైటీల ఎదుట పడిగాపులు కాస్తున్నారు. చెప్పులు లైన్లో పెట్టి పొద్దంతా పనులు మానుకుని వేచి ఉంటున్నారు. అయినా వారికి ఒకటి, రెండు సంచులకు మించి దొరకడం లేదు. అరకొర సరఫరా రైతుల అవసరాలను తీర్చడం లేదు.

సహకార శాఖ అధికారుల మాయాజాలానికి తోడు వ్యవసాయశాఖ నిర్లక్ష్యం అన్నదాతలకు శాపంగా మారింది. ఒకవైపు ఎరువుల కొరతను నిరసిస్తూ రైతులు రోడ్డెక్కుతుంటే, మరోవైపు అసలు కొరతే లేదని యంత్రాంగం చెబుతుండడం విడ్డూరంగా మారింది. .

# సర్పంచ్ ఎన్నికలకు కసరత్తు షురూ

హైదరాబాద్, జూలై 11,

తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర మంత్రిమండలి ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలిపింది, దీంతో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ షురూ అయింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే సిబ్బంది శిక్షణ, పోలింగ్ కేంద్రాల ఎంపిక పూర్తి చేసింది. ప్రతి మండలంలో ఐదు ఎంపీటీసీ స్థానాల పునర్విభజన గురువారంతో ముగిసింది. 12,777 గ్రామ పంచాయతీలు, 5,982 ఎంపీటీసీ, 585 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఆ తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది.తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు, అలాగే మండల పరిషత్‌లలో ఎంపీటీసీ స్థానాలకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఈ నిర్ణయంతో గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం లభించనుందని ప్రభుత్వం పేర్కొంది. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండగా.. ఈ పెంపు బీసీల ఆశయాలకు అనుగుణంగా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఇక రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కసరత్తు వేగవంతమైంది. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర మంత్రివర్గం ఆర్డినెన్స్ జారీకి నిర్ణయించడంతో ఎన్నికల ప్రక్రియకు మార్గం సుగమమైంది. ఈ ఆర్డినెన్స్ ఆధారంగా పంచాయతీరాజ్ శాఖ త్వరలో రిజర్వేషన్లపై ఉత్తర్వులు జారీ చేయనుంది. ఆ తర్వాత గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు సంబంధించిన రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది.

సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు, పోలింగ్ కేంద్రాలను కూడా ఎంపిక చేసింది.ప్రతి మండలంలో అయిదేసి ఎంపీటీసీ స్థానాలు ఉండేలా పునర్విభజన ప్రక్రియ గురువారంతో ముగిసింది. ప్రస్తుతం ఉన్న గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలో 12,777 గ్రామ పంచాయతీలు, 5,982 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ స్థానాలు), 585 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రభుత్వం ప్రస్తుతానికి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ముందుగా నిర్వహించి.. ఆ తర్వాత గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఈ వ్యూహాత్మక నిర్ణయం ఎన్నికల ప్రక్రియను సులభతరం చేస్తుందని భావిస్తున్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుతో పాటు, ఈ ఎన్నికలు స్థానిక స్థాయిలో రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత సమతుల్యం చేయనున్నాయి.పంచాయతీ ఎన్నికల అంశంపై హైకోర్టు నెలాఖరులోపు రిజర్వేషన్స్ ఖరారు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. వీటన్నింటినీ చర్చించిన మంత్రివర్గం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే బీసీ డెడికేటెడ్ కమిషన్ నియమించింది. రాష్ట్ర ప్రణాళిక విభాగం అధ్వర్యంలో కుల గణన చేపట్టింది. వీటి ఆధారంగానే అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదం చేసుకుంది. అందుబాటులో ఉన్న ఎంపిరికల్ డేటా ఆధారంగా, జనాభా ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు తదుపరి చర్యలు చేపట్టాలని తీర్మానించింది. బీసీల రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీలకు మండలం యూనిట్‌గా, ఎంపీపీ, జడ్పీటీసీలకు జిల్లా యూనిట్‌గా, జడ్పీ ఛైర్మన్లకు రాష్ట్రం యూనిట్‌గా పరిగణిస్తారు.బీసీ రిజర్వేషన్ల పెంపునకు అనుగుణంగా రాష్ట్రంలో అమల్లో ఉన్న పంచాయతీరాజ్ చట్టం-2018 సవరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. త్వరలోనే ఈ చట్టంలో చేయాల్సిన సవరణలకు అవసరమైన చర్యలు చేపడుతుంది ప్రభుత్వం.

# ఆగని ఒవైసీ కాలేజీల రచ్చ ఇదేం లాజిక్ అంటున్నకమలం నేతలు

హైదరాబాద్, జూలై 11

ఆక్రమణలు లేని.. చెరువులు, నాలాలు కబ్జాకు గురికాని నగరంగా హైదరాబాద్ ను రూపొందించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా అనే వ్యవస్థను తెరపైకి తీసుకొచ్చారు. హైడ్రా వ్యవస్థకు ఒక పోలీస్ స్టేషన్ కూడా ఏర్పాటు చేశారు. ప్రత్యేకమైన వాహనాలు.. సిబ్బందిని కూడా నియమించారు. ఒకరకంగా హైడ్రా అనే వ్యవస్థ హైదరాబాదులో కీలకంగా పనిచేస్తోంది. ఇప్పటికే అనేక ఆక్రమణలను నేలమట్టం చేసింది. ఇప్పటికే అక్రమ కట్టడాలను పడగొడుతూనే ఉంది. హైడ్రా చేస్తున్న పని వల్ల సమాజం నుంచి సానుకూల స్పందన వస్తోంది. ముఖ్యంగా సంవత్సరాల తరబడి ఆక్రమణలతో విసిగిపోయిన ప్రజలు హైడ్రా రాకతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా అక్రమ కట్టడాలను పడగొట్టడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. హైడ్రా వల్ల హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పడిపోయిందని గులాబీ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం వల్ల హైదరాబాద్ నగరం సర్వనాశనం అవుతుందని మండిపడుతున్నారు.హైడ్రా కూలగొడుతున్న భవనాలు పేదలవేనని.. మధ్యతరగతి వారివి మాత్రమేనని.. పెద్దల జోలికి హైడ్రా వెళ్లడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఆమధ్య అమీన్పూర్ ప్రాంతంలో హైడ్రా కొన్ని భవనాలను పడగొట్టింది. ఈ సమయంలో చెరువులను ఆక్రమిస్తే.. అడ్డగోలుగా భవనాలు నిర్మిస్తే చర్యలు తీసుకుంటామని హైడ్రా అధిపతి రంగనాథ్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే ఎంఐఎం అధినేత కాలేజీ వ్యవహారం తెరపైకి వచ్చింది. ఈ విషయాన్ని కాషాయ పార్టీ నాయకులు ప్రస్తావించారు. హైడ్రా అధిపతికి దమ్మూంటే పాతబస్తీలోని సూరం చెరువులో నిర్మించిన ఫాతిమా కాలేజీని పడగొట్టాలని సవాల్ విసిరారు. అయితే దీనిపై హైడ్రా అధిపతి రంగనాథ్ క్లారిటీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన కొన్ని కీలక విషయాలను వెల్లడించారు.ఫాతిమా కాలేజీని ఓవైసీ నిర్వహిస్తున్నారు. అయితే ఇందులో పేద ముస్లిం పిల్లలకు ఉచితంగా విద్యను బోధిస్తున్నారు. అందువల్లే ఈ కాలేజీని కూల కొట్టకుండా ఉంటున్నామని హైడ్రా అధిపతి స్పష్టం చేశారు. ఎంఐఎం అధినేత తన కాలేజీని చెరువు లోతట్టు ప్రాంతంలో నిర్మించినప్పటికీ.. పేద ముస్లిం పిల్లల కోసం కేజీ నుంచి పీజీ వరకు ఈ కాలేజీ నడిపిస్తున్నారని హైడ్రా అధిపతి స్పష్టం చేశారు. పైగా ఈ కాలేజీలో ఎటువంటి ఫీజులు వసూలు చేయడం లేదని.. పదివేల మందికి పైగా ఇక్కడ చదువుకుంటున్నారని తెలంగాణ పేర్కొన్నారు. వెనుకబాటు తనం నుంచి ముస్లిం మహిళలకు ఓవైసీ కాలేజీ విముక్తి కల్పిస్తోందని రంగనాథ్ పేర్కొన్నారు. కాలేజీ కావడం వల్లే దీనిపై చర్య తీసుకోవడానికి ఆలోచిస్తున్నామని రంగనాథ్ పేర్కొన్నారు.మరోవైపు మజ్లీస్ నేతల నుంచి 1000 కోట్ల వరకు ఆస్తులను రికవరీ చేశామని పేర్కొన్నారు. 25 ఎకరాల సరస్సును ప్లాటుగా మార్చిన ఓవైసీ కుటుంబానికి చెందిన సన్నిహితుడి కట్టడాలను పడగొట్టామని రంగనాథ్ పేర్కొన్నారు. రంగనాథ్ చేసిన వ్యాఖ్యల పట్ల భిన్న స్పందనలు వినిపిస్తున్నాయి. ఫాతిమా కాలేజ్ విషయంలో ఉదారత చూపిన మీరు.. మిగతా పేదల విషయంలో ఎందుకు చూపించలేకపోయారని గులాబీ పార్టీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఓవైసీ కాలేజీ మీద చూపించిన ప్రేమ రాళ్లు వేయించేలా చేస్తుందని హెచ్చరిస్తున్నారు..రంగనాథ్ చేసిన వ్యాఖ్యల పట్ల బీజేపీ నాయకులు కూడా మండిపడుతున్నారు. చెరువులో కాలేజీ కట్టి.. విద్యార్థులకు ఉచితంగా చదువు చెబుతున్నామంటే ఎలా? రేపటి నాడు చాలామంది ఇలాగే చెరువులో కట్టడాలు కట్టి.. ఉచితంగా చదువు చెబుతున్నామంటే ఒప్పుకుంటారా? దానికి హైడ్రా అధిపతి సమ్మతం తెలుపుతారా అంటూ బిజెపి నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఫాతిమా కాలేజీ మీద హైడ్రా అధిపతి క్లారిటీ ఇచ్చిన నేపథ్యంలో.. విమర్శలే అధికంగా వస్తున్నాయి. మరి దీనిపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందనేది చూడాల్సి ఉంది.

# స్టూడెంట్స్ కు ఆర్యజనని ఆఫర్

హైదరాబాద్, జూలై 11,

దువుకున్న యువతకు నిజంగా ఇది గుడ్‌న్యూస్. హైదరాబాద్ రామకృష్ణ మఠం ఆధ్వర్యంలోని స్వచ్ఛంద సంస్థ 'ఆర్యజనని', యువత కోసం 'నాలెడ్జ్ ఈజ్ స్ట్రెన్త్' పేరుతో ఒక జాతీయ స్థాయి ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ టెస్ట్‌ను నిర్వహిస్తోంది. ఇది యువతకు తమ విజ్ఞానాన్ని పరీక్షించుకోవడానికి, ఆర్థికంగా లబ్ధి పొందడానికి ఒక గొప్ప అవకాశం. ఈ టెస్టులో పాసైన వారికి రూ. 50 వేల వరకు నగదు ప్రోత్సాహకం అందించనున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న అభ్యర్థులకు ఈ మొత్తం ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

పరీక్ష వివరాలు:

18 నుంచి 30 సంవత్సరాల లోపు వయస్సు గల యువతీ యువకులు ఈ పరీక్షకు అర్హులు.

మొదటి 150 స్థానాల్లో నిలిచిన వారికి రూ. 10,000 నుంచి రూ. 50,000 వరకు నగదు ప్రోత్సాహకం అందించబడుతుంది.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ఇది పూర్తిగా ఉచితం.

పరీక్ష విధానం:

పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహించబడుతుంది.

ఆగస్టు 3న సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు పరీక్ష ఉంటుంది.

ఈ జూలై 20న మాక్ టెస్ట్ నిర్వహించబడుతుంది.

ఇది అభ్యర్థులకు పరీక్షా విధానంపై అవగాహన కల్పిస్తుంది.

మొత్తం 100 ప్రశ్నలు అడుగుతారు.

ఈ పరీక్షలో నెగిటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి నాలుగు తప్పు సమాధానాలకు ఒక మార్కు తొలగించబడుతుంది.

ప్రశ్నలు ప్రధానంగా స్వామి వివేకానంద బోధనల నుంచి ఉంటాయి. అభ్యర్థుల సౌలభ్యం కోసం ఈ-బుక్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

రిజిస్ట్రేషన్, ఈ-బుక్ డౌన్‌లోడ్ ఇతర సమాచారం కోసం జీజీతీఎజీతీజీనిజీనితిఇనీనిబివబబి.నీతీణ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. అలాగే, 89778 63881 వాట్సాప్ నంబర్‌ను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చు.కాగా, హైదరాబాద్‌లోని రామకృష్ణ మఠం శ్రీ రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద బోధనల స్ఫూర్తితో అనేక ఆధ్యాత్మిక, విద్యా, ఆరోగ్య, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. 'శివ జ్ఞానే జీవ సేవ - మానవ సేవయే మాధవ సేవ' అనే సూత్రాన్ని ఆచరణలో పెడుతూ సమాజ అభ్యున్నతికి కృషి చేస్తోంది. విద్యా, మానవ అభివృద్ధి కార్యక్రమాలు, వైద్య సేవలు, సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, ధ్యాత్మిక కార్యక్రమాలు ఈ మఠం ద్వారా నిర్వహిస్తున్నారు.

# 45బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ నేతల నిరసన

హైదరాబాద్

బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బిఆర్ఎస్ నేతలు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను తగలబెట్టారు. ఆర్డినెన్స్ వద్దు చట్టబద్ధత కల్పించాలంటూ నినాదాలు చేసారు. బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేసారు. రిజర్వేషన్లు అమలు వ్యవహారంలో ప్రభుత్వ ద్వంద వైఖరిని నిరసిస్తూ దిష్టిబొమ్మ దగ్ధం చేసారు

# అన్నను హతమార్చిన తమ్ముడు

మెదక్ కొల్చారం మండలం అంసాన్ పల్లి కల్లు డిపోలో దారుణ హత్య జరిగింది. సొంత అన్ననే బండరాయితో మోది , కల్లు సీసాతో పొడిచి తమ్ముడు చంపాడు. మృతుడు రమావత్ మంత్య (45) వసురాం తండాకు చెందిన వ్యక్తి. భూ తగాదాలు, అప్పుల విషయంలో కళ్ళు డిపోలో అన్నదమ్ముల గొడవ చెలరేగింది. ఇద్దరికీ మాట మాట పెరిగి క్షణికావేశంలోకల్లు డిపో లో బండరాయి తో మోది తమ్ముడు హత్య చేసాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మంత్యా మృతి చెందాడు. తరువాత మోహన్ పోలీసులకు లొంగిపోయాడు. కోల్చారం పోలీసులు కేసు నమోదు చేసారు.

# రిపోర్టర్ దందా... వెలుగులోకి కొత్త కథనాలు

ఖమ్మం, జూలై 11

ఆ పత్రిక తెలుగు రాష్ట్రాలలోనే సంచలనమైన వార్తలను ప్రచురిస్తుంది. ఆ పత్రికాధిపతి దమ్మున్న జర్నలిస్టుగా పేరుపొందాడు. అటువంటి పత్రికలో ఖమ్మం జిల్లాలో అగ్రికల్చర్ బీట్ చూసే రిపోర్టర్ దందాలకు పాల్పడ్డాడు. అది కూడా అలాంటి ఇలాంటి దందా కాదు.. ఏకంగా సైబర్ నేరానికి పాల్పడ్డాడు. కోట్లు వసూలు చేశాడు. చివరికి పోలీసులకు చిక్కాడు. అతడి వ్యవహారం గురించి దర్యాప్తు చేస్తున్న పోలీసులకు నిజంగానే చుక్కలు కనిపిస్తున్నాయి.కరీంనగర్ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు ఖమ్మం జిల్లాలోని ఓ ప్రముఖ పత్రిక విలేకరిని అరెస్ట్ చేశారు. వాస్తవానికి అతడి అరెస్టు ఖమ్మం జిల్లాలో సంచలనం కలిగించింది. సదరు జర్నలిస్టు ఖమ్మం జిల్లాలోని ఓ పత్రికలో అగ్రికల్చర్ బీట్ చూస్తాడు. పేరుకు రిపోర్టర్ మాత్రమే.. అతడి దందాలు మాత్రం వేరే విధంగా ఉంటాయి. ఉదయం మొత్తం పడుకొని ఉంటాడు. రాత్రి మొత్తం మెలకువతో ఉంటాడు. ఇతడికి సపరేట్ గ్యాంగ్ ఉంటుంది. ఆ గ్యాంగ్ ఇతడు చెప్పిన పని చేస్తుంది.. ఇతడు చెప్పిన వ్యక్తిని ఆ గ్యాంగ్ ఏదైనా చేస్తుంది. అందుకే అతడంటే చాలామందికి హడల్. పైగా ఆ పత్రికలో పని చేసే పెద్ద తలకాయకు ఈ రిపోర్టర్ అత్యంత నమ్మకమైన వ్యక్తి. ఇతడి పై ఎన్ని ఆరోపణలు వచ్చినా.. ఎన్ని రకాలుగా విమర్శలు వచ్చినా ఆ పెద్ద తలకాయ ఆ విలేఖరిని కాపాడింది. అంతేకాదు కీలకమైన విభాగాలు అతడికి అప్పగించింది. దీంతో ఆ రిపోర్టర్ రెచ్చిపోయాడు.. విచ్చలవిడిగా దందాలకు పాల్పడ్డాడు. మేనేజ్మెంట్ వరకు వీటిని వెళ్లకుండా ఆ రిపోర్టర్ ను పెద్ద తలకాయ కాపాడింది.. పైగా ఆ రిపోర్టర్ తో సర్కులేషన్, యాడ్స్ చేయించడంతో మేనేజ్మెంట్ కూడా సైలెంట్ గా ఉండిపోయింది. ఎందుకంటే మేనేజ్మెంట్ కి కావాల్సింది సర్కులేషన్, యాడ్స్ మాత్రమే. బయట ఎన్ని దందాలు చేసుకున్న పర్వాలేదు. మేనేజ్మెంట్ కు ఇవ్వాల్సింది ఇస్తే సరిపోతుంది.చేస్తున్న దందాలు సరిపోవడం లేదని ఇటీవల ఆ విలేకరి సైబర్ నేరాలకు పాల్పడ్డాడు. ఇటీవల కరీంనగర్ జిల్లాలో రెండు సైబర్ నేరాలు నమోదయ్యాయి. ఆ నేరాలలో ఖమ్మం జిల్లాకు చెందిన ఈ రిపోర్టర్ ను కరీంనగర్ జిల్లా పోలీసులు నిందితుడిగా గుర్తించారు. బుధవారం అరెస్ట్ చేశారు. క్రిప్టో కరెన్సీ ఇప్పిస్తానంటూ సదరు రిపోర్టర్ కోట్లలో పలువురిని మోసం చేసినట్టు తెలుస్తోంది. కేవలం కరీంనగర్ మాత్రమే కాకుండా మహారాష్ట్ర లోనూ ఇతడు పై సైబర్ నేరాలు నమోదైనట్టు తెలుస్తోంది. ఆ కేసుల్లో ఇతడిని నిందితుడిగా చేర్చినట్టు కరీంనగర్ పోలీసులు చెబుతున్నారు. ఖమ్మం నగరంలోని మరో మూడు సైబర్ క్రైమ్ కేసుల్లోనూ ఇతడి పేరు ఉన్నట్టు తెలుస్తోంది. అయితే ఖమ్మం నగరంలో నమోదైన మూడు సైబర్ క్రైమ్ లలో ఇతడు ప్రమేయం ప్రత్యక్షంగా ఉందా? పరోక్షమైన పాత్ర పోషించాడా? అనే అంశాలపై దర్యాప్తు జరగాల్సి ఉంది.ఇతడు అరెస్టు అయిన నేపథ్యంలో.. ఇతడు గనుక ఆ వివరాలు చెబితే తమ ఉద్యోగాలతో పాటు.. తాము కూడా జైలుకు వెళ్లాల్సి ఉంటుందని ఆ పత్రికలో పనిచేస్తున్న ఇద్దరు ప్రముఖ వ్యక్తులు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఆ ప్రయత్నాలు విఫలం అయినట్టు తెలుస్తోంది. ఇతడి సైబర్ నేరాలకు ఆ ఇద్దరు ముఖ్య వ్యక్తులు కూడా తమ వంతు సహకారం అందించారని తెలుస్తోంది. ఇతడు అరెస్టు అయిన తర్వాత వాళ్ళిద్దరూ తమ ఫోన్ లను స్విచ్ ఆఫ్ చేసుకున్నారని తెలుస్తోంది.. అయితే పోలీసులు సదరు విలేకరి కాల్ డాటా మొత్తాన్ని పరిశీలించి.. మరింత లోతుగా సమాచారాన్ని సేకరించి అవకాశం కనిపిస్తోంది. మరోవైపు సైబర్ క్రైమ్ పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేయాలని ఆ రిపోర్టర్ చేతుల మోసపోయిన వారు కోరుతున్నారు..

# ఊపందుకున్న రియల్ ఎస్టేట్..

## అంచనాలను మించిన ధరలు.. చదరపు గజం రూ.13 వేలు

నల్గోండ, జూలై 11,

నల్గొండలో హౌసింగ్ బోర్డు కాలనీ ప్లాట్ల వేలం ఊహించని రీతిలో జరిగింది. దేవరకొండ రహదారిలోని హెచ్ఐజీ, ఎంఐజీ ప్లాట్లకు భారీ డిమాండ్ వచ్చింది. 27 ప్లాట్లకు వేలం వేయగా 21 అమ్ముడుపోయాయి. దీని ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.8.97 కోట్ల ఆదాయం వచ్చింది. చదరపు గజానికి రూ.28,500 వరకు ధర పలికింది. నల్గొండలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందుతోందని ఈ వేలం ద్వారా తెలుస్తోంది.నల్గొండ – దేవరకొండ రహదారిపై ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీలోని హెచ్ఐజీ మరియు ఎంఐజీ ప్లాట్లు మంగళవారం జరిగిన వేలం పాటలో ఊహించని రీతిలో హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. మొత్తం 27 ప్లాట్లకు నోటిఫికేషన్ జారీ చేయగా.. వాటిలో 21 ప్లాట్లు కొనుగోలుదారులను ఆకర్షించాయి. ఈ విక్రయాల ద్వారా హౌసింగ్ బోర్డుకు ఏకంగా రూ.8.97 కోట్లు ఆదాయం సమకూరింది. వేలంలో ప్రతి ప్లాటు దాని కనీస ధర కంటే అధిక ధరకే విక్రయించడం విశేషం. ఇది నల్గొండలో రియల్ ఎస్టేట్ రంగానికి పెరుగుతున్న డిమాండ్‌ను స్పష్టం చేస్తోంది. హెచ్ఐజీ ప్లాట్లకు చదరపు గజానికి రూ.15,000, ఎంఐజీ ప్లాట్లకు రూ.13,000 కనీస ధరగా నిర్దేశించినప్పటికీ.. కొన్ని ప్లాట్లు దాదాపు రెట్టింపు ధరలకు అమ్ముడయ్యాయి. హెచ్ఐజీ విభాగంలో అత్యధికంగా చదరపు గజానికి రూ.28,500 పలకగా, మరో రెండు హెచ్ఐజీ ప్లాట్లు రూ.25,500, రూ.24,000 ధరలకు విక్రయమయ్యాయి. ఎంఐజీ విభాగంలో 220 చదరపు గజాల ఒక ప్లాటు ఏకంగా రూ.23,500 ధరకు అమ్ముడుపోయింది. మొత్తం 4660 చదరపు గజాల విస్తీర్ణంలో జరిగిన ఈ విక్రయాల్లో సగటున చదరపు గజానికి రూ.19,069 ధర పలికింది.తెలంగాణలో నల్గొండతో పాటు పలు ఇతర ప్రాంతాల్లోనూ తెలంగాణ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా నిర్మించిన హౌసింగ్ బోర్డు కాలనీలు ఉన్నాయి. ఈ కాలనీలు సాధారణంగా నగరాలు, పట్టణాల శివారు ప్రాంతాల్లో, లేదా వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఏర్పాటు చేయబడతాయి. వీటిలో కొన్ని ముఖ్యమైనవి.. కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్, చందానగర్, మియాపూర్, కేపీహెచ్‌బీ కాలనీ వంటి ప్రాంతాల్లో అనేక హౌసింగ్ బోర్డు కాలనీలు విస్తరించి ఉన్నాయి. ఇవి దశాబ్దాలుగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వృద్ధికి కీలక కేంద్రాలుగా నిలిచాయి. రంగారెడ్డి జిల్లాలో.. శంషాబాద్, కోకాపేట, కొంపల్లి, గండిపేట వంటి ప్రాంతాల్లో కొత్తగా అభివృద్ధి చెందుతున్న హౌసింగ్ ప్రాజెక్టులతో పాటు హౌసింగ్ బోర్డు కాలనీలు కూడా ఉన్నాయి.మెదక్ జిల్లాలో.. సంగారెడ్డి వంటి పట్టణాల్లో కూడా హౌసింగ్ బోర్డు ద్వారా అభివృద్ధి చేసిన గృహాలు ఉన్నాయి. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం ఈ జిల్లాల కేంద్రాలు మరియు వేగంగా వృద్ధి చెందుతున్న పట్టణాల్లో కూడా హౌసింగ్ బోర్డు కాలనీలు లేదా హౌసింగ్ బోర్డు లేఅవుట్లు ఉన్నాయి. ఇవి స్థానిక ప్రజలకు అందుబాటు ధరలలో గృహాలను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేయబడ్డాయి.నల్గొండలో జరిగిన ఈ వేలంపాట.. తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగం ఎంత వేగంగా వృద్ధి చెందుతుందో.. ముఖ్యంగా ద్వితీయ శ్రేణి నగరాలు, జిల్లా కేంద్రాల్లో భూమికి, గృహాలకు డిమాండ్ ఎలా పెరుగుతుందో స్పష్టం చేస్తుంది. మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రభుత్వ పథకాలు, ప్రజల కొనుగోలు శక్తి పెరగడం వంటివి ఈ వృద్ధికి కారణమవుతున్నాయి. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా సానుకూల సంకేతంగా చెప్పుకోవచ్చు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాత శిశువు మృతిస బంధువుల అందోళన

మేడ్చల్ జూలై 11,

మల్లాపూర్ సూర్య నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం జరిగింది. వైద్యుల నిర్లక్ష్యం తో నవజాత శిశువు మృతి చెందిందని బాధిత బంధువులు ఆరోపించారు. గర్భిణి కవిత డెలివరీ కోసం నిన్న ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. డెలివరీ అనంతరం నవజాత శిశువు మృతి చెందింది. తల్లీ,శిశువును గాంధీ ఆసుపతకరికి తరలించగా అప్పటికే పాప మృతి చెందిందనిగాంధీ వైద్యులు వెల్లడించారు. డాక్టర్ లేకుండా స్టాఫ్ నర్స్ డెలివరీ చేసిందంటూ ఆసుపత్రి ఎదుట బంధువులు ఆందోళనకు దిగారు.

## బాలాజీ నగర్ లో హైడ్రా కూల్చివేతలు

కూకట్పల్లి జూలై 11,

కూకట్పల్లి బాలాజీ నగర్ డివిజన్ హబీబ్ నగర్లో హైడ్రా కూల్చివేతలు కొనసాగాయి. నాలా ఆక్రమణపై హైడ్రా అధికారులు చర్యలు తీసుకున్నారు.

పోలీసు బందోబస్తు మధ్య నడుమ అక్రమణాలను తొలగించారు. ఎన్ఆర్సి గార్డెన్ ప్రహరీ గోడ, మరో ప్రహరీ గోడ కూల్చివేసారు. ఏడు మీటర్ల నాలా ఉన్నదని అధికారులు గుర్తించారు. నాలాలోని చెత్త, వ్యర్థాలు హైడ్రా సిబ్బంది తొలగించారు.

## కల్తీ కల్లు విషయంలో ప్రభుత్వం ఆలసత్వం చూపిస్తోంది

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్ పల్లి... జూలై 11

కల్తీ కల్లు ఘటనలో కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టడంలో అలసత్వం వహించడమే కాకుండా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే కల్లు కాంపౌండ్స్ ను నడిపిస్తుండడంతో వాటిపై చర్యలు తీసుకోవడం లేదని కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపించారు. ఈ ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు 20 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా అందజేయాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని వారి కఠినంగా శిక్షించాలన్నారు. ఘటన జరిగిన వెంటనే కళ్ళు కాంపౌండ్స్ అధికారులు తెలుపుతున్న తానే స్వయంగా కాంపౌండ్లోకి వెళ్ళామని ఎక్కడ సీజ్ చేశారో చూపించాలని ప్రశ్నించారు. ఇద్దరు మంత్రులు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించడమే తప్ప అండగా నిలవలేదని విమర్శించారు. నిమ్స్ ఆస్పత్రికి అంబులెన్స్ లో బాధితులను తీసుకొని వెళితే వారు చేర్పించుకోక అటు ఇటు తిప్పడంతోనే పలువురు చనిపోయినట్లు ఆయన వెల్లడించారు. బాధితులకు న్యాయం చేయకపోతే కుటుంబాలతో కలిసి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేలా కార్యక్రమాలను చేపడతామని అన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణకు 16 నూతన ద్విచక్ర వాహనాలు

### ప్రారంభించిన కడప జిల్లా ఎస్పీ ఇ.జి అశోక్ కుమార్

### ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు.

బద్వేలు

ట్రాఫిక్ నియంత్రణ కోసం అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన ఒక బుల్లెట్ వాహనం, 15 – అపాచి ఆర్.టి.ఆర్ ద్విచక్ర వాహనాలను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఇ.జి అశోక్ కుమార్ ప్రారంభించారు.

రాష్ట్ర డిజిపి ఆఫీసు మంగళగిరి నుండి వచ్చిన ఈ వాహనాలకు సైరన్, బ్లింకర్స్, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం, క్రౌడ్ కంట్రోల్ చేయడానికి అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించారన్నారు. జిల్లాలోని కడప ట్రాఫిక్ పియస్ కి 7 , ప్రొద్దుటూరు ట్రాఫిక్ పియస్ కి 4 , పులివెందుల ట్రాఫిక్ పి.ఎస్ కు 2, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు కు ఒకొక్కటి చొప్పున నూతన వాహనాలు కేటాయిస్తున్నామన్నారు

విజిబుల్ పోలీసింగ్ పెరగడంతో ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తారని భావిస్తున్నామన్నారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడినప్పుడు ఈవాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎక్కడైనా ఫోర్ వీలర్ వెళ్ళలేని ప్రాంతాలలో టూ వీలర్స్ వెళ్ళి అక్కడ ట్రాఫిక్ సమస్యను తగ్గించి, ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించాలనే ముఖ్య ఉద్దేశ్యం తో పని చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్.పి బి.రమణయ్య, ఏ.ఆర్ డి.ఎస్.పి శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి ఎన్.సుధాకర్, మహిళా పి.ఎస్ డి.ఎస్.పి ఇ.బాలస్వామి రెడ్డి, డి.టి.సి డి.ఎస్.పి అబ్దుల్ కరీం, కడప డి.ఎస్.పి ఎ.వెంకటేశ్వర్లు, ప్రొద్దుటూరు డి.ఎస్.పి పి.భావన, మైదుకూరు డి.ఎస్.పి రాజేంద్ర ప్రసాద్, జమ్మలమడుగు డి.ఎస్.పి వెంకటేశ్వర రావు, పులివెందుల డి.ఎస్.పి మురళి నాయక్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ లు దారెడ్డి భాస్కర్ రెడ్డి, ఆర్.పురుషోత్తం రాజు, ఆర్.ఐ లు వీరేష్, శ్రీశైల రెడ్డి, శివరాముడు, కడప ట్రాఫిక్ సి.ఐ జావీద్, ప్రొద్దుటూరు ట్రాఫిక్ సి.ఐ దేవకిరణ్, కడప కమాండ్ కంట్రోల్ సి.ఐ వెంకటేశ్వర్లు, ఆర్.ఎస్.ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆ 8 కుటుంబాలకు దిక్కెవరు...

హైదరాబాద్, జూలై 11

సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో సిగాచీ పరిశ్రమలో సరిగ్గా పదిరోజుల క్రితం సంభవించిన భారీ పేలుడుతో 44మంది కార్మికుల ప్రాణాలు కొ?ల్పోయారు. ఇంకా 16 మంది వేరు వేరు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. పోయిన ప్రాణాలు తిరిగి తీసుకురాలేరు. కనీసం కుటుంబ సభ్యులకు మృతదేహాలు అప్పగించడంలోనూ సిగాచీ యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నేటికీ ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 8 మంది కార్మికుల మృతదేహాలు లభించలేదు. వారి ఆనవాళ్లు దొరకలేదు. కనీసం బూడిదైనా ఇవ్వండి మహా ప్రభో అంటూ పదిరోజులుగా ఫ్యాక్టరీ ముందు పడిగాపులు పడ్డ కుటుంబ సభ్యులు బరువెక్కిన గుండెలతో బోరున విలపిస్తున్నారు. చివరి చూపు చూడలేదు. అంతిమ సంస్కారలైనా చేస్తే, మా బిడ్డల ఆత్మశాంతిస్తుందని కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసి, చూసి ఓపిక నశించి అలసిపోయారు. జస్టిన్, అఖిల్, వెంకటేష్, ఇర్ఫాన్ అన్సారీ, రాహుల్, శివాజీ, విజయ్, రవి ఇలా ఈ ఎనిమిది మంది సిగాచీ ప్రమాదం జరిగిన సమయంలో డ్యూటీలో ఉన్నారు. పేలుడు జరిగిన సమయంలో విధులు నిర్వహిస్తున్నట్లుగా కుటుంబ సభ్యులకు ఇచ్చిన సమాచారం ఆధారంగా స్పష్టమవుతోంది. అయితే పేలుడు తరువాత వీరి ఆచూకీ నేటికీ తెలియలేదు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కుటుంబ సభ్యుల డిఎన్ ఏ లు పలుమార్లు సేకరించినా ఫలితంలేదు. ఆ ఎనిమిది మంది మృతదేహాలు గుర్తించడం మా వల్లకాదంటూ తాజాగా క్లారిటీ ఇచ్చిన అధికారులు, కుటుంబ సభ్యుల ఆగ్రహాన్ని చల్లార్చేందుకు 15లక్షలు ముట్టజెప్పి మీ ఇళ్లకు వెళ్లండంటూ తాత్కాలికంగా చేతులు దులుపుకున్నారు. తిరిగి మూడు నెలల తరువాత మేమే పిలుస్తామంటూ చెప్పి పంపించారు.ఈ మొత్తం వ్యవహారంపై ఆచూకీ దొరకని మృతుల కుటుంబ సభ్యుల వాదన మరోలా ఉంది. మృతదేహాల వెలికితీతలో మొదటి నుంచి తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తున్నారు. సాధ్యమైనంత వేగంగా శిథిలాల తొలగింపు చేయాల్సి ఉండగా, నెమ్మదిగా తొలగింపు ప్రక్రియ జరగడంతో మృతదేహాల గుర్తింపు కష్టమవ్వడంతోపాటు, మాంసపు ముద్దలుగా విడిపోవడం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పది రోజులైనా ఆచూకీ లభించకపోవడంతో ఇప్పుడు మావల్ల కాదంటూ చేతులెత్తేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదంలో మృతుల ఆచూకీ లభించలేదని సర్టిఫికేట్ ఇవ్వమని వారి కుటుంబ సభ్యులు అడిగినా పట్టించుకోవడంలేదు. మేము నిర్ధారించము, మూడు నెలల తరువాత రండి అప్పుడు చూద్దామంటూ తేల్చిచెప్పడం దిక్కుతోచని స్దితిలో ఆచూకీ దొరకని 8 మందికి చెందిన కుటుంబ సభ్యులు ఒక్కొక్కరుగా వెనుదిరిగి తమ సొంత రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారు. సిగాచీ యాజమాన్యం ఘటనా స్దాలానికి చేరుకోలేదు. డబ్బుతో ఏదైనా సాధ్యమే అన్నట్లుగా యాజమాన్యం తీరు కనిపిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరిహారం ప్రకటించాం. మృతదేహాల కోసం ఆలోచించాల్సిన పనేలేదు అన్నట్లుగా వ్యవహరించిందనే ఆరోపణలు వెల్లుతెత్తున్నాయి.ఐదు నెలల క్రితమే పెళ్లైన ఉప్పల్ కు చెందిన అఖిల్ ఫ్యాక్టరీలోకి వచ్చినట్లు భార్యకు మెసేజ్ పెట్టిన పదినిమిషాల్లోనే బ్లాస్ట్ జరిగింది. తండ్రికి ఏకైక ఆధారంగా ఉన్న జస్టిన్ ఇక తిరిగి రాదని తెలిసిన తండ్రి దిక్కుతోచని స్దితిలో బోరున విలపిస్తున్నాడు. శ్రీకాకుళం నుంచి ఉపాధి కోసం వచ్చిన వెంకటేష్ పరిస్దితి మరింత దయనీయం. తండ్రిని కంటికి రెప్పలా కాపాడుకునే వెంకటేష్ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడనే వార్త టివిలో చూసి నిర్ఘాంతపోయారు. సిగాచీ వద్దకు వచ్చిన తండ్రి, కాళ్లరిగేలా తిరిగి , బిడ్డకోసం చూసిన ఎదురు చూపులు ఇంకా సిగాచీ యాజమాన్యాన్ని ప్రశ్నిస్తునే ఉన్నాయి. నా బిడ్డ ఎముకలైనా ఇవ్వండైయ్యా అని వేడుకున్నా ఆలకించేవారు లేరు.ఇలా సిగాచీ ప్రమాదంలో మిసైన మృతుల కుటుంబసభ్యుల హృదయవిదారక రోదనలు అంతులేనివి. ఇవన్నీ పట్టనట్లుగా వ్యవహించిన యాజమాన్యం చివరకు డబ్బు ఇచ్చి పంపుతున్నామంటూ వ్యవహరించిన తీరు, కనీసం అంతిమ సంస్కారాలు కూడా చేసుకునే అవకాశంలేని దుస్దితి, బాధితుల కుటుంబాలకు అంతులేని గుండెకోతను మిగల్చింది.

## జూబ్లీ హిల్స్ లో మంత్రులు పొన్నం, వివేక్, తుమ్మల పర్యటన పలు పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

హైదరాబాద్

మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి,తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం నాడు జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో పర్యటించి 5.12 కోట్ల రూపాయలు తో అభివృద్ధి పనులకు శంకుస్థాపన,ప్రారంభోత్సవాలు జరిపారు.

యూసుఫ్ గూడా సర్కిల్ లోనీ వెంగల్ రావు నగర్ లోని గురుద్వార్ కమన్ వద్ద 100.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేసారు.

ఈకార్యక్రమంలో మేయర్ గద్వాల విజయ లక్ష్మి,, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత ,జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, అజారుద్దీన్, కార్పొరేటర్లు ,జీహెచ్ ఎంసీ అధికారులు, ఇతర ముఖ్యనేతలు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జూబ్లిహిల్స్ నియోజకవర్గం లో ఈరోజు 5 కోట్ల రూపాయలకు పైగా నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసుకోవడం జరుగుతుంది. వెంగల్ రావు నగర్ కాలనీ లో ప్రజా పాలన ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని సమస్యలు తొలగిస్తున్నాం. సీసీ రోడ్లకు 100.5 లక్షలతో నిర్మించడానికి శంకుస్థాపన చేసుకున్నాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నీళ్లు ,నిధులు, నియామకాల కోసం ఆకాంక్షించమో , హైదరాబాద్ నగరంలో బస్తీలు కాలనీ లు అభివృద్ధి జరగలేదని అన్నారు.

గత ప్రభుత్వంలో వాళ్ళు ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాల్లో దగ్గర ఉన్నవారికి మాత్రమే అభివృద్ధి వివక్ష పూరితంగా జరిగింది. తాగునీరు ,రోడ్లు ,డ్రైనేజీ , ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో కేబినెట్ మొత్తం హైదరాబాద్ లోని 15 నియోజకవర్గాల్లో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు తీసుకుంటున్నాం. హైదరాబాద్ ప్రజలకు విజ్ఞప్తి మీకు ఎక్కడైనా ప్రజా సమస్యలు ఉంటే స్థానిక అధికారి ,ప్రజా ప్రతినిధుల దృష్టి కి లేదంటే మంత్రుల దృష్టికి తీసుకురండి. కొంత మంది ఉప ఎన్నికల సమయంలో ఇక్కడికి వస్తున్నారు. ఈ 10 సంవత్సరాల్లో మీరు ఏం చేశారు.. మీరు అధికారంలో ఉండి ఇల్లు ,ఉపాధి అవకాశాలు,కాలనీ లు అభివృద్ధి చేశారా. కంటోన్మెంట్ లో ప్రమాదవశత్తు అక్కడి ఎమ్మెల్యే మరణించిన అభివృద్ధి కోరుతూ గణేష్ గారిని గెలిపించారు. మీ సమస్యలు పరిష్కారం చేసుకోండి ప్రజా పాలన ప్రభుత్వం లో మీకు అండగా ఉంటాం..మంత్రులు నిరంతరం కష్టపడుతున్నారు. అభివృద్ధికి అండగా ఉండండని అన్నారు.

## రంగరాయ మెడికల్ కాలేజీలో లైంగిక వేధింపులు

కాకినాడ

రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో లైంగిక వేధింపులు కలకలం రేపాయి. నలుగురు వైద్య విద్యార్థినులను ల్యాబ్ టెక్నీషియన్లు లైంగిక వేధిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి.

## సైబర్ నేరానికి గురైన వెంటనే 1930 నంబర్ కు కాల్ చేసి వివరాలు తెలియపరచాలి!

### పోలీస్ కమిషనర్ డాక్టర్ బి, అనురాధ

సిద్ధిపేట

గోల్డెన్ అవర్ సైబర్ బారిన పడిన గంటలోపు సంప్రదిస్తే డబ్బులు తిరిగి వచ్చే అవకాశం ఎక్కువఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, క్రెడిట్ కార్డ్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, సోషల్ మీడియా ఫ్రాడ్ ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు..జిల్లా పోలీస్ అధికారులు సిబ్బంది కళాబృందం సభ్యులు ప్రతిరోజు ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు.భవిష్యత్తు సైబర్ నేరాల తో మాత్రమే ఉంటుందని, ప్రజలు జాగ్రత్తలు ఉండాలిపోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. రానున్న రోజులలో సైబర్ నేరాలకు గురై ప్రజలు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతిరోజు ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. సైబర్ నేరాలకు ప్రజలు గురైన వెంటనే 1930 నెంబర్ కి సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరాలకు బారిన పడిన గంటలోపు ఫిర్యాదు చేసిన ఎడల ఆర్థిక నష్టం జరిగిన వాటిని తిరిగి రప్పించే అవకాశం ఎక్కువగా ఉన్నందున గోల్డెన్ ఆవర్, లో ఫిర్యాదు చేయడం చాలా ముఖ్యమైనదని తెలిపారు. సమాజంలో ప్రజలకు జిల్లా పోలీసు యంత్రాంగం తరపున మరింత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రస్తుత సమాజంలో జరిగే ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, లోన్ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, సోషల్ మీడియా ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, లాటరీ ఫ్రాడ్, క్రెడిట్ కార్డు ఫ్రాడ్ లాంటివి ఎక్కువగా జరుగుతున్నదని ప్రజలకు వాటిపై పూర్తి అవగాహన కల్పించి, ఇలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండడం ఉత్తమ మార్గమని తెలియజేశారు. వాట్సాప్ గ్రూపుల నందు ఎలాంటి ఏపీకే ఫైల్స్ లను డౌన్లోడ్ చేసుకోకుండా ఉండాలని, వాటి ద్వారా మొబైల్ ఫోను సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళుతుందని ఇలాంటి వాటికి గురైనప్పుడు వెంటనే జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించాలని తెలిపారు. ముఖ్యంగా ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్ లలో ప్రజలు అత్యాశతో డబ్బులను వారికి విడతల వారీగా అందజేస్తూ చివరికి మోసపోయామనే విషయాన్ని గ్రహిస్తున్నారని తెలిపారు. అనవసరంగా ఇతరుల వ్యక్తులకు క్రెడిట్ కార్డు ఓటిపి నంబర్లను తెలియజేయడం వల్ల డబ్బు నష్టపోతున్నారనే విషయాన్ని తెలిపారు. అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలు జరిగే అవకాశం తక్కువగా ఉంటుందని తెలిపారు.

## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన అధికారులు.

సిద్ధిపేట

రాష్ట్రంలోని అన్ని ఈవిఎం గోదాం ల తనికిలో బాగంగా శుక్రవారం హైదరాబాద్ నుండి అదనపు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మరియు ఈవిఎం నోడల్ ఆఫీసర్ హరిసింగ్, ఈవిఎం కన్సల్టెన్సీ ఆఫీసర్ ప్రసాద్ కలెక్టర్ పక్కన గల ఈవిఎం గోదాం ను జిల్లా కలెక్టర్ కె. హైమావతి, అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హామిద్ లతో కలిసి పరిశీలించారు.లాగ్ బుక్ నీ వెరిఫై చేసి అందులో సంతకం చేశారు. సెక్యూరిటీ మరియు సిసి కెమెరా మానిటరింగ్ రూమ్ పని తీరును పరిశీలించారు. ఈవిఎం గోదాం చుట్టు 24/7 గట్టి బందోబస్తు తో విధులు నిర్వహించాలని పోలీస్ అధికారులకు తెలిపారు. రెవెన్యూ అధికారులు తరచు పర్యవేక్షణ చెయ్యాలని సూచించారు.

## జ్ఞానాన్ని ప్రసాదించే పుణ్యక్షేత్రాలే పాఠశాలలు

విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల బాధ్యతే కీలకమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్. ఈరన్న నాయక్,అభిప్రాయపడ్డాడు. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కొట్కూరు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పేరెంట్స్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పండుగ వాతావరణం తలపించింది. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో జాతర వాతావరణాన్ని తలపించాయి. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్. ఈరన్న నాయక్, మాట్లాడుతూ పిల్లలు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయుడు అతిథులతో కలిసి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఇలాంటి సమావేశాలు సాధారణంగా ప్రవేట్ పాఠశాలల్లో ఉండేవి. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో నిధులకు ఏమాత్రం లెక్కచేయకుండా పండుగ వాతావరణంలా నిర్వహించడం గర్వకారణంగా ఉందని అన్నారు. అలాగే పాఠశాల కో ఆప్షన్ మెంబర్ ఖాజా మొహిద్దిన్ మాట్లాడుతూ ఇలాంటి సమావేశాలతో విద్యార్థులకు వారి తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల మధ్య అన్యోన్యత భావం ఏర్పడుతోంది. పిల్లల సమస్యలను వారి అలవాట్లపై తల్లిదండ్రులతో చర్చించే అవకాశం ఆత్మీయ సమావేశంలో ఉంటుందని తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులతో కలిసి అందరూ సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్. ఈరన్న నాయక్, పి. జ్యోతి (ఉపాధ్యాయురాలు ), బి (లక్ష్మీదేవి ), లాడెన్ ( టిడిపి మైనార్టీ నాయకుడు ), ఎస్. సలాం ( కమిటీ చైర్మన్ ), రామేశ్వరి ( వైస్ చైర్మన్ ), ఎస్. ఖాజా మొహిద్దిన్ ( కో ఆప్షన్ మెంబర్, 4 వార్డు ఇంచార్జ్ ), ఐసిడిఎస్ ( జి. అనురాధ ), ఆశ వర్కర్లు వడ్డే ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

==================================

# ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్న ఎమ్మెల్యే నాయిని.

## పార్టీలకు అతీతంగా కాలనీల అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తున్నాం.

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)జూలై11:ప్రజా పాలనలో భాగంగా గెలిచిన నాటి నుంచి ప్రతి రోజు రెండు డివిజన్ లలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం 4 వ డివిజన్ లోని జ్యోతి బసు నగర్ లో రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, అక్షర కాలనీలో కాలనీ నుంచి ప్రధాన రోడ్డు వరకు రూ.49.90 లతో రోడ్డు నూతన సీసీ రోడ్డు పనులను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ప్రారంభించిన రోడ్డులో పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడారు.

అనంతరం ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ:

ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారమే లక్ష్యం ప్రభుత్వం మేము పనిచేస్తున్నాం..

జీ.డబ్ల్యూ. ఎం. సి ,కుడా సహకారంతో అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

శంకుస్థాపన చేసిన అనతికాలంలో పనులు ప్రారంభం చేసేలా చిత్త శుద్ధితో పనిచేస్తున్నాం.

కేవలం గడిచిన 18 నెలల్లో ఒక్క 4 వ డివిజన్ లలో 4.50 కోట్లు కేటాయించినం.

విషయ పరిజ్ఞానం లేని వాళ్ళు అక్కడక్కడ మాట్లాడుతున్నారు.

అన్ని డివిజన్ లలో మాపై నమ్మకంతో ఓటు వేశారు అభివృద్ధి లో పార్టీలకు అతీతంగా అందరూ భాగస్వాములు



కావాలనే ఉద్దేశ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నిధులను మంజూరు చేయడం జరిగింది.

ఆదారాలతో అన్ని మీడియా ముందు ఉంచుతా.

గతంలో ఉన్న కాంగ్రెస్ కార్పొరేటర్లకు పార్టీని చూసి నిధులు కేటాయించలేదు.

మేము ప్రజల అభివృద్ధి ముఖ్యమని బీజేపీ,బి ఆర్ ఎస్ కార్పొరేటర్ల వార్డులలో సమాన నిధులు కేటాయించినం.

కార్పొరేషన్ సమావేశంలో ప్రజల సమస్యలపై పోరాడకుండా రాజకీయ ప్రయోజనాల కోసం కొద్దిమంది మాత్రమే బైకాట్ చేసి వెళ్లారు.

మాకు పూర్తి స్థాయి చిత్తశుద్ధి ఉంది.మీరు కావాలంటే సూత్రప్రాయమైన సూచనలు ,సలహాలు ఇవ్వండి కానీ ప్రతి అంశంపై రాజకీయ ప్రయోజనం చూడకండి అని అన్నారు.

# ఆన్-ఫీల్డ్ శిక్షణ పూర్తి చేసుకుని జిల్లా ఎస్పీ డా: జి. జానకి షర్మిల ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్ ఎస్.ఐలు.



భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, జూలై 11: నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఆర్మ్డ్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు(ఆర్.ఎస్ ఐ) లు ఆన్-ఫీల్డ్ ట్రైనింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుని, శుక్రవారం జిల్లా ఎస్పీ డా: జి. జానకి షర్మిల ను మరియు అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి (అడ్మిన్)ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ,"పోలీసు సేవ అనేది ప్రజల రక్షణకోసం, న్యాయం కోసం. క్రమశిక్షణ, జవాబుదారీ తనంతో కూడిన విధులు నిర్వహించడం వలనే పోలీసు శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని పొందవచ్చు" అని పేర్కొన్నారు.ఆర్.ఎస్.ఐలు తమ శిక్షణలో నేర్చుకున్న అనుభవాలను పంచుకుంటూ, భవిష్యత్తులో జిల్లా పోలీసు యంత్రాంగానికి తమవంతు సేవలు అందిస్తారు.

# స్వతంత్ర భారతదేశంలో సన్న బియ్యం పంపిణిని మించిన సంక్షేమ పథకం లేదు

## రేషన్ కార్డు ల జారీ నిరంతర ప్రక్రియ.

## పేదవారికి సంక్షేమ పథకాలు అందించటమే ప్రభుత్వ ధ్యేయం

## పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

## జిల్లా ఇంచార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్

సూర్యాపేట జిల్లా బ్యూరో(భారతశక్తి) జూలై 11:ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేస్తుందని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం తిరిమలగిరి నందు జూలై 14 న సి ఎం చేతుల మీదుగా నూతన రేషన్ కార్డులు పంపిణి ప్రారంభోత్సవం చేసే సభ పై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్,ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి,ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జి మంత్రి అడ్లురు లక్ష్మణ్ కుమార్ లతో కలిసి రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి యన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత 100 సంవత్సరాలలో భారతదేశంలోని ఏ రాష్ట్రము చేయని బి సి కులగణన 1.04 లక్షల ఎన్యూమరేటర్ల ద్వారా సేకరించి విజయవంతం చేశామని ఇచ్చిన మాట ప్రకారం కులగణన చేసి, బి సి లకి స్థానిక సంస్థ ఎన్నికలలో 42 శాతం అమలు కొరకు చట్టంతెచ్చామని, జూలై 10 న నిర్వహించిన క్యాబినెట్ సమావేశం లో బిసి లకి 42 శాతం స్థానిక సంస్థ ఎన్నికల్లో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ప్రజల కోరిక మేరకు ఎస్ సి వర్గీకరణ చేశామని బి సి కులగణన,ఎస్ సి వర్గీకరణ అనే రెండు క్యాబినెట్ సబ్ కమిటిలకి చైర్మన్ గా నేనే వ్యహరించానని తెలిపారు. జూలై 14 న 5 లక్షల కార్డులు నూతనంగా ఇవ్వబోతున్నామని,అదనంగా కుటుంబ సభ్యులని రేషన్ కార్డులలో చేర్చుతున్నామని 13000 కోట్ల రూపాయలు ద్వారా 3.10 కోట్ల మందికి 6 కేజీల సన్నబియ్యం ఉచితంగా ఇచ్చి 95 లక్షల కుటుంబాలకి చెందిన పేదవారికి కడుపు నిండా అన్నం పెట్టి ఆకలి తీర్చటం,అర్హులందరికీ రేషన్ కార్డుల ఇవ్వటం అనేవి నాకు చాలా సంతోషం, సంతృప్తి ని ఇచ్చాయని ఇలాంటి పేదవారికి ఆహార భద్రత కల్పించే సంక్షేమ పథకాలు స్వతంత్ర భారత దేశంలోనే లేవని తెలిపారు.గత పాలకులు ఉప ఎన్నికలు ఉన్నప్పుడే రేషన్ కార్డులు ఇచ్చారని కానీ మేము అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తామని, రేషన్ కార్డులు జారీ నిరంతర ప్రక్రియ అని తెలిపారు.సన్న బియ్యం ద్వారా పేదల ఆకలి తీర్చేందుకు రైతులకి 500 బినస్ ఇచ్చి, మిలర్ల ద్వారా మర ఆడించి సన్న బియ్యం సేకరిస్తున్నామని గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యం దుర్వినియోగం అయ్యాయని తెలిపారు.ఖరీఫ్, రభీ సీజనలలో 281 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండించిభారతదేశం లోనే తెలంగాణ అగ్రగామిగా నిల్చిందని యాసంగి సీజన్ లో చివరి గింజ వరకు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని అన్నారు. ధాన్యం సేకరణ,సన్న బియ్యం పంపిణి,రేషన్ కార్డులు జారీ లాంటివి ప్రజలకి ఇచ్చి గ్రామీణ రైతులు బాగుండాలని తెలంగాణ సస్యాశ్యామలం అయ్యేలా ఈ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.జూలై 14 న వీరులు పుట్టిన పోరాటాల గడ్డ తుంగతుర్తి గడ్డ నుండి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు చేతులు మీదుగా రాష్ట్ర వ్యాప్తంగా నూతన రేషన్ కార్డుల పంపిణి చేసే బహిరంగ సభకి వేలాదిగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని అన్నారు.తుంగతుర్తి నియోజవర్గం బి యన్ ఆర్ లాంటి గొప్ప వీరులు జన్మించిన గడ్డ అని, తెలంగాణ సాయుధ పోరాటం లో భూమి, నీరు కోసం పోరాడిన వీరులెందరో పోరాడినారని అభివృద్ధికి



కట్టుబడి ఉన్నానని మీ ఎ మ్మెల్యే మందుల సామెల్ ప్రతి రోజు రోడ్లు, ఇంటిగ్రేటెడ్ స్కూల్, కాలేజీ లు,నీటి పారుదల ప్రాజెక్ట్ లు కొరకు నిరంతరం కృషి చేస్తున్నాడని గతంలో ఎన్నడూ లేని విధంగా కనివిని రీతిలో తుంగతుర్తి అభివృద్ధి చేసేందుకు నా వంతు సహాయం తప్పకుండ ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.తదుపరి ఇంచార్జి మంత్రి అడ్లురు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత పాలకులు పేదల సంక్షేమం కోసం ఎ పథకం చేయలేదని, పేదవారికి నూతన రేషన్ కార్డులు ఇవ్వలేదని అన్నారు. కానీ ప్రజా ప్రభుత్వం వచ్చినప్పటి నుండి పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందని జూలై 14 న మధ్యాహ్నం 3:00 గంటలకి జరిగే నూతన రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమాన్ని అందరు సమన్వయము చేసుకుంటూ ఎవరు ఊహించని విధంగా విజయవంతం చేయాలని సూచించారు.ఎమ్మెల్యే మందుల సామెల్ మాట్లాడుతూ బిసి లకి 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదములు తెలుపుతూ జూలై 14 న నూతన రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమానికి 9 మండలాలు,2 మున్సిపాల్టీలు,154 గ్రామ పంచాయతీలనుండి 70,000 మంది తరలివచ్చి సభ ని విజయవంతం చేయాలని తెలిపారు.ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ భారత దేశం లో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలు తెలంగాణ లో అమలు జరుగుతుందని తెలిపారు. కృష్ణ, గోదావరి జలాలు గురించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిపిటి ద్వారా వివరించి గత పాలకుల వల్ల తెలంగాణ ప్రజలకి అర్థం అయ్యేలా వివరించారాని అన్నారు. ఆనకట్టలు అనగానే కాటన్ దొర, కే ఎల్ ఆర్ పేర్లు గుర్తు వచ్చినట్టు పెట్టినట్టు ఎత్తి పోతల పథకాలు అనగానే రాబోయే రోజుల్లో ఉత్తమ్ కుమార్ రెడ్డి పేరు గుర్తు ఉండేలా నిర్మిస్తున్నారని అన్నారు.ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నూతన రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమాన్ని అందరం కలిసి విజయవంతం చేయాలని తెలిపారు.రాష్ట్ర వ్యవసాయ కమిషన్ మెంబర్ చెవిటి వెంకన్న యాదవ్ మాట్లాడుతూ నాడు దేశ రక్షకుడిగా,తెలంగాణ సంరక్షడిగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిరంతరం పని చేస్తున్నాడని ఈ ప్రాంత కన్న బిడ్డగా పేదవారు ఆకలితో ఇబ్బంది పడుతున్నారని సన్నబియ్యం పంపిణి హుజూర్నగర్ నుండి రేషన్ కార్డుల తిరుమలగిరి నుండి ప్రారంభిస్తునందుకు మంత్రికి ధన్యవాదములు తెలిపారు.ఈ సమావేశం లో జిల్లా ఎస్పి కే నరసింహ, అదనపు కలెక్టర్ పి రాంబాబు, డిఆర్డీఓ వివి అప్పారావు, డిఎఫ్ఓ సతీష్ కుమార్, డియస్ఒ మోహన్ బాబు, ఆర్డీఓ వేణు మాధవరావు, తహసీల్దార్ హరి ప్రసాద్, అధికారులు, ప్రజా ప్రతినిధులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రామచంద్రాపురం ఇక్రిసాట్ చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం: పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి



రామచంద్రపురం, జూలై 11( భారత శక్తి ):రామచంద్రపురం డివిజన్ పరిధిలోని జాతీయ రహదారి ఆనుకొని డైమండ్ పాయింట్ వద్ద గల డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని రహదారి విస్తరణలో భాగంగా ఇక్రిసాట్ రైల్వే ఫెన్సింగ్ చౌరస్తాలో ఏర్పాటు చేయనున్నట్లు పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ దళిత సంఘాల ప్రతినిధులు, జాతీయ రహదారి సంస్థ అధికారులతో కలిసి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్న స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ మియాపూర్ నుండి సంగారెడ్డి వరకు చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రామచంద్రపురం డివిజన్ పరిధిలోని డైమండ్ పాయింట్ హోటల్ వద్ద గల బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని మరొక చోటుకు తరలించాల్సి వస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, ఆయా దళిత సంఘాల ప్రతినిధులతో చర్చించిన అనంతరం విగ్రహ ఏర్పాటునకు తుది నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. అతి త్వరలో విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేయనన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల సంస్థ డిఈ రామకృష్ణ, సీనియర్ నాయకులు నగేష్ యాదవ్, పరమేష్ యాదవ్, దళిత సంఘాల ప్రతినిధులు రుద్రారం శంకర్, కావలి శ్రీ రాములు, తదితరులు పాల్గొన్నారు.

# ఉక్కు కర్మాగార నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి: జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి

## -ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జేఎస్ డబ్ల్యూ గ్రూప్స్ ప్రతినిధులతో కలిసి స్థల పరిశీలన.

జమ్మలమడుగు, జూలై 11(భారతశక్తి) : సీమవాసుల చిరకాల స్వప్నాన్ని నెరవేర్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులపై దృష్టిసారించిందని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోని సున్నపురాళ్ళ పల్లె వద్ద జేఎస్ డబ్ల్యూ గ్రూప్స్ ఆధ్వర్యంలో ఉక్కుకర్మాగారం శిలాఫలకం వేసిన ప్రాంతాన్ని స్థానిక ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి, ఆ కంపెనీ ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో.. రెండేళ్ల క్రితం 3500 ఎకరాల్లో రూ.8,800 కోట్లతో 30 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులకు రెండేళ్ల క్రితం శిలాఫలకం వేయడం జరిగింది. అయితే.. ఈ కర్మాగార నిర్మాణం తొలిదశ కూడా ప్రారంభం కాకపోవడంతో... ఈ ప్రాంతవాసుల కలను సాకారం చేసే దిశగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో.. రాష్ట్రంలో దేదీప్యమానంగా వెలుగులు నింపే ప్రయత్నం జరుగుతోందని, అందులో భాగంగా జమ్మలమడుగు ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డితో కలిసి జేఎస్ డబ్ల్యూ గ్రూప్స్ ప్రతినిధులతో కలిసి సున్నపురాళ్ల పల్లె సమీపంలో శిలాఫలకం వేసిన ప్రాంతాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. గతంలో జిందాల్ గ్రూపు సంస్థకు గత ప్రభుత్వం దీర్ఘకాలిక లీజు ప్రాతిపదికన భూములను కేటాయింపు, ఒప్పందాలు, ప్రస్తుత పరిస్థితులు, పరిశ్రమ నిర్మాణానికి కావాల్సిన అనుకులతలు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, మొదలైన అంశాలపై కంపెనీ ప్రతినిధులతో చర్చించడం జరిగిందన్నారు. కాగా 2019లో ఏపీ హైగ్రేడ్ స్టీల్స్



పేరుతో శంకుస్థాపన చేయడం జరిగింది. అనంతరం 2023లో స్టీల్ ప్లాంటుకు శంకుస్థాపన చేయడం.. తదుపరి రెండేళ్లు ఎలాంటి నిర్మాణ పనులు జరగలేదన్నారు. అయితే.. రాయలసీమ ప్రజల చిరకాల స్వప్నానికి కార్యరూపం ఇచ్చే దిశగా ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారన్నారు. ఈ కర్మాగారం నిర్మాణం కార్యరూపం దాల్చితే.. జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వడం, వేలాది మంది యువతకు మెండైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జేఎస్డబ్ల్యు స్టీల్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యోగేష్ బేడీ, జీఎం వికాస్ కన్వర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ పూరి, టెక్నీకల్ హెడ్ పురుషోత్తం ప్రసాద్, లైజనింగ్ కార్పోరేట్ హెడ్ కనకరావు, హెచ్ఆర్ హెడ్ ఏ. సుదర్శన్, ప్రాజెక్టు హెడ్ షేక్ నూరుల్, ఆర్డీవో సాయిశ్రీ, స్థనిక యువనాయకులు భుపెద్ రెడ్డి, ఎపి ఐసి జెడ్ఎం శ్రీనివాస మూర్తి, రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పిడుగుపల్లె పంచాయితీ సెక్రెటరీ కి ఘన సన్మానం

## మీ సేవలను మరువలేము సార్ - గ్రామ పంచాయితీ ప్రజలు

పోరుమామిల్ల, భారత శక్తి ప్రతినిధి, జూలై 11: కలసపాడు మండలంలోని పిడుగుపల్లె గ్రామ పంచాయితీ సచివాలయం సెక్రటరీ గుంట్ల మహేష్ బదిలీ పై రంగసముద్రం 2 సచివాలయానికి వెళ్తున్న సందర్భంగా ముద్దంవారి పల్లె గ్రామానికి చెందిన సగిలి డేవిడ్ మరియు సగిలి జయన్న ఆధ్వర్యంలో ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో సచివాలయం మహిళా పోలీస్ జరీనా మాట్లాడుతూ సెక్రెటరీ గొంట్ల మహేష్. పిడుగుపల్లె పంచాయతీలోని గ్రామాలకు సైతం ప్రజలకు ఆయన సేవలు అందించారని ఆమె కొనియాడారు,అదేవిధంగా ప్రజలను, సిబ్బందిని సోదరుని భావంతో కలిసి మెలిసి పని చూసేవారని ఆమె పేర్కొన్నారు. స్నేహ భావంతో ప్రజలకు దగ్గరగా ఉండి సేవలనందించి వారి హృదయములో మంచి స్థానాన్ని సంపాదించుకున్నారు అని అన్నారు, ఈ సన్మాన కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్. సచివాలయం సర్వేయర్ ఓ. స్వాతి. పెండ్లిమర్రి పంచాయితీ సెక్రెటరీ సుబ్బారావు మరియు ముద్దంవారిపల్లె పిడుగు పల్లె గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కోహెడ మండలంలో పర్యటించి వివిధ కార్యక్రమాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

కోహెడ శనిగరం గ్రామంలో మరియు తంగాలపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి మంచి నాణ్యతతో ఇళ్ళను నిర్మిస్తున్నందుకు లబ్ధిదారులను అభినందించారు. ఇల్లు మంజూరై కట్టుకోవడానికి సుముఖత లేని వారి నుండి లేఖలు తీసుకొని వారికి బదులు అర్హత ఉన్న ఇతరులకు ఇందిరమ్మ ఇల్లను కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించారు.ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను నిర్మించడానికి తంగళ్ళపల్లి లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చే శంకుస్థాపన చేసిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం సేకరించిన భూమిలో గల చిన్నచిన్న చెట్లపొదలను తొలగించి శుభ్రం చేయాలని, మరియు ఇతరుల కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు పాటి కబ్జా చేసిన వారికి నోటీసులు పంపించాలని రెవెన్యూ అధికారులను, సర్వే ల్యాండ్ ఆదేశించారు.త్వరలో రాష్ట్ర గవర్నర్ కోహెడ మండల కేంద్రంలో పర్యటన ఉండనున్న నేపథ్యంలో శ్రీ లక్ష్మీ గార్డెన్ ను పరిశీలించి గార్డెన్ మొత్తం శుభ్రంగా తీర్చిదిద్దాలని ఎంపీడీవోను ఆదేశించారు మరియు గార్డెన్ పక్కన గల ఖాళీ స్థలంను పరిశీలించి అవసరమైతే హెలిప్యాడ్ వాడుకునేందుకు పిచ్చి మొక్కలను తొలగించి భూమిని సిద్ధం చేయాలని ఆర్ అండ్ బి డిఈ ని ఆదేశించారు.కోహెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి వైద్య మరియు వైద్య సిబ్బంది హాజరు రిజిస్టర్ ను, అవుట్ పేషంట్ రిజిస్టర్ ను పరిశీలించారు. చాలామంది స్టాఫ్ మెడికల్ ఆఫీసర్ పర్మిషన్ లేకుండా కేవలం లీవ్ లెటర్ మాత్రమే ఉండడం గమనించిన జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసి మెడికల్ అధికారి ముందస్తు అనుమతి లేకుండా సెలవు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాకాలంలో వ్యాధులు అధికంగా ప్రభలే కాలం కాబట్టి వైద్య సిబ్బంది వైద్య అధికారులు కచ్చితంగా ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అవుట్ పేషెంట్ వివరాలను, వారికి అందిస్తున్న మెడిసిన్ వివరాలను ఏరోజు కారోజు ఆన్లైన్లో చేయాలని అన్నారు. అవసరమైన పేషెంట్లకు రక్త, మూత్ర తదితర పరీక్షలు ఖచ్చితంగా చేసి రోగ నిర్ధారణ చేసి అవసరమైన మందులను అందించాలని అన్నారు.

# శ్రీ కృష్ణ ప్రసాద్ స్కూల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు





ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), జూలై 11:విద్యార్థులు ఆరోగ్యవంతంగా వుంటేనే ఉన్నత చదువులలో రాణించడానికి సాధ్యమవుతుందని కెపియం స్కూల్ చైర్ పర్సన్ నిష్ఠాశర్మ అన్నారు.స్కూల్ చైర్ పర్సన్ చొరవ తీసుకుని పేద విద్యార్థులకు వైద్య సమస్యలు రాకుండా రోగాల బారిన పడకుండా పాఠశాలలో ముందస్తుగా వైద్య పరీక్షలు నిర్వహించాలనే సంకల్పంతో గురువారం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు.

ప్రముఖ వైద్యనిపుణులు డా. బి. స్వర్ణ కుమారి, డాక్టర్ కె. రాజశేఖర్ గౌడ్, డా.పరుచూరి వెంకటేశ్వర్రావు, డా. బి. సీతారాం, డాక్టర్ కె. శ్రీధర్ గౌడ్, డా. జి. భార్గవ్, డాక్టర్ ఎం. నాగేశ్వర్ రావు, డాక్టర్ సోహైల్,డాక్టర్ ఎన్. వేణు మాధవరావు గారి ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యూరాలజీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, కంటి, దంత, గుండెకు సంబంధమైన వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం, కంటి సమస్యలు న్నట్లు గుర్తించిన విద్యార్థులందరికీ మరోసారి కంటి పరీక్షలు నిర్వహిస్తామని వైద్యులు వెల్లడించారు.

విద్యార్థులు ఎత్తుకు తగ్గట్టు బరువు ఉండాలని,ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.పౌష్టికాహారం లోపం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై విద్యార్థులకు వైద్యులు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, నర్సయ్య, ఆర్ ఐ కామరాజు , ప్రిన్సిపల్ శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.

# ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ,కార్మికులకు ఇంటి పట్టాలు ,ఆటో స్టాండ్లు ఏర్పాటు చేయాలి: ఏఐటీయూసి




పోరుమామిళ్ల, భారత శక్తి ప్రతినిధి, జూలై 11: పోరుమామిళ్ల మండలం రంగసముద్రంలోని ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్ ,సీపీఐ మండల కార్యదర్శి రవికుమార్ లు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మస్తాన్ సీపీఐ మండల కార్యదర్శి రవి కుమార్ లు మాట్లాడుతూ స్థానిక రంగసముద్రం పంచాయతీ పార్క్ ఆవరణములో సుబ్బు అధ్యక్షతన ఆటో కార్మికుల సమావేశం జరిగింది. కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నాటికి ప్రతి ఆటో కార్మికునికి పదివేల రూపాయలు ఇస్తామన్నా వాగ్దానాన్ని మళ్లీ వాయిదా వేయకుండా ఆటో కార్మికులకు బద్వేల్ లో ఆర్టీవో ఆఫీస్ కడపకు తరలించాలన్న ఆలోచన జిల్లా ఉన్నతాధికారులు విరమించుకోవాలని కోరారు.ఆటో డ్రైవర్స్ మోటారు వాహనాలకు పోలీస్, రవాణా శాఖ అధికారులు ఇస్తున్న ఇ-చలానాల, రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులపై, కక్ష సాధింపుగా జి.ఓ.నెం. 21ని రద్దు చేయాలని, భారీగా పెంచిన డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, ప్రమాదకరంగా ఉన్న గుంతలు , ప్యాచీల రోడ్లను పక్కాగా వేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని, ఆటోలకు స్టాండ్లు, పార్కింగ్ స్థలాలు ఏర్పరచాలి, ఆటో డ్రైవర్స్ మోటారు వాహన డ్రైవర్లకు ప్రభుత్వం సొంత గూడు కోసం, స్థలాలు ఏర్పాటు చేయాలని ఏర్పాటు చేయాలన్నారు.అలాగే జిల్లాలో రోడ్లు గుంతలను బాగు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి ఆటో కార్మికుడు 22, 23 24 బద్వేల్ లో జరుగు జిల్లా మహాసభలకు ప్రతి ఆటో కార్మికులు రావాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు కార్యదర్శులు సఫా , పేరయ్య కేశవ ,ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ ఖాదర్, చంద్ర, గౌరవ అధ్యక్షులు ఈశ్వరయ్య,ప్రభాకర్,యూనియన్ నాయకులు,నర్సింలు, వెంకటేశ్వర్లు, గురప్ప, లాజరు, గోపన్న, పిరయ్య, రామయ్య, , దిలీప్, రామ్మోహన్, దిలీప్, పీరావల్లి, ఖాసిం, అధిక సంఖ్యలో కార్మికుల పాల్గొన్నారు.

# స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ఉ త్సాహంగా వన మహోత్సవం.

## మొక్కలు నాటిన చిట్టి చేతులు.

## ఆకట్టుకున్న వన మహోత్సవ అవగాహన ర్యాలీ.






ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), జూలై 11:పర్యావరణాన్ని పరిరక్షించాలని కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించాలని సందేశం ఇస్తూ స్థానిక స్మార్ట్ కిడ్జ్ చిన్నారులు శుక్రవారం వన మహోత్సవాన్ని బాధ్యతాయుతంగా, ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో , పాఠశాల మైదానంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా పాఠశాల విద్యార్థులు తమ చిట్టి చేతులతో పలు రకాల మొక్కలను నాటారు.తాము వివిధ రకాలుగా సేకరించిన మొక్కలను ప్రత్యేకంగా గుంతలు తీసి ఆ గుంతల్లో పూల మొక్కలు, పండ్ల మొక్కలు , ఆయుర్వేదం మొక్కలు , భవిష్యత్తులో నీడనిచ్చే మొక్కలను ఆనందోత్సవాలతో నాటారు.తొలుత పలు డివిజన్లో ,నగర పుర వీధులలో పాఠశాల చిన్నారులు వన మహోత్సవ అవగాహన ర్యాలీ ఉల్లాసంగా నిర్వహించారు. చేతిలో పలు రకాల సందేశాలను ఇచ్చే ప్ల కార్డులను చేత పూని పురవీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్యపరిచారు. వన సంరక్షణ మన సంరక్షణ , నేచర్ కన్స్ట్రక్ట్ టీచెస్ యూ టు గ్రో, వృక్షో రక్షతి రక్షితః, చెట్లను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు, వనాలు ఉంటేనే జనాలకు భవిష్యత్తు తదితర నినాదాలు ఉన్న ప్ల కార్డులతో ర్యాలీ అందరినీ ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ భూమి మీద బ్రతికే మానవులతోపాటు అన్ని జీవులు ప్రాణ వాయువుతోనే జీవనం కొనసాగిస్తున్నాయని, ఆ ప్రాణవాయువును మనకు చెట్ల ద్వారానే వస్తున్నదని అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి చెట్లు అయ్యేంతవరకు సంరక్షించాలని తెలియజేశారు.

పాఠశాల విద్యార్థులు తమ పుట్టినరోజున తప్పనిసరిగా ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు సమాజంలోని ప్రతి ఒక్కరూ వన మహోత్సవాన్ని నిర్వహించి మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపాల్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన, సహజ వ్యవసాయంతో దీర్ఘకాలిక ప్రయోజనాలు : కృష్ణ జిల్లా కలెక్టర్ డికె బాలాజీ





మచిలీపట్నం, భారతశక్తి ప్రతినిధి,జూలై 11:కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పిఎం సూర్య ఘర్ యోజన, సహజ వ్యవసాయం వంటి పథకాల ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలనిచ్చే పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పీఐబీ నిర్వహించిన వార్తాలాప్ కార్యక్రమంలో కృష్ణ జిల్లా కలెక్టర్ డికె బాలాజీ పత్రికా విలేకరులకు సూచించారు. వివిధ ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడంలో జర్నలిస్టులు మరియు మీడియా పాత్రను కీలకమని ప్రభుత్వ పథకాలను ప్రజలకు చెరవేయాలని విజ్ఞప్తి చేశారు.కేంద్ర పథకాలపై సమాచారాన్ని సమర్థవంతంగా వ్యాప్తి చేయడం వంటి కీలక అంశాల గురించి జర్నలిస్టులకు మరింత అవగాహన కల్పించేందుకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) శుక్రవారం కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఒక రోజు మీడియా వర్క్‌షాప్ వార్తాలాప్ కార్యక్రమం నిర్వహించింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గ హాజరైన కృష్ణ జిల్లా కలెక్టర్ బాలాజీ వికసిత భారతానికి అమృత కాలం సేవ సుపరిపాలన పేదల సంక్షేమానికి 11 ఏళ్ళ అనే శీర్షికతో సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ప్రచురణను కూడా ఆయన విడుదల చేశారు.వార్తాలాప్ లో పాల్గొన్న విలేకరులను ఉద్దేశించి మాట్లాడుతూ, ''ప్రజా విధానాలను పౌరులకు తెలియజేయడంలో జర్నలిస్టులు కీలక బాధ్యతను పోషిస్తారు మరియు కొత్త విధానాలను రూపొందించడంలో మరియు వాటిని అమలులలో కూడా కీలక బాధ్యత వహిస్తారు" అని కలెక్టర్ బాలాజీ అన్నారు. జర్నలిస్టుల బాధ్యతలను నొక్కి చెబుతూ, సహజ వ్యవసాయంలో విజయగాథలను ప్రాచుర్యం కల్పించడం ద్వారా సమాజంలోని ఇతర ప్రాంతాలలోని తోటి రైతులు ప్రేరేపితమవుతారని కలెక్టర్ అన్నారు.వార్తాలాప్ లో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (%ూూూ=ుజ%) చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ మీడియా నైతికతలను పాటించాలని సూచించారు. ప్రజలకు తనిఖీ చేసుకున్న వాస్తవాలను మాత్రమే అందజేయాలని కోరారు.పత్రికా స్వేచ్ఛ యొక్క చట్టపరమైన అంశాలపై, సహేతుకమైన ఆంక్షలు, పరువు నష్టం, దేశద్రోహం మరియు కోర్టు ధిక్కారంతో సహా పలు అంశాలను జిల్లా సీనియర్ సివిల్ జడ్జి , %ఱూూ% కార్యదర్శి కె.వి. రామకృష్ణయ్య వార్తాలాప్ లో జర్నలిస్టులకు వివరించారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందించడం, ఏవైనా చట్టపరమైన విషయాలను ఉచితంగా పరిష్కరించడంపై అవగాహన కల్పించాలని కూడా ఆయన జర్నలిస్టులను కోరారు. అదేవిధంగా, హిందూ లా కళాశాల ప్రిన్సిపాల్ %ఱూ=, ఎజీూ% రాయలు భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు కొత్త క్రిమినల్ చట్టాల గురించి వర్క్‌షాప్‌లో జర్నలిస్టులకు వివరించారు.పబ్లిక్ పీపుల్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (%ూ%4) పథకం మరియు సహజ వ్యవసాయాన్ని గ్రామీణ స్థాయికి తీసుకెళ్లాలని కృష్ణ జిల్లా సహకార మార్కెట్ సొసైటీ (%ఱజమీూ%) చైర్మన్ బండి రామకృష్ణ మీడియాను కోరారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## -అంగన్వాడీ కేంద్రాలలో పరిశుభ్రత పాటించాలి.

## - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై 11:సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శుక్రవారం బాలెంల పల్లె దవాఖాన ను తనిఖీ చేసి రికార్డు లను పరిశీలించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ హాస్పిటల్ లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని సూచించారు.వైద్య సిబ్బంది సమయ పాలన పాటిస్తూ ప్రజలకి అందుబాటులో ఉండాలని అన్నారు.

రక్త హీనతతో భాధపడుతున్న పేషెంట్స్ ఎంత మంది ఉన్నారు వాళ్ళ చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు.హాస్పిటల్ ఆవరణలోని వాటర్ ట్యాంక్ ని పరిశీలించి సాధ్యమైనంత త్వరగా క్లీన్ చేయాల్సిందిగా గ్రామ కార్యదర్శిని అదేశించారు. వ్యాధి నిరోధక టీకాలు వేసే రోజు పేషెంట్స్ వచ్చినపుడు కూర్చోడానికి కూడా వీలు ఉండట్లేదు అని డాక్టర్ చెప్పగా వెంటనే వెయిటింగ్ షెడ్ నిర్మించాలని గ్రామ కార్యదర్శిని అదేశించారు ఇట్టి నివేదికను రెండు రోజులలో ఇవ్వాలని ఆదేశించారు.

తదుపరి బాలెంల ప్రాధమిక పాఠశాల సందర్శించి సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించి నాలుగవ తరగతి క్లాస్ లోకి వెళ్లి సుశాంత్ అనే విద్యార్థిని ఇంగ్లీష్, అనుష్క అనే బాలికను తెలుగు చదివించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి తెలుగు, ఇంగ్లిష్ భాషలలో పట్టు సాధించాలన్నారు. టాయిలెట్స్ శుభ్రంగా ఉంచుకోవాలని నీరు నిల్వ లేకుండా చూడాలని,నీరు నిల్వ ఉండే గుంటలను మట్టి పోయించాలని పంచాయతీ సెక్రెటరీని ఆదేశించారు.తదుపరి అంగన్వాడి కేంద్రం సందర్శించి సెంటర్లో ఎంత మంది పిల్లలు ఉన్నారు వారికి అందుతున్న మెనూ వివరాలు తెలుసుకున్నారు. తదుపరి పిల్లల చేత పదాలు చదివించారు కలెక్టర్ మాట్లాడుతూ మోడల్ అంగన్వాడి కేంద్రంగా మార్చుటానికి ప్రతిపాదనలు పంపాలని టాయిలెట్స్ ఎత్తు పెంచుకోవాలని,వాటర్ ట్యాంక్ నిర్మాణం చేయవలసిందిగా ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారి మణిరత్నం, ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ నీరజలత, ఉపాధ్యాయులు రేణుక,ఎల్లమ్మ అంగన్వాడీ టీచర్ నాగమ్మ, పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసరాజు,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వనమహోత్సవాన్ని పురస్కరించుకుని బైంసా గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో మొక్కలు నాటిన మున్సిపల్ ప్రత్యేక అధికారి ఫైజాన్ అహ్మద్.



భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, జూలై 11: నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఫైజాన్ అహ్మద్, డి.వై.ఎస్.ఓ శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రకృతి సమతుల్యతను కాపాడాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు వనరక్షణ అత్యంత అవసరమని, ఈ తరానికే కాకుండా భవిష్యత్ తరాలకూ హరితవాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరు మొక్కల సంరక్షణకు కృషి చేయాలనీ కోరారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వమే కాదు, ప్రజలందరి బాధ్యతని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుండే పర్యావరణంపై అవగాహన పెంపొందించాలని, మొక్కల ప్రాముఖ్యతను తెలియజేస్తూ పచ్చదనం, పర్యావరణం పై బాధ్యతను అలవర్చే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు.ఈ కార్యక్రమంలో భైంసా మునిసిపల్ కమిషనర్ రాజేష్ కుమార్, అధికారులు, సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతీ పుత్రికకు ఆర్థిక సహాయం చేసిన చల్లా లక్ష్మీకాంత్



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై11:సూర్యాపేట జిల్లా కేంద్రము లోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో గుమస్తాగా పనిచేసిన జనార్ధన చారి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుమార్తె కన్నోజు సిరి చందన ప్రతిభా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతుంది. చదువుకు భారం కావడంతో జిల్లా ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్ ను సంప్రదించడముతో శుక్రవారం ఆయన కార్యాలయంలో రూ.5000/-ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా చల్లా లక్ష్మీకాంత్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడంలోనే ఆత్మసంతృప్తి కలుగుతుందని తెలుపుతూ, ఉన్నత చదువు లు చదివి వృద్ధి లోకి వచ్చిన తరువాత, తమ బాధ్యత గా కష్టం లో ఉన్న పేద వారికీ తమ వంతు సాయం చేయాలని కోరారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల తీర్మానం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకులు




సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై 11:బీసీలకు 42శాతం రిజర్వేషన్లను స్థానిక సంస్థల్లో కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, ఉండ్రుగొండ గిరిదుర్గం చైర్మన్ డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నిరూపితమైందన్నారు.గతంలో ఎన్నడు లేని విధంగా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందన్నారు.బీసీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, నిమ్మల శ్రీనివాస్,తండు శ్రీనివాస్ గౌడ్, జ్యోతి కరుణాకర్,నేరెళ్ల మధు,ఫారూఖ్, పిల్లల రమేష్ నాయుడు, యాట ఉపేందర్,యాట వెంకన్న,శ్రీధర్,ధర్మ తదితరులు పాల్గొన్నారు.

# పాత తాలుక కేంద్రం దోమకొండ నుండి హైదరాబాద్ కు బస్ సౌకర్యం కోసం కృషి చేయాలని కోరుతున్న మండల ప్రజలు,వ్యాపార వేత్తలు



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జులై 11: కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రం బస్టాండ్ నుంచి హైదరాబాద్ కు బస్సు సౌకర్యం లేక మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు మేడ్చల్ డిపో నుంచి దోమకొండ , బీబీపేట్ నుండి హైదరాబాద్ వరకు బస్సు సౌకర్యం ఉండేదని, ఎందుకు బంద్ అయిందో అయోమయ స్థితి లో ప్రజలున్నారు.

ప్రభుత్వాలు మారినా ప్రజలకు రవాణా సౌకర్యాలు కల్పించకపోవడంతో మండల ప్రజలు నాయకులు స్వార్థ ప్రయోజనాలకే పరిమితమయ్యారని ఆరోపిస్తున్నారు.గతంలో వేములవాడకు సిరిసిల్ల డిపో నుంచి బస్ సౌకర్యం ఉండడం వల్ల ప్రజలకు మంచి సౌకర్యం ఉండేది. అన్ని స్వార్థ పార్టీల రాజకీయ నాయకత్వ లోపం వల్ల బస్ సౌకర్యం లేకుండా పోయిందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మండల రాజకీయ నాయకులు ఆలోచించి దోమకొండ నుండి హైదరాబాద్ కు బస్ సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# పారదర్శకంగా లబ్దిదారులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయింపు: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

### చిరకాల కోరిక తీరినందున ఆనందం వ్యక్తం చేసిన లబ్ధిదారులు

### యాతాలకుంట, రేజర్ల, పినపాకలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయించిన జిల్లా కలెక్టర్





ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), జూలై 11:పారదర్శకంగా లబ్దిదారులకు కంప్యూటర్ ద్వారా ర్యాండమైజేషన్ పద్ధతిలో డబుల్ బెడ్ రూం ఇండ్లను కేటాయింపు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శుక్రవారం యాతాలకుంట, రేజర్ల, పినపాక లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మంత్రి ఆదేశాల ప్రకారం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు అలాట్ మెంట్ చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని అన్నారు. పైరవీలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా ఇండ్ల కేటాయింపు జరిగిందని అన్నారు.67 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు కంప్యూటర్ ర్యాండమైజేషన్ పద్ధతిలో పారదర్శకంగా కేటాయించామని అన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు పట్టాలను త్వరలో సత్తుపల్లి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో, మంత్రి చేతుల మీదుగా అందిస్తామని అన్నారు.సత్తుపల్లి నియోజకవర్గంలోని యాతాలకుంటలో 40, రేజర్లలో 20, పినపాకలో 7 మొత్తం 67 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను గ్రామసభ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు కంప్యూటర్ ర్యాండమైజేషన్ పద్ధతి ద్వారా ఇండ్లను కేటాయించామని అన్నారు. కంప్యూటర్ ర్యాండమైజేషన్ జాబితా గ్రామంలో ప్రదర్శిస్తామని, జిల్లా వెబ్ సైట్ లో కూడా పెట్టడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా యాతలకుంట లబ్ధిదారులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కలగా ఉన్న సొంత ఇంటిని జిల్లా కలెక్టర్ వచ్చిన నెల రోజులలోనే సాకారం చేసినందుకు చాలా సంతోషంగా ఉందని కలెక్టర్ కి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కల్లూరు ఆర్డిఓ ఎల్. రాజేందర్ గౌడ్, మూడు గ్రామాల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపైన బర్తడే పార్టీలు చేసుకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటాం: తిరుపతి జిల్లా పోలీస్



తిరుపతి జిల్లా ప్రతి నిధి, జూలై 11(భారత శక్తి ): జిల్లా ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్ రాజు ఐపిఎస్., గారు ఆదేశాలతో ప్రజలకు ఇబ్బందులు కల్గించే విధంగా రోడ్డు పై భర్తడేపార్టీలు చేసుకుని టపాసులు కాల్చడం లాంటవి చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవింద్ గారు అన్నారు.రెండు నెలల క్రితం అవిలాల లోని సేనప్పకాలనీలో నివాసముండే తులసి అను నతను సన్నిహితులతో కలిసి రోడ్డు మధ్యలో పార్టీ చేసుకోవడం తోపాటు టపాసులు కాల్చడం జరిగినది. అంతేకాకుండా తులసి అండ్ టీం విడియో తీసి ఇన్ స్టాగ్రామ్ లో పోస్టు పెట్టడం పెట్టినారు.ఈ నేపథ్యంలో రోడ్డు మీద పార్టీ చేసుకున్న వారి వివరాలు సైబర్ క్రైం పోలీసు సిబ్బంది సేకరించి తిరుపతి రూరల్ పోలీసు సిబ్బందికి ఇవ్వడం జరిగినది.సైబర్ క్రైం పోలీసు సిబ్బంది ఇచ్చిన సమాచారం లో ఏడుగురు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకోవడం జరిగినది.తిరుపతి రూరల్ పోలీసు వారు రోడ్డు మీద పార్టీ చేసుకున్న వారికి మొదటి తప్పిదంగా కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది.అంతే కాకుండా ఆ ఏడుగురి వివరాలతోపాటు, అడ్రసు, ఫోన్ నెంబర్లు, వారి ఫోటోలు తీసుకుని మరోసారి ఇలాంటి పునరావృతం అయితే చర్యలు తప్పవన్నారు.ప్రజలకు ఇబ్బందులు కల్గించే విధంగా రోడ్లు పైన , ఫ్లై ఓవర్ పైన భర్తడే పార్టీలు, బైక్ రేసులు, ఫోటో షూటింగ్ చేసిన వారిపై తిరుపతి జిల్లా పోలీసులు వారు సిరియస్ గా వ్యవహరిస్తున్నారు.రోడ్లు పై ప్రజలకు ఇబ్బందులు కల్గించే విధంగా సోషల్ మీడియా లో ఫోస్టులు పెట్టిన వారిపై తిరుపతి జిల్లా సైబర్ పోలీసు సిబ్బంది నిరంతరం వాచ్ చేస్తున్నారు.ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తూ..రోడ్ల మీద పార్టీలు చేసుకుంటున్న వారి కుటుంబ సభ్యులకు తిరుపతి జిల్లా పోలీసు వారు విజ్ఞప్తి చేయడమైనది.మీ పిల్లలు వల్లన రోడ్డు మీద వెళుతున్న వాహనచోదకులు, ప్రజలు తీవ్రమైన అంతరాయం కల్గుతుందని గమనించాలి.మీ పిల్లలు ఉదయం నుండి రాత్రి వరకు ఎం చేస్తున్నారో ఎక్కడకు వెళ్ళుతున్నారో గమనించవలసినదిగా తెలియజేయడమైనది.మరోసారి రోడ్డు మీద పార్టీలు పేరుతో ప్రజలకు, వాహనచోదకులకు ఇబ్బంది కల్గించే పని పని చేస్తే అలాంటి వారిపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించడమైనది.

# పార్కు స్థలం సమస్యను తొందరగా పరిష్కరించి పార్కును అభివృద్ధి చేయాలి:కార్పొరేటర్ సుజాత నాయక్



ఎల్ బి నగర్, భారత శక్తి ప్రతినిధి, %jul:హస్తినాపురం నార్త్ ఎక్స్టెన్షన్ కాలనీలో పార్కు స్థలం సుమారు 8,500 గజాలు కోర్టు పరిధిలో ఉన్నందున తక్షణమే జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదులతో మాట్లాడి సమస్యను తొందరగా పరిష్కరించి పార్కును అభివృద్ధి చేయాలని క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ ఎల్బీనగర్ ఇంచార్జ్ మధు యాష్ కి గౌడ్ ఆదేశానుసారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కలిసి విన్నవించినట్లు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్ తెలిపారు .శుక్రవారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ ను కలిసి సమస్యను వివరించినట్లు తెలిపారు. అదేవిధంగా రాబోయే బోనాలు, వినాయక చవితి పండుగలను వివిధ కాలనీ ల పరిధిలో ఉన్న దేవాలయాల లో కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు నిధులు మంజూరు చేసి ఆయా కాలనీలో రోడ్లు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ వెంటనే సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్పొరేటర్ గారితో పాటు జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి కాప్రా కార్పొరేటర్ వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఆసియా కప్ 2025.. అక్కడి మీటింగ్‌కు మేం హాజరవ్వం: బీసీసీఐ, శ్రీలంక బోర్డు




బంగ్లాదేశ్‌తో భారత్ వన్డే, టీ20 సిరీస్‌లను బీసీసీఐ వాయిదా వేసిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ షెడ్యూల్ కఠినంగా ఉండటంతోనే వాయిదా వేసినట్లు పేర్కొంది. కానీ, బంగ్లాలో రాజకీయ అనిశ్చితి కారణంగా ఆటగాళ్ల భద్రత కోసమే ఈ నిర్ణయం తీసుకుంది. తాజాగా ఆసియా కప్ 2025 నిర్వహణ పైనా అనుమానాలు వస్తున్నాయి. ఈనెల చివరి వారంలో ఆసియా క్రికెట్ కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఇందుకు వేదిక బంగ్లాదేశ్ రాజధాని ఢాకా. ఇప్పుడు ఇదే ప్రధాన సమస్యగా మారింది. ఇక్కడ జరగబోయే ఏసీసీ మీటింగ్‌కు తాము హాజరుకావడం లేదని ఇప్పటికే భారత్, శ్రీలంక దేశాలు సమాచారం ఇచ్చాయని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, షెడ్యూల్ ప్రకారం ఏసీసీ మీటింగ్ మాత్రం జరుగుతుందని పాక్ క్రికెట్ బోర్డు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు.

“ఇంకా రెండు వారాల సమయం ఉంది. అన్ని సభ్య దేశాలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఎవరైనా ఢాకాకు రాకూడదని భావిస్తే.. వారు ఆన్‌లైన్ వేదికగా పాల్గొనే అవకాశం ఉంది. మీటింగ్ మాత్రం తప్పకుండా ఢాకాలోనే జరుగుతుంది. జులై 20 - 24 మధ్య బంగ్లా - పాక్ జట్ల మధ్య మూడు టీ20ల సిరీస్ జరగనుంది. కాబట్టి, ఏసీసీ మీటింగ్ కూడా ఇక్కడ నిర్వహించనుండటం సముచితం. ఇప్పటివరకు ఒక్క సమావేశం కూడా ఢాకాలో జరగలేదు” అని పాక్ బోర్డు ప్రతినిధి పేర్కొన్నారు.

భారత్‌వే ఆతిథ్య హక్కులు

షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్లో ఆసియా కప్ జరగాలి. ఈ టోర్నీ నిర్వహించే హక్కులు భారత్‌వే. అయితే, టోర్నీని వేరే చోటుకు మార్చాలని ఏసీసీని బీసీసీఐ అడిగే అవకాశం ఉందని సమాచారం. భారత్‌లోకి పాకిస్థాన్ జట్టుకు అనుమతి ఇవ్వడం కష్టమే. గత ఛాంపియన్ ట్రోఫీ నుంచి ఒప్పందం అమలవుతోంది. అప్పుడు కూడా పాక్ అతిథ్యంలో టోర్నీ జరిగినప్పటికీ.. భారత్ ఆడే మ్యాచులను దుబాయ్‌లో నిర్వహించిన సంగతి తెలిసిందే. మరోవైపు అసలు టోర్నీని నిర్వహించేందుకు సిద్ధమేనా? అని బీసీసీఐని ఏసీసీ అడిగినట్లూ వార్తలు వస్తున్నాయి. టోర్నీ నుంచి తాము వైదొలగడం లేదని ఇప్పటికే బీసీసీఐ స్పష్టత ఇచ్చింది. అయితే, పోటీలను భారత్‌లో కాకుండా యూఏఈ వేదికగా నిర్వహించేందుకూ బీసీసీఐ సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం

# మనం హాలీడేకు రాలేదు.. దేశం కోసం ఆడేందుకు వచ్చాం: గౌతమ్ గంభీర్

గత ఆసీస్ పర్యటనలో టీమ్ఇండియా ఘోర పరాభవం చూవిచూసింది. దీంతో ఆటగాళ్లతోపాటు సిబ్బంది విషయంలో బీసీసీఐ కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. వీటిపై కోహ్లీ వంటి సీనియర్ కాస్త అసహనం వ్యక్తంచేశాడు. కుటుంబసభ్యులతో కాకుండా జట్టుతోనే ప్రయాణం చేయాల్సి ఉండటం అందులో ముఖ్యమైంది. విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఎక్కువ సమయం కుటుంబానికి కాకుండా ఆటకే కేటాయించాలని బీసీసీఐ స్పష్టం చేసింది. ప్రస్తుతం టీమ్ఇండియా ఇంగ్లాండ్ పర్యటనలో ఉంది. దీనికి ముందు తన తల్లి అనారోగ్యం దృష్ట్యా గంభీర్ (%+ఘఝఎ +ఘఎఎస్త్రఱతీ%) కూడా స్వదేశానికి వచ్చి మళ్లీ వెంటనే ఇంగ్లాండ్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. ఈసందర్భంగా భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ బీసీసీఐ నిబంధనలపై కీలక వ్యాఖ్యలు చేశాడు. ఛతేశ్వర్ పుజారాతో ముఖాముఖిలో గంభీర్ తన అభిప్రాయాలను వెల్లడించాడు.“ప్రతిఒక్కరికీ కుటుంబాలు చాలా ముఖ్యమే. ఇక్కడ ఓ విషయం అర్థం చేసుకోవాలి. మనం ఇక్కడికి వచ్చిన కారణం వేరు. ఇదేమీ హాలీడే కాదు. ఏదైనా పర్యటనకు వెళ్లినప్పుడు డ్రెస్సింగ్ రూమ్‌లో చాలా తక్కువమందితో ఉండాల్సి.

# భారీ లాభాల్లో సూచీలు.. మదుపర్ల సంపద 7 లక్షల కోట్లు జంప్

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ) భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు పరుగులు పెట్టాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థకు సంబంధించి వెలువడిన ద్రవ్యోల్బణ గణాంకాలు మాంద్యం భయాలను పారదోలింది. ఇది ప్రపంచ మార్కెట్లలో పాజిటివ్ సంకేతానికి కారణమైంది. దీంతో ఇంట్రాడేలో సెన్సెక్స్ దాదాపు 1400 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ మళ్లీ 24,500 ఎగువన స్థిరపడింది. ఒక్క సెషన్‌లో మదుపర్ల సంపద రూ.7 లక్షల కోట్ల మేర పెరిగింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.444.3 లక్షల కోట్ల నుంచి రూ.451 లక్షల కోట్లకు చేరింది.

గూగుల్ స్టోరేజీ నిండిపోయిందా.. ఇవి ట్రై చేయండి..



సెన్సెక్స్ ఉదయం 79,754.85 పాయింట్ల (క్రితం ముగింపు 79,105.88) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల జోరు కొనసాగింది. దీంతో ఇంట్రాడేలో 80,518.21 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1331 పాయింట్ల లాభంతో 80,436.84 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 397 పాయింట్ల లాభంతో 24,541 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.80 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. సన్‌ఫార్మా ఒక్కటే స్వల్పంగా నష్టపోవడం గమనార్హం. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 79.78 వద్ద, బంగారం ఔన్సు 2,502 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

ఇవీ కారణాలు..

జులై నెలకు సంబంధించి వెలువడిన అమెరికా వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 3 శాతం లోపే నమోదు కావడం గమనార్హం. 2021 తర్వాత ఈ స్థాయికి రావడం ఇదే తొలిసారి. దీంతో యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు బలపడ్డాయి.

గురువారం అమెరికా మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. దీంతో ప్రపంచ మార్కెట్లతో పాటు మన మార్కెట్ సూచీలూ లాభాల్లో పయనించాయి. ముఖ్యంగా మన ఐటీ స్టాక్స్ రాణించాయి.

సెన్సెక్స్, నిఫ్టీ ఇటీవల నష్టాలు ఎదుర్కొన్నాయి. ఆగస్టు నెలలో 2.5 శాతం దాకా నష్టపోయాయి. దీంతో కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు దిగడం సూచీలకు కలిసొచ్చిందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



# హైదరాబాద్‌లో 25 గృహ ప్రాజెక్టులు నిలిచిపోయాయ్

దిల్లీ: హైదరాబాద్‌లో 25 గృహ నిర్మాణ (హౌసింగ్) ప్రాజెక్టుల (6,169 ఫ్లాట్లు/ఇళ్లు) పనులు మధ్యలో నిలిచిపోయాయని డేటా అనలిటిక్ సంస్థ ప్రాప్ఈక్విటీ తెలిపింది. దేశంలోని 42 నగరాల్లో ఇలాంటివి 1,981 గృహ ప్రాజెక్టులు (5.08 లక్షల ఇళ్లు/ఫ్లాట్లు) ఇలానే ఆగిపోయాయని వెల్లడించింది. డెవలపర్ల ఆర్థిక నిర్వహణ సరిగా లేకపోవడం, ప్రాజెక్టుల అమలు సామర్థ్యాలు వారికి లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని పేర్కొంది. ఆగిపోయిన వాటిలో 1,636 ప్రాజెక్టులు (4,31,946 ఇళ్లు/ఫ్లాట్లు) 14 ప్రథమ శ్రేణి నగరాల్లోనే ఉన్నాయని తెలిపింది. మిగిలిన 345 ప్రాజెక్టులు (76,256 యూనిట్లు) 28 ద్వితీయ శ్రేణి నగరాల్లో ఉన్నాయని వెల్లడించింది. 2018లో 4,65,555 ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోగా, తాజాగా ఈ సంఖ్య 5,08,202కు పెరిగినట్లు వివరించింది. 'డెవలపర్ల ప్రాజెక్టుల అమలు సామర్థ్యాల లేమి, నగదు నిర్వహణ సరిగా లేకపోవడం, కొనుగోలుదార్ల వద్ద తీసుకున్న డబ్బులను కొత్త భూములు (ల్యాండ్ బ్యాంక్) కొనుగోలు చేసేందుకు దారి మళ్లించడం, తమకున్న ఇతర రుణాలు చెల్లించడం వంటి కారణాలతో చాలా ప్రాజెక్టులు ఆగిపోయాయి. గృహ కొనుగోలుదార్లు ఇబ్బందులు పడకుండా ఉండాలంటే, డెవలపర్ల సామర్థ్యాలను అంచనా వేసి, సరైన నిర్ణయం తీసుకునేందుకు స్వతంత్ర థర్డ్ పార్టీ ఆడిట్ సేవలు అందించాల్సిన అవసరం ఉంద'ని ప్రాప్ఈక్విటీ వ్యవస్థాపకులు, సీఈఓ సమీర్ జసుజా వెల్లడించారు. నిలిచిపోయిన ప్రాజెక్టుల సమస్యలను పరిష్కరించేందుకు 2019 నవంబరులో ప్రభుత్వం స్వామిహ్ (స్పెషల్ విండో ఫర్ అఫర్డబుల్ అండ్ మిడ్-ఇన్‌కమ్ హౌసింగ్) నిధిని ప్రారంభించింది. గత 5 ఏళ్లలో దీని కింద 32,000 ఇళ్లు/ఫ్లాట్లు పూర్తయ్యాయి. వచ్చే మూడేళ్లలో ప్రతి ఏడాది 20,000 గృహాలను పూర్తి చేయాలనేది లక్ష్యం.

టైర్-1 నగరాల్లో గ్రేటర్ నోయిడా 74,645 యూనిట్లు నిలిచిపోయి, ఈ జాబితాలో తొలి స్థానంలో ఉండగా, టైర్-2 నగరాల్లో భివండీ 13,393 నిలిచిపోయిన యూనిట్లతో ప్రథమ స్థానంలో ఉంది.

# 2027 నాటికి భారత్ మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్: గీతా గోపీనాథ్

: భారత్ ఆర్థికంగా అంచనాలకు మించి అభివృద్ధి చెందుతోందని అంతర్జాతీయ ద్రవ్యనిధి ఫస్ట్ డిప్యూటీ ఎండీ గీతా గోపీనాథ్ అభిప్రాయపడ్డారు. ఆమె తాజాగా ఆంగ్లపత్రిక ఇండియాటుడేకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ వృద్ధి వేగానికి వేర్వేరు కారణాలున్నాయన్నారు. 2027 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ఆమె అంచనా వేశారు.



"గత ఆర్థిక సంవత్సరంలో అంచనాల కంటే మెరుగైన వృద్ధి రేటును భారత్ నమోదు చేసింది. దానిని కొనసాగించేందుకు తీసుకొనే చర్యలు ఈ ఏడాది మా అంచనాలను ప్రభావితం చేస్తాయి. దీంతోపాటు దేశంలో ప్రైవేటు వ్యయాలు కూడా బాగా పుంజుకొన్నట్లు మేం గమనించాం" అని గీతా వెల్లడించారు.

"గతేడాది ప్రైవేటు వ్యయాల వృద్ధి 4 శాతం మాత్రమే ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యయాలు కోలుకొని పెరిగేకొద్దీ ఇది కూడా వృద్ధి చెందుతుంది. ద్విచక్ర వాహనాల విక్రయాలు, ఎఫ్ఎంసీజీ విక్రయాలు బాగా పుంజుకొన్నాయి. దీనికి వర్షాలు కూడా తోడవటంతో మంచి పంట ఉత్పత్తి సాధ్యమవుతుంది. ఫలితంగా వ్యవసాయ ఆదాయం పెరిగి గ్రామీణ వినిమయం పుంజుకొంటుంది. మా అంచనాలకు మూలాలు ఇవే" అని ఐఎంఎఫ్ డిప్యూటీ డైరెక్టర్ వెల్లడించారు.

భారత్‌లో ఎఫ్ఎంసీజీ, ద్విచక్ర వాహన విక్రయాలు, అనుకూలమైన వర్షాల డేటా ఆధారంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఐఎంఎఫ్ భారత వృద్ధిరేటు అంచనాలను 7శాతానికి పెంచింది. ఈ ఏడాది ఆర్థిక సర్వేలో ప్రభుత్వం ఇచ్చిన 6.5 శాతం కంటే ఇది అధికం కావడం గమనార్హం.

# చైనా ఆర్థిక రికవరీ

బీజింగ్: స్థిరాస్తి సంక్షోభం కొనసాగడానికి తోడు, వినియోగం బలహీనంగా ఉన్నందున.. చైనా ఆర్థిక వ్యవస్థ రికవరీ జులైలో మందగించింది. గురువారం విడుదలైన అధికారిక గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ఫిబ్రవరి తర్వాత తొలిసారిగా నిరుద్యోగ రేటు 5.2 శాతానికి పెరిగింది. జూన్‌లో ఇది 5 శాతంగానే ఉంది. పారిశ్రామిక ఉత్పత్తిలో వృద్ధి అంతక్రితంతో పోలిస్తే మరింత మందగించింది. జూన్‌లో 5.3% నమోదు కాగా.. జులైలో 5.1 శాతానికి పరిమితమైంది. రిటైల్ విక్రయాలు మాత్రం జూన్ నాటి 2% వృద్ధితో పోలిస్తే 2.7% పెరగడం కొంత ఊరటనిచ్చే అంశం. ఇటీవలి ప్రభుత్వ విధానాల కారణంగా వినియోగ రికవరీ మరింత స్థిరీకరణకు గురికావొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. గత నెలలో 150 బిలియన్ యువాన్ల (20.9 బి. డాలర్ల) మేర ప్రభుత్వం ఉద్దీపన ప్రకటించిన సంగతి తెలిసిందే.



అంతా ఇక్కడ మొదలైంది..: డెవలపర్లు అధిక రుణాలు చేయడం కాస్తా ఒక గొలుసుకట్టు చర్యలాగా మారి గృహ విక్రయాలు, ధరలు క్షీణించి స్థిరాస్తి మార్కెట్‌లో సంక్షోభాన్ని సృష్టించాయి. ఇది ఆర్థిక వ్యవస్థలోని పలు అంశాలపై ప్రభావం చూపుతోంది. చైనాకు బలమైన వృద్ధి చోదకంగా ఉండే ఎగుమతులు కాస్తా అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలతో సంఘర్షణల కారణంగా తగ్గిపోయాయి. స్థిరాస్తి పెట్టుబడులూ జనవరి-జులైలో 10.2% తగ్గాయి. జనవరి-జూన్‌లో 10.1% తగ్గాయి.

# భారీ లాభాల్లో మార్కెట్ సూచీలు ప్రారంభం




అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలతో నేడు దేశీయ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఉదయం 9.24 సమయంలో నిఫ్టీ 242 పాయింట్ల లాభంతో 24,386, సెన్సెక్స్ 805 పాయింట్ల లాభంతో 79,910 వద్ద ట్రేడవుతున్నాయి. ఎన్ఎస్ఈలో హిందాల్కో, మహీంద్రా అండ్ మహీంద్రా, ఓఎన్‌జీసీ, టెక్ మహీంద్రా, టాటామోటార్స్ లాభాల్లో ఉండగా.. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, డాక్టర్ రెడ్డీస్ లేబోరేటరీ, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, సన్‌ఫార్మా, హీరోమోటోకార్ప్ నష్టాల్లో కొనసాగుతున్నాయి.

అమెరికాలో సీపీఐ డేటా ప్రకారం ఫెడ్ నిర్దేశిత నిర్దేశిత 2శాతం వద్దకు ద్రవ్యోల్బణం చేరుకోవచ్చనే అంచనాలు ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని పెంచాయి. ఇక బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ రికవరీని కొనసాగిస్తోంది. గతేడాది మాంద్యం బారినపడిన ఈ దేశం ఏప్రిల్-జూన్‌లో 0.6% వృద్ధిని నమోదు చేసినట్లు గురువారం అధికారిక గణాంకాలు వెల్లడించాయి. జనవరి-మార్చిలో 0.7% వృద్ధి చెందిన ఈ దేశం, రెండో త్రైమాసికంలోనూ వృద్ధిని కొనసాగించడం కొత్తగా కొలువుతీరిన బ్రిటన్ ప్రభుత్వానికి మద్దతు పలికే అంశమే.

# వంటనూనెల దిగుమతులు 1.6% తగ్గాయ్

దిల్లీ: భారత వంట నూనెల దిగుమతులు కాస్త తగ్గాయి. అక్టోబరుతో ముగిసే 2023-24 మార్కెటింగ్ సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో 1.6% మేర తగ్గి 119.35 లక్షల టన్నులుగా నమోదయ్యాయి. ఏడాది క్రితం ఇవి 121.22 లక్షల టన్నులుగా ఉన్నాయి. సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈఏ) గణాంకాల ప్రకారం.. వంటకు ఉపయోగించని నూనెల దిగుమతులు మాత్రం 1,32,242 టన్నుల నుంచి 1,88,955 టన్నులకు పెరిగాయి. మొత్తం వెజిటబుల్ నూనెల దిగుమతులు(వంటకు ఉపయోగించే, ఉపయోగించని నూనెలు) తొలి తొమ్మిది నెలల్లో 121.24 లక్షల టన్నులుగా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే సమయంలోని 122.55 లక్షల టన్నులతో పోలిస్తే ఇవి 1 శాతం తక్కువ. 2023-24 నూనెల సంవత్సరం తొలి 9 నెలల్లో (2023 నవంబరు -2024 జులైలో) మనదేశం 15,18,671 టన్నుల మేర శుద్ధి చేసిన నూనెను దిగుమతి చేసుకుంది. క్రితం ఏడాది ఇదే సమయంలోని



16,40,960 టన్నుల దిగుమతితో పోలిస్తే ఇవి 7% తక్కువ. ముడి వంటనూనెల దిగుమతులు సైతం 1,04,81,751 టన్నుల నుంచి 1,04,16,556 టన్నులకు తగ్గాయి. పామాయిల్ దిగుమతులు కూడా 4% తగ్గి 68,45,097 టన్నులకు చేరాయి.

ఏ దేశాల నుంచి ఏ దిగుమతి..: ఇండొనేషియా, మలేషియాలు మనకు ఆర్‌బీడీ పామోలిన్, ముడి పామాయిల్(సీపీఓ) సరఫరా చేసే ప్రధాన దేశాలు. ముడి సోయాబీన్ నూనెను అర్జెంటీనా, బ్రెజిల్ నుంచిబీ ముడి పొద్దుతిరుగుడు పువ్వు నూనెను రష్యా, రొమేనియా, ఉక్రెయిన్, అర్జెంటీనా నుంచి తెప్పించుకుంటాం.

# పెళ్లి అంటేనే భయమేస్తోంది: శ్రుతి హాసన్

తన వ్యక్తిగత విషయాల గురించి ఎప్పుడూ అభిమానులతో పంచుకుంటుంటారు నటి శ్రుతి హాసన్ మరికొన్ని రోజుల్లో 'కూలీ'తో పలకరించనున్న ఆమె.. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు వెల్లడించారు. రజనీకాంత్‌తో కలిసి వర్క్ చేసిన అనుభవంతో పాటు తన కెరీర్ గురించి మాట్లాడారు. పెళ్లిపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. వివాహం అనే ఆలోచన కూడా తనకు భయాన్ని కలిగిస్తుందన్నారు. శ్రుతి పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే..



అది జీవితకాలపు బాధ్యత..

''నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడానికి జీవితమంతా కష్టపడ్డాను. ఆ గుర్తింపును ఓ కాగితం ముక్కతో ముడి పెట్టాలనే ఆలోచన కూడా భయంకరంగా అనిపిస్తుంటుంది. వివాహ బంధాన్ని.. ఆ వ్యవస్థలో ఉన్న విలువలను నేను గౌరవిస్తాను. కానీ, వాటిని ధ్రువీకరించడానికి ఓ చట్టపరమైన కాగితం అవసరం లేదని నా అభిప్రాయం. నా జీవితంలో ఒకసారి నేను వివాహానికి చాలా దగ్గరగా వెళ్లాను. కానీ, అది ముడి పడలేదు. ఇద్దరు మనుషులు ఒక్కటవ్వాలంటే వారి అభిప్రాయాలు కలవాలి. అయినా, పెళ్లి అనేది ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన విషయం కాదు. అది జీవితకాలపు బాధ్యత''

తొలి విజయాన్ని ఇచ్చిన టాలీవుడ్..

''పవన్ కల్యాణ్ హీరోగా వచ్చిన 'గబ్బర్ సింగ్'లో అవకాశం వచ్చినప్పుడు కొన్ని కారణాల వల్ల నేను నటించలేనని చెప్పాను. హరీశ్ శంకర్ నన్ను ఒప్పించారు. ఆ పాత్రలో నన్ను కాకుండా మరో నటిని ఊహించుకోలేనన్నారు. కానీ, ఆ సినిమా నా కెరీర్ మొత్తాన్ని మార్చేసింది. నేను నటించిన ఎన్నో సినిమాలు మంచి సక్సెస్‌ను సాధించినప్పటికీ తొలి విజయాన్ని ఇచ్చింది మాత్రం తెలుగు పరిశ్రమే. పవన్ ఎప్పుడూ వ్యవసాయం గురించి, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారి గురించే మాట్లాడుతుండేవారు. ఆయనకు రాజకీయ రంగం కూడా సరిపోతుంది''

ఒకరితో ఒకరిని పోల్చలేం..

''మా నాన్న రజనీకాంత్ ఇద్దరూ తమిళ ఇండస్ట్రీకి రెండు కళ్ల లాంటి వాళ్లు. రజనీకాంత్ సూపర్ స్టార్. ఇన్ని రోజులు మా నాన్న దృష్టికోణంలోనే ఆయన నాకు తెలుసు. 'కూలీ' సినిమాలో ఆయనతో వర్క్ చేస్తున్నప్పుడు పూర్తిగా తెలుసుకున్నాను. సెట్‌లో ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. తన చుట్టూ ఉండేవాళ్లు కూడా సంతోషంగా ఉండాలని కోరుకుంటారు. ఆయన ఎనర్జీకి ఎవరూ సరితూగరు. ఆయనతో కలిసి నటించే అవకాశం వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇండస్ట్రీలో ఎంతోమంది గొప్ప నటులు ఉన్నారు. ఎవరి ప్రత్యేకతలు వారికి ఉంటాయి. అమితాబ్ బచ్చన్ (%ూఎఙుఎష్ట దీుఎష్టఎష్టుఅ%), కమల్ హాసన్, రజనీకాంత్.. వీరందరినీ ఒకరితో ఒకరిని పోల్చలేం'' అని శ్రుతి వివరించారు.

# శ్రీశ్రీ రవిశంకర్ బయోపిక్.. విక్రాంత్ మాస్సే ఏమన్నారంటే

ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్ బయోపిక్ 'వైట్' పేరుతో రానున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ నటుడు విక్రాంత్ మాస్సే ఇందులో ప్రధాన పాత్రలో నటించనున్నారు. ఆగస్టులో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ బయోపిక్‌లో నటించడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు విక్రాంత్ మాస్సే చెప్పారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రం గురించి విక్రాంత్ మాట్లాడారు.



''ఇంత గొప్ప బయోపిక్‌లో నటించే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉంది. ఆగస్టులో 'వైట్' సెట్స్ పైకి వెళ్తుంది. ఈ సినిమా కథాంశం విషయానికొస్తే.. రవిశంకర్ నిజ జీవితానికి సంబంధించిన అంశాలతో పాటు కొలంబియాలో సుదీర్ఘంగా సాగిన అంతర్యుద్ధాన్ని ముగించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఆ అంశాలను కూడా ఇందులో చూపించనున్నాం. ప్రపంచ శాంతి కోసం ఆయన ఎంతో కృషి చేశారు. దురదృష్టవశాత్తూ కొందరికి ఆయన చేసిన కృషి తెలియదు. 'వైట్'తో మేం దాన్ని ప్రపంచానికి చాటిచెబుతాం. ఆయన పాత్ర పోషించడం నాకు దక్కిన గౌరవం. నేను ఎప్పటికీ ఆయనలా ఉండలేను. ఆ ప్రయత్నం మాత్రమే చేయగలను. నిజాయితీగా నా ప్రయత్నం చేస్తున్నాను'' అని విక్రాంత్ మాస్సే చెప్పారు.

ఇక వరుస సినిమాలు అంగీకరించినప్పటికీ విక్రాంత్ మాస్సే ఇటీవల కొన్ని రోజులు విరామం తీసుకుంటున్నట్లు ప్రకటించారు. దీనిపై ఆయన విమర్శలు ఎదుర్కొన్నారు. పబ్లిసిటీ కోసమే ఇలా చేశారని కొందరు ట్రోల్ చేశారు. దీనిపై ఆయన స్పందించారు. సోషల్ మీడియాలో వచ్చిన ప్రతి పోస్ట్‌ను చూశానని చెప్పారు. అలాంటివాటి గురించి పట్టించుకోనని అన్నారు.

# 'రామాయణ'.. హనుమంతుడి పాత్ర 15 నిమిషాలే

బాలీవుడ్ డైరెక్టర్ నితీశ్ తివారి రామాయణాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకుతీసుకురానున్న విషయం తెలిసిందే. 'రామాయణ' పేరుతో ప్రతిష్ఠాత్మకంగా ఇది రూపొందుతోంది. ఇటీవల ఇందులోని పాత్రలను పరిచయం చేస్తూ వీడియోను విడుదల చేయగా దానికి మంచి ఆదరణ లభించింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



ఇందులో హనుమంతుడి పాత్రలో బాలీవుడ్ నటుడు సన్నీ దేవోల్ ( కనిపించనున్నట్లు టీమ్ అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. రెండు పార్ట్‌లుగా రానున్న ఈ సినిమా మొదటిభాగంలో ఆయన పాత్ర నిడివి చాలా తక్కువగా ఉండనున్నట్లు సమాచారం. 15 నిమిషాలు మాత్రమే కనిపిస్తారట. రెండో భాగంలో ఆయన పాత్రే కీలకం కానున్నట్లు తెలుస్తోంది. పార్ట్ 2లో ఎక్కువసేపు కనిపించనున్నారట. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ ఈ వార్త మాత్రం సోషల్ మీడియాలో షేర్ అవుతోంది.

ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ ( సీతగా సాయి పల్లవి (%ూఖఅ ్రాఖశ్రీశ్రీఖజఅ%), రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. జటాయువు పాత్రకు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అమితాబ్ బచ్చన్ వాయిస్ ఓవర్ ఇవ్వనున్నట్లు సమాచారం. శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమా మొదటిభాగం వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకురానుంది. రెండో భాగం 2027లో విడుదల కానుంది.


# ఆ మాటతో తొమ్మిది సినిమాల నుంచి తీసేశారు

'పరిణీత' సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన విద్యాబాలన్ తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. సిల్క్‌స్మిత జీవితకథ ఆధారంగా రూపొందిన 'ది డర్టీ పిక్చర్' సినిమాతో ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. మహిళా ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకొంటూనే మంచి గుర్తింపు సాధించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన సినీ కెరీర్ ప్రారంభంలో ఎదురైన చేదు అనుభవాల్ని పంచుకున్నారు. బాలీవుడ్ ప్రయాణానికి ముందే దక్షిణాదిలోని ఓ సినిమా మధ్యలో ఆగిపోవడం వల్ల తొమ్మిది చిత్రాల నుంచి ఆమెను తీసేశారని, అంతేకాదు ఆమెపై ఐరెన్‌లెగ్ అనే ముద్ర పడిందన్నారు.




''మలయాళ అగ్రకథానాయకుడు మోహన్‌లాల్‌తో కలిసి 'చక్రం' అనే సినిమాలో నటించే అవకాశం వచ్చింది. ఆ సినిమా గురించి వార్తలు దక్షిణాది నుంచి ఉత్తరాది సినీపరిశ్రమలకు వ్యాపించాయి. దాంతో పలు చిత్రాల్లో నటించే అవకాశాలు వచ్చాయి. కానీ అనూహ్యంగా 'చక్రం' మధ్యలోనే ఆగిపోయింది. దీంతో ఆ సినిమా ఆగిపోవడానికి నేనే కారణమంటూ ప్రచారం జరిగింది. దాంతో ఇండస్ట్రీలో నన్ను 'ఐరెన్ లెగ్' అన్నారు. ఆ వెంటనే నేను ఒప్పుకున్న తొమ్మిది ప్రాజెక్ట్‌ల నుంచి నన్ను తొలగించారు. నిజానికి ఆ సినిమా ఆగిపోవడానికి కారణం నేను కాదు. మోహన్‌లాల్‌కు, ఆ చిత్ర దర్శకుడితో అభిప్రాయ భేదాల వల్ల అది ఆగిపోయింద''ని తెలిపారు.

ఆ ప్రభావం తన కెరీర్‌పై పడిందన్నారు విద్య. అంతేకాదు తనపై తనకున్న నమ్మకమే ఈ రోజు తనను ఈ స్థాయిలో ఉంచిదన్నారు. ప్రారంభంలో అమితాబ్ బచ్చన్, టబు లాంటి నటీనటులు కూడా తిరస్కరణలకు గురయ్యారని అలా వాళ్లని గుర్తుచేసుకుని కెరీర్‌లో ముందుకుసాగినట్లు తెలిపారు.




# 'ఉదయ్‌పుర్ ఫైల్స్' రిలీజ్‌పై స్టే.. సుప్రీంను ఆశ్రయిస్తామన్న దర్శకుడు

'ఉదయ్‌పుర్ ఫైల్స్' విడుదలపై ఒక్కరోజు ముందు స్టే విధించడం ఊహించలేదని ఆ చిత్ర దర్శకుడు ఎస్.భరత్ అన్నారు. ఈ మేరకు సుప్రీం కోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. ''మా సినిమాని నిలిపివేయాలంటూ సుప్రీం కోర్టులో ఓ పిటిషన్ దాఖలు కాగా అది తిరస్కరణకు గురైంది. దిల్లీ హైకోర్టు మాత్రం స్టే ఇచ్చింది. అలా ఎలా జరిగిందో నాకు తెలియదు. దీనిపై మేం సుప్రీం కోర్టును ఆశ్రయిస్తాం'' అని అన్నారు.

2022లో ఉదయ్‌పుర్‌లో జరిగిన దర్జీ కన్హయ్యలాల్ హత్య, తదనంతర పరిణామాల నేపథ్యంతో రూపొందిన సినిమా ఇది. కన్హయ్య పాత్రలో విజయ్ రాజ్ నటించారు. రజనీష్ దుగ్గల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ట్రైలర్ విడుదలైన నాటి నుంచి ఈ సినిమాపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ చిత్రాన్ని బ్యాన్ చేయాలంటూ పలు రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ సినిమా విడుదలైతే మత సామరస్యం దెబ్బతినే అవకాశం ఉందంటూ దిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కొన్ని మార్పులు, చేర్పులతో.. సెన్సార్ కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. ఈ సినిమా శుక్రవారం విడుదల కావాల్సి ఉంది.

# అణుబాంబు కన్నా ప్రమాదకరమైనది కాపీయింగ్

''విద్యను జాతీయం చేయడంతో పాటు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని చెప్పే చిత్రమే 'యూనివర్సిటీ (పేపర్ లీక్)' అంటున్నారు ఆర్.నారాయణమూర్తి. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా సరికొత్తగా ఆగస్టు 22న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. గోరటి వెంకన్న, అద్దంకి దయాకర్, దేశపతి శ్రీనివాస్, అందెశ్రీ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ.. ''గత కొన్నేళ్లుగా మన విద్యారంగంలో జరుగుతున్న పేపర్ లీకులు.. గ్రూపు 1-2 లాంటి ఉద్యోగ పరీక్షల ప్రశ్నా పత్రాల లీకులు చూస్తుంటే చదువులకు ఏమైందనిపిస్తోంది. ఇదిలా కొనసాగితే విద్యార్థుల భవిష్యత్ ఏం కావాలి. నిరుద్యోగుల జీవితాలు ఏమైపోవాలి. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై అమెరికా వేసిన అణుబాంబు కన్నా చాలా ప్రమాదకరమైనది కాపీయింగ్. చూసి రాసిన వాళ్లు డాక్టర్లయితే రోగులు బతుకుతారా.. ఇంజినీర్లయితే వాళ్లు కట్టిన భవనాలు, వంతెనలు నిలబడతాయా? అందుకే ఇలాంటి దారుణాలు జరగకూడదంటే ప్రశ్నా పత్రాలు లీకుల మయం కాకూడదు. నా మిత్రులు అద్దంకి దయాకర్, అందెశ్రీ మన రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఈ చిత్రానికి పన్ను మినహాయింపు ఇప్పిస్తామన్నారు. దానికి వాళ్లకు కృతజ్ఞతలు.

# అరటి పండుతో కలిపి ఈ ఆహార పదార్థాలను తీసుకోకండి



సూపర్ ఫ్రూట్‌గా పేరొందిన బనానా ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ ఫ్రూట్‌గా పోషకాల గనిగా ప్రజల మన్ననలు పొందింది. అరటి పండు ఫ్రూట్‌గా, కూరగాయగానూ, భోజనం వడ్డించే ఆకుగానూ పలు రకాలుగా సేవలు అందిస్తుంది. అరటి పండులో ఫైబర్, ప్రొటీన్, ఆరోగ్యకర కొవ్వులు, పలు అత్యవసర మినరల్స్, విటమిన్లు ఉంటాయి. అయితే జలుబు, దగ్గుతో బాధపడే వారు, మధుమేహులు అరటి పండు తీసుకోరాదని చెబుతుంటారు.

అయితే అరటి పండును సరైన మోతాదులో మితంగా, తగిన సమయంలో తీసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు సొంతం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అరటి పండును కొన్ని ఆహార పదార్థాలతో కలిపి తీసుకోవడం మాత్రం సరైంది కాదని, అలాంటి అలవాట్లను వదులుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

బనానాను పాలతో కలిపి తీసుకోవడం మేలు చేయదని అరటి పండు సహజంగా ఆమ్లత్వంతో కూడినది కాగా, పాలు స్వీట్ అని ఈ రెండింటిని కలిపి తీసుకుంటే జీర్ణక్రియలో ఇబ్బందులు తలెత్తుతాయని ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ సూర్య భాగవతి తెలిపారు. ఇది సరైన కాంబినేషన్ కాదని పరస్పర విరుద్ధ ఆహారాలను ఒకేసారి కలిపి తీసుకోరాదని అన్నారు. అలాగే అరటి పండును రెడ్ మీట్‌తో పాటు తీసుకోరాదు.

అరటిలో జీర్ణక్రయి సాఫీగా సాగేలా చూసే ప్యూరిన్ ఉంటుందని అయితే రెడ్‌మీట్‌లో ఉండే అధిక ప్రొటీన్ జీర్ణక్రియను నెమ్మదింపచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. రెండూ పరస్పర విరుద్ధ స్వభావాలు కలిగిన ఆహారాలను ఒకేసారి తీసుకుంటే గ్యాస్ సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఇక అరటిని బేక్డ్ గూడ్స్ జామ, నిమ్మ, దానిమ్మ, స్ట్రాబెర్రీస్ వంటి సిట్రస్ ఫ్రూట్స్‌తో కలిపి తీసుకోరాదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

# చింతపండులో ఇన్ని ఔషధ గుణాలున్నాయా ?



చింతపండు లేని భారతీయ వంటకాల్ని ఊహించడం కష్టం. మనవైన షడ్రుచులలో చింతపండు పులుపునకు ప్రతీక. ఆ పులుపే దాని ఔషధ గుణాలకు కారణం కూడా. చింతపండులోని పైరాజిన్, లిమనీన్ లాంటి పదార్థాలకు అనేక ప్రత్యేకతలు..

మలేరియా: చింతపండు కషాయంతో మలేరియాను ఎదుర్కొనే విధానం సంప్రదాయ వైద్యంలో కనిపిస్తుంది.

పసరికలు: చింతాకులను మరిగించి, ఆ నీరు తాగితే పచ్చకామెర్లు దూరం అవుతాయని నమ్మకం.

మలబద్ధకం: ఈ సమస్యను సరిదిద్దే గుణం చింతపండులో అపారం. ఇది విరేచనకారిగా పనిచేసి కడుపును శుభ్రం చేస్తుంది.

కొలెస్ట్రాల్: చెడు కొవ్వును తగ్గించి, గుండెను పదిలంగా ఉంచే లక్షణం చింతపండుకు ఉంది.

క్యాన్సర్: చింతపండులోని యాంటీఆక్సిడెంట్స్ వల్ల క్యాన్సర్ కారకాలు వృద్ధి చెందవు. ఇంతేనా! చింతపండుతో ఇన్ఫెక్షన్లు దూరం అవుతాయి. ఊపిరితిత్తులు, కళ్లు, చర్మం ఆరోగ్యంగా ఉంటాయి. నొప్పులు, జ్వరాల నుంచి ఉపశమనం లభిస్తుంది. మోతాదుకు మించకుండా, వంటలో భాగంగా వాడే కాస్తంత చింతపండు%ొా% ఆరోగ్యపరమైన చింతలన్నిటినీ దూరం చేస్తుంది. కాకపోతే, వైద్యుల సలహా తప్పనిసరి.

# హెల్త్ రిజల్యూషన్స్ కొనసాగించాలంటే వీటిని పాటిస్తే మేలు

న్యూఢిల్లీ : బరువు తగ్గడం నుంచి ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండేందుకు ఏడాది పొడవునా యాక్షన్ ప్లాన్‌తో టార్గెట్ చేరుకోవాలని కొత్త ఏడాది మనలో చాలా మంది న్యూ ఇయర్ లక్ష్యాలుగా నిర్ధేశించుకుంటారు. ఓ వారం పదిరోజులు ఆ ప్రక్రియను ఉత్సాహంగా కొనసాగించి ఆపై క్రమంగా రొటీన్‌లో పడిపోయి ఆరోగ్య లక్ష్యాలను అటకెక్కిస్తుంటారు.

కొద్ది మంది మాత్రం తుదికంటూ ప్రయత్నాలను కొనసాగిస్తూ లక్ష్యాలను చేరుకుంటారు. న్యూ ఇయర్ రిజల్యూషన్స్‌లో ఆరోగ్య లక్ష్యాలే అధికంగా ఎంచుకుంటారని వీటిని చేరుకునేందుకు క్రమశిక్షణతో కూడిన కసరత్తు, మానసిక స్థైర్యం, తుదికంటూ కొనసాగించాలనే పట్టుదల కీలకమని ఫోర్టిస్ హాస్పిటల్స్‌కు చెందిన మెంటల్ హెల్త్, బిహేవియరల్ సైన్సెస్ అసోసియేట్ కన్సల్టెంట్ డాక్టర్ త్రిదీప్ చౌధరి పేర్కొన్నారు.



ఏడాది పొడవునా మీ లక్ష్యాలకు అనుగుణంగా ప్రస్థానం సాగేలా, హెల్త్ గేమ్ నిరంతరాయంగా కొనసాగేలా పలువురు న్యూట్రిషనిస్ట్‌లు, డైటీషియన్స్ టిప్స్ అందిస్తున్నారు. వ్యాయామం, పోషకాహారంతో కూడిన బ్యాలెన్స్ ప్లాన్‌తో ముందుకెళ్లాలని వారు సూచిస్తున్నారు.

# చర్మానికి.. ఇదేం ఖర్మ?




చలికాలం చర్మం పగలడానికి బయటి వాతావరణం ఒక కారణమైతే, చలి కారణంగా తగినన్ని మంచినీళ్లు తీసుకోకపోవడం మరో కారణం. కాలంతో సంబంధం లేకుండా.. రోజూ తప్పకుండా రెండు లీటర్ల నీళ్లు తాగాల్సిందే. ముఖ్యంగా శరీరంలోంచి చెమట బయటికి పోకపోవడం వల్ల కూడా చర్మం రంగు తగ్గినట్టు కనిపిస్తుంది. చర్మ సంరక్షణలో విటమిన్-ఇ కీలకపాత్ర పోషిస్తుంది. బాదం గింజల్లో ఇది ఎక్కువగా ఉంటుంది. నానబెట్టి కానీ, నేరుగా కానీ రోజుకు పది గింజలు తింటే చర్మానికి కొత్త నిగారింపు వస్తుంది. చర్మం కాంతిమంతంగా కనిపించడానికి విటమిన్-డి కూడా తోడ్పడుతుంది. అందుకే, విటమిన్-డి ఫోర్టిఫైడ్ పాలు తాగాలి. అందులోని ప్రొటీన్ కూడా చర్మానికి మేలు చేస్తుంది. దాల్చిన చెక్కకు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు అపారం. పగిలిన చర్మం ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా ఇది కాపాడుతుంది. కాబట్టి, దాల్చిన చెక్క ముక్కను నీళ్లల్లో నానబెట్టి ఆ నీటిని తాగవచ్చు. మజ్జిగలో ఆ పొడి వేసుకునీ తాగొచ్చు.

గెనుసుగడ్డలోని బీటాకెరోటిన్ చర్మం దెబ్బతినకుండా కాపాడుతుంది, యవ్వనంగానూ ఉంచుతుంది. నారింజలో లభించే విటమిన్-సి చర్మంలోని కొలాజెన్‌ను పెంచి, సాగే గుణాన్ని పటిష్ఠం చేస్తుంది. సాల్మన్ చేప, వాల్‌నట్స్, గుమ్మడి, అవిసె గింజల్లో ఉండే ఒమేగా3 ఫ్యాటీ ఆమ్లాలు కూడా చర్మానికి మేలు చేస్తాయి. ముఖ్యంగా అవిసె గింజలు నానబెట్టి తిన్నా, పొడి రూపంలో తీసుకున్నా చర్మానికి మెరుపు ఖాయం. ఆకుకూరల్లో విటమిన్-ఎతో పాటు ఇ, యాంటీ ఆక్సిడెంట్లు కూడా చర్మాన్ని తాజాగా ఉంచుతాయి. కూరగాయల్లో క్యారెట్, బీట్‌రూట్ ఈ కోవలోనివే. ద్రాక్షలాంటి పండ్లతో పాటు.. సపోట, స్ట్రాబెర్రీ, మల్‌బెర్రీ మంచి యాంటీ ఆక్సిడెంట్లు. చర్మానికి నిత్య యవ్వనాన్ని ఇవ్వడంతో పాటు.. తేమగా ఉంచేందుకు సాయపడతాయి. కాబట్టి చర్మ సమస్యల్ని నిర్లక్ష్యం చేయొద్దు.

# మా బాబు ఆరేండ్లు వచ్చినా ఇంకా పొట్టిగానే ఉన్నాడు.. ఇదేమైనా లోపమా ?

మా బాబు వయసు ఆరేండ్లు. మిగిలిన పిల్లలతో పోలిస్తే చాలా పొట్టిగా ఉంటాడు. మా వైపు కానీ, మా వారి వైపు కానీ అందరూ పొడుగే. ఆ ఒక్క లోపం మినహా, బాబు చురుగ్గానే ఉంటాడు. ఇదేమైనా లోపమా? దీనివల్ల భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉంటాయి?



పిల్లలు పొట్టిగా ఉండటానికి కారణాలు అనేకం. కొంతమంది జన్మతః పొట్టిగానే పుడతారు. అదే క్రమంలో పెరుగుతూ పోతారు. పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు తన ఎత్తు, బరువు మొదలైన 'గ్రాఫ్ చార్ట్' బాగానే ఉంటే.. ఆందోళన చెందాల్సిన పన్లేదు. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల వల్ల కూడా పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుంది. పిట్యూటరీ, థైరాయిడ్ గ్రంథి లోపాలు, జన్యుపరమైన పరిమితుల వల్ల ఇలా జరగొచ్చు. గుండె సమస్యలు, పేగుల రుగ్మతలు కూడా ఎదుగుదలను నిరోధిస్తాయి.

సాధారణంగా తల్లిదండ్రుల ఎత్తును బట్టి పిల్లల సగటు ఎత్తును నిర్ధారిస్తాం. దీన్నే మిడ్ పేరెంటల్ రేంజ్ అంటారు. కొన్నిసార్లు పిల్లలు మొదట్లో పొట్టిగానే ఉన్నా ఆ తర్వాత వేగంగా పెరుగుతారు. ఈ క్రమాన్ని కాన్‌స్టిట్యూషనల్ డిలేగా వ్యవహరిస్తారు. సమగ్ర పరీక్షల తర్వాతే ఈ సమస్యకు కారణం తెలుస్తుంది. ఒకసారి పీడియాట్రిక్ ఎండోక్రైనాలజిస్ట్‌ను సంప్రదించడం ఉత్తమం. పొడుగ్గా లేకపోవడం పెద్ద లోపమేం కాదు, కాకపోతే పిల్లల ఆత్మవిశ్వాసాన్ని కొంత దెబ్బతీస్తుంది.

# ఈ సీజన్‌లో ఇమ్యూనిటీ మెరుగుపడాలంటే..!



న్యూఢిల్లీ : శీతల గాలులతో దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలిపులి పంజాకు ప్రజలు వణుకుతున్నారు. వింటర్‌లో చలి వాతావరణానికి తోడు వైరల్ ఇన్ఫెక్షన్లు, జ్వరం, దగ్గు, జలుబు వెంటాడుతున్నాయి. ఈ సీజన్‌లో ఆరోగ్యంగా ఉండేందుకు రోగనిరోధక వ్యవస్థ బలోపేతంగా ఉండేలా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఈ సీజన్‌లో చలికి తోడు కాలుష్యం ఇమ్యూనిటీని దెబ్బతీయడం ద్వారా పలు ఇన్ఫెక్షన్లతో పాటు శ్వాసకోశ వ్యాధుల ముప్పును పెంచుతుంది. ఈ సీజన్‌లో రోగనిరోధక వ్యవస్థ బలోపేతం కోసం పండ్లు, కూరగాయలు, విటమిన్స్, మినరల్స్‌తో కూడిన సమతులాహారం తీసుకోవాలి. విటమిన్ సీ, జింక్, ఐరన్‌తో కూడిన ఆహారాలు మన రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తాయి.

ఇక ఈ సీజన్‌లో పోషకాలను శరీరంలోని కణాలకు చేరవేసి, వ్యర్థాలను బయటకు పంపే వ్యవస్థ సవ్యంగా పనిచేయాలంటే తరచూ తగినంత నీరు తీసుకోవాలి. డీహైడ్రేషన్‌కు గురిచేసే మద్యాన్ని మితంగా తీసుకుంటూ రోజుకు కనీసం 2 లీటర్లు పైగా నీటిని తీసుకోవాలి. ఇక వింటర్‌లో ఇమ్యూనిటీ మెరుగుపడాలంటే ఈ జాగ్రత్తలు పాటించాలి

# పాల ఉత్పత్తులతో కడుపుబ్బరం : ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే..!

న్యూఢిల్లీ : పాలు, పాల ఉత్పత్తులు తీసుకునే కొందరిలో ముఖ్యంగా లాక్టోజ్ పడనివారిలో వీటిని తీసుకున్న వెంటనే కడుపుబ్బరం, వికారం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. పాలు, పాల ఉత్పత్తులు తీసుకోవడం వల్ల కడుపుబ్బరం వంటి సమస్యలు ఎందుకు తలెత్తుతాయి, వాటి నుంచి ఎలా బయటపడవచ్చనే అంశాలను న్యూట్రిషనిస్ట్ అంజలి ముఖర్జీ వివరించారు.

పాల ఉత్పత్తులతో కడుపుబ్బరం వంటి సమస్యలు తలెత్తే వారు ఆహారం నుంచి డైరీ ఉత్పత్తులను తగ్గించడం లేదా పూర్తిగా మానివేయడం మేలని అంజలి సూచిస్తున్నారు. బాదం పాలు, సోయా పాలు, ఓట్ మిల్క్ వంటి లాక్టోజ్ రహిత పాలను తీసుకోవచ్చని చెబుతున్నారు. యోగర్ట్ వంటి పులిసిన పాల ఉత్పత్తులు, తక్కువ లాక్టోజ్ ఉండే వెన్న వంటి పదార్థాలను తీసుకోవచ్చని, వీటిలో ప్రొబయాటిక్స్ ఆరోగ్యానికి మేలు చేస్తాయని, జీర్ణక్రియ సాఫీగా సాగేలా చూస్తాయని చెప్పారు.

లాక్టోజ్ పడనివారు డైరీ ఉత్పత్తులను తీసుకునేముందు లాక్టోజ్ సప్లిమెంట్స్ తీసుకోవడం ద్వారా మెరుగైన ఫలితాలు ఉంటాయి. లాక్టోజ్ సరిపడకపోవడంతో అంతగా బాధపడని వారు తమ ఆహారంలో పరిమితంగా మిల్క్, డైరీ ఉత్పత్తులను మెల్లిగా తీసుకోవడం ప్రారంభించాలి. శరీరం ఈ ఆహారానికి అలవాటు పడేలా చేస్తే కడుపుబ్బరం, వికారం వంటి సమస్యలను అధిగమించవచ్చు.



Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy